12-7Pg1exHMNWJQE_12-7Pg1exHMNWJQE.qxd 12/Jul/26 12:08 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 162 పేజీలు: 12 వెల: 8.00

భారత్‌లో భారీగా న్యూజిలాండ్ పెట్టుబడులు

నన్ను చంపితే ఇరాన్ పూర్తిగా ధ్వంసమే: ట్రంప్ 9లో

## వియత్నాం విషాదం

# సముద్రంలో పడవ బోల్తా

### 15 మంది భారతీయులు మృతి

### వారిలో ఏపికి చెందిన ముగ్గురు

### పడవలో మొత్తం 36 మంది

### బాధితులకోసం సహాయక కేంద్రాలు ఏర్పాటు

### తమ పంపిణీదార్లను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లిన ఓ మొబైల్ కంపెనీ



సముద్రంలో బోల్తా పడిన పడవ

**హనోయ్/న్యూఢిల్లీ:** వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో శనివారం జరిగిన ఘోర పడవ ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు మృతి చెందారు. మృతుల్లో 13 మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ఉన్నారు. కడపజిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీలు మరణించినట్లు ధృవీకరించారు. మరో కడప పంపిణీదారు తీరంలోనే ఉండటంతో ప్రాణాలుదక్కించుకున్నాడు. మరోముగ్గురు ఏపి వాసులు >>2

### కడప, మచిలీపట్నం, హిందూపురం వాసులు ముగ్గురు మృతి 2లో

## 'మైక్రో' వద్దు..

# ఉమ్మడి ముద్దు



### జనంతోనే అభివృద్ధి, భవిష్యత్తు

### యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం సమాజానికి ఆస్తి

### పిల్లలే సంపద కార్యక్రమానికి నాంది

### ప్రపంచ జనాభా దినోత్సవంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా నియంత్రణ కాకుండా జనాభా సంరక్షణ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సమీప భవిష్యత్తులోనే 'పిల్లలే సంపద' అనే మాటను నిజం చేసి చూపుతామని సిఎం అన్నారు. విజయవాడలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గతంలో జనాభా నియంత్రణ కోసం ప్రభుత్వాలు పనిచేశాయని దీని కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు కలిగిన వారిని అనర్హులు చేస్తూ నిబంధనలు కూడా తెచ్చామని... ప్రస్తుతం పరిస్థితులు మారాయని సిఎం స్పష్టంచేశారు. దీనికి అనుగుణంగా ఇప్పుడు విధానాలను మార్చుకోవాల్సిన తరుణం వచ్చేసిందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఫెర్టిలిటీ రేట్ గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉందని... భవిష్యత్తులో జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తుగా పరిస్థితులు మారతాయని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 40కి పైగాదేశాల్లో జనాభా తగ్గిపోతోందని ఆయనఅన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "పిల్లలే సంపద కార్యక్రమానికి ఇవాల్టి నుంచే నాంది పలకాలని భావిస్తున్నాం. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరో మారు గుర్తు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. జనాభా నియంత్రణ కాదు జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. గతంలో జనాభా నియంత్రణపై ఆలోచన చేశాం. దానికి అనుగుణంగా ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టాయి.

మహిళల్లో అక్షరాస్యత పెరిగితేనే జనాభా నియంత్రణ సాధ్యమని అప్పట్లో ఆలోచన చేశాం. స్థానిక సంస్థల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలుఉంటే పోటీకి అనర్హత అనే నిబంధనలు కూడా పెట్టాం. ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి, ముగ్గురు వద్దు అనే లాంటి ప్రచారాలు కూడా >>2



## దిగ్గజ గాయని 'నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా'

# ఎస్ జానకి ఇక లేరు

### మైసూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

### 48 వేలు పైగా పాటలు పాడిన గొప్ప గాయని

### 4 జాతీయ, 10 నంది అవార్డులు ఆమె సొంతం

### కేరళం ప్రభుత్వం నుంచి 11 అవార్డులు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** సుప్రసిద్ధ నేపథ్య గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని తన సొంత ఇంట్లో వుండగా శనివారం సాయంత్రం గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు వెంటనే అపోలో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె వయస్సు 88 యేళ్లు. జానకి పూర్తి పేరు శిష్టా శ్రీరామమూర్తి జానకి. ఎపిలోని గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్లలో ఆమె 1938 ఏప్రిల్ 23న శ్రీరామ మూర్తి, సత్యవతి దంపతులకు జన్మించారు. జానకి తండ్రి ఉపాధ్యాయుడుగా ఆయుర్వేద వైద్యుడి గా సేవలందించారు. ఆ సమయంలో జానకి తండ్రి ఉద్యోగరీత్యా కొంత కాలం కరీంనగర్‌లోని సిరిసిల్లాలో పనిచేశారు. చిన్నతనం నుంచే సంగీతంపై మక్కువ పెంచుకున్న జానకి మూడేళ్ల వయస్సులోనే వేదికలపై పాటలు పాడేవారు. నాదస్వర విద్వాంసుడు పైడిస్వామి వద్ద జానకి సంగీత సాధన చేసి గాయనిగా పేరు సంపాదించారు. అప్పట్లో లతా మంగేష్కర్, జిక్కి, లీల వంటి గాయకులు ఆలపించిన పాటలను జానకి వివిధ కార్యక్రమాల్లో ఆలపించి అందరి మన్ననలు అందుకున్నారు. 19 ఏళ్ల వయస్సులో తన మామయ్య సూచన మేరకు చెన్నై చేరుకున్న జానకి ఎవిఎం స్టూడియోలో తొలిసారిగా గాత్రాన్ని విపించారు. దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంలో 50 వేల పాటలు పాడిన >>2



## డి.సిఎం పవన్‌కు ముంబయిలో శస్త్రచికిత్స

### కుడి భుజానికి మూడున్నర గంటలు సర్జరీ

**విజయవాడ,జులై11, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి శనివారం ఉదయం ముంబయిలో శస్త్ర చికిత్స జరిగింది. ఆయన రెండు భుజాలకు రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్ తీవ్రంగా ఉన్నాయి. ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు వీలైనంత త్వరగా శస్త్ర చికిత్స అవసరమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. అప్పటికే పవన్ కల్యాణ్ నిర్వహించాల్సిన అధికారిక కార్యక్రమాలు నిర్ణయం అయినందున వాటిని ముగించుకొన్న తరువాత శస్త్రచికిత్స చేయించుకొంటాను అని పవన్ కల్యాణ్ వైద్యులకు >>2

## సముద్ర రక్షణలో భారత్‌కు కొత్త శక్తి

### అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని నౌకాదళంలో ప్రవేశపెట్టిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

### ఆత్మనిర్భర్ భారత్‌కు మరో మైలురాయి



'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'



శనివారం విశాఖలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని నౌకాదళానికి అందజేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

**విశాఖపట్నం, జులై 11, ప్రభాతవార్త :** భారత నౌకాదళ శక్తిని మరింత పటిష్ఠం చేస్తూ స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన అత్యాధునిక స్టెల్త్ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' శనివారం విశాఖలో ఘనంగా భారత నౌకాదళంలో చేరింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో జరిగిన కమిషనింగ్ కార్యక్రమం భారత రక్షణ రంగ స్వావలంబనకు మరో చారిత్రక ఘట్టంగా నిలిచింది. 75 శాతానికి పైగా స్వదేశీ విడిభాగాలతో నిర్మితమైన ఈ యుద్ధనౌక ప్రాజెక్ట్ 17ఎ కింద రూపొందించిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్. భారత నౌకాదళ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేయగా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. సుమారు 6,670 టన్నుల సామర్థంతో, గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించే ఈ యుద్ధనౌక వైమానిక, సముద్ర ఉపరితల, జలాంతర్గామి దాడులను సమర్థంగా తిప్పికొట్టే అత్యాధునిక సామర్థ్యాలనుకలిగిఉంది. ఈ సంద >>2

## ఉద్యోగుల సమస్యలు

# పరిష్కరిస్తాం

### మంత్రులు పార్థసారథి, సత్యప్రసాద్ హామీ

### 21న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం



శనివారం మీడియా సమావేశంలో మంత్రులు పార్థసారధి, సత్యప్రసాద్

**విజయవాడ:జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని సమాచారపౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి,రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌లు స్పష్టం చేశారు.ఎపి సచివాలయంలో ఎపి జెఎసి అమరావతి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివారం ఇరువురు మంత్రుల నేతృత్వంలో సమావేశమై ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రాధమికంగా చర్చించారు. ఈసమావేశం అనంతరం మంత్రులు ఇరువురు మీడియాతో మాట్లాడగా ముందుగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఈసమావేశంలో రాష్ట్ర ఆర్థిమంత్రి వర్యులు పయ్యావుల కేశవ్ హాజరు కావాల్సి ఉండగా ముందస్తు కార్యక్రమాలు మూలంగా ఆయన రాలేకపోయారని స్పష్టంచేశారు. గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా సమస్యలను ప్రక్కన పెట్టడంతో ఈసమస్య వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మొత్తం 23 డిమాండ్లను ఇవ్వడం జరిగిందని వాటన్నిటినీ మంత్రులు ఇరువురం క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని ఉద్యోగుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి పూర్తి సానుకూలంగా ఉన్నారని అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను కూడా >>2

## నాగరాజు పోలీస్ కస్టడీ విచారణపై సుప్రీంకోర్టుకు సిట్

**విజయవాడ.జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో తీవ్ర సంచలనం సృష్టించిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక మాజీ సిఐ నాగరాజు పోలీస్ కస్టడీ విచారణపై రాష్ట్ర హైకోర్టు విధించిన కఠినమైన నిబంధనలను సవాలు చేస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు పెట్టిన కొన్ని నిబంధనలు దర్యాప్తు స్వేచ్ఛను హరించేలా ఉన్నాయంటూ ప్రభుత్వం ఈ పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేసింది. ముఖ్యంగా నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న హైకోర్టు షరతును సిట్‌అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల అత్యంత కీలకమైన ఈ కేసు దర్యాప్తులో గోప్యతదెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కరోనా వ్యాప్తికి

# అడ్డుకట్ట వేయండి

### నిబంధనలు కచ్చితంగా పాటించండి: మంత్రి సవిత

**విజయవాడ, జులై 11,ప్రభాతవార్తప్రతినిధి:** కడప జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశించారు. అదే సమయంలో కరోనా నివారణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కొవిడ్ 19 నిబంధనలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శ్రీధర్‌ను, డిఎంహెచ్ఒ రవిబాబును ఫోన్లో ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కడపలో ఎనిమిది కరోనా కేసులు నమోదు కావడమే కాకుండా ఇద్దరు మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ 19 నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. స్థానికుల్లో కరోనా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, ఆసుపత్రుల వద్ద మాస్కులు వాడకం తప్పనిసరి చేయాలన్నారు. జ్వరం, దగ్గు, ఇతర కోవిడ్ లక్షణాలున్న వారిని గుర్తించి ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్, డిఎంహెచ్ఒ రవిబాబు మాట్లాడుతూ, ఎనిమిది కరోనా కేసులు మినహా కొత్తగా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుత కరోనా వెరియంట్ వ్యాప్తిపై శాంపిల్లను పూణే ల్యాబ్‌కు పంపామన్నారు. ప్రస్తుతం నమోదైన కరోనా వేగవంతంగా వ్యాప్తి చెందుతుందా... నెమ్మదిగా సోకుతుందా? అనేది ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టులో వెల్లడవుతుందన్నారు. ఇప్పటికే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టామని, బ్లీచింగ్ వెదజల్లామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కరోనా నమోదైన కుటుంబాల్లో సభ్యులకు కూడా తక్షణమే పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ >>2

# తుపాకీ కంటే కలం గొప్పది

### పుస్తకమే సమాజాన్ని మారుస్తుంది

### తెలుగు భాష, మహిళా గౌరవ పరిరక్షణ

### ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత

### 3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభల్లో హోంమంత్రి అనిత



శనివారం 3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలో ప్రసంగిస్తున్న మంత్రి అనిత

**విజయవాడ,జూలై 11వ,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలకు మాత్రమే కాదు... అబ్బాయిలకు కూడా విలువలు, గౌరవం నేర్పించే సమయం వచ్చిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.'అమ్మ' అనే ఒక్క పదంలోనే తెలుగు మమకారం, సంస్కృతి, ఆత్మీయత అంతా నిక్షిప్తమై ఉంది"ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత విద్యాశాఖా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా నిర్వహించిన 3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలు-2026'లోహోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు భాష, సాహిత్యం, మహిళా సాధికారత, పుస్తక పఠనం, సామాజిక విలువలు, మహిళల గౌరవ పరిరక్షణ వంటి అంశాలపై మంత్రి మాట్లాడుతూ దివిసీమ గాంధీగా పేరుపొందిన మండలి వెంకట కృష్ణారావు తెలుగుభాష, తెలుగు సంస్కృతి, సామాజిక సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. 1975లో హైదరాబాద్‌లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో కీలకపాత్రపోషించి, ప్రపంచవ్యాప్తంగాఉన్న తెలుగు వారిని ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలుగు భాషకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో ఆయన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మండలి కుటుంబం తెలుగు భాషా పరిరక్షణను వారసత్వంగా కొనసాగిస్తోందని పేర్కొంటూ మండలి బుద్ధప్రసాద్ గారిని అభినందించారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో డిప్యూటీ స్పీకర్‌గా >>2

12-7pg2exHMNWJQE_12-7pg2exHMNWJQE.qxd 12/Jul/26 12:11 AM Page 1





శనివారం విశాఖపట్నంలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

# సముద్రంలో పడవ బోల్తా

>> ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పర్యాటకులతో ప్రయాణిస్తున్న పడవ బలమైన గాలులు, అలల కారణంగా బోల్తా పడింది. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 36 మంది ఉన్నారు.ప్రమాదం అనంతరం 21 మందిని సహాయక బృందాలు రక్షించి ఆస్పత్రులకు తరలించాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వియత్నాం ప్రభుత్వ మీడియా వెల్లడించింది. మిగిలిన వారి కోసం స్థానిక అధికారులు గాలింపు, సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.స్థానిక మీడియా కథనాల ప్రకారం పడవలో 32 మంది భారతీయ పర్యాటకులు, ముగ్గురు సిబ్బంది, సహాయకుడు ప్రయాణిస్తున్నారు. హోన్ మే రుట్ స్గోయి ద్వీపం నుంచి ఆన్ థోయ్ నౌకాశ్రయానికి బయలుదేరిన కొద్దిసేపటికే బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా పడవ బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు, సిబ్బంది అంతా నీటిలో పడిపోయారు.ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, స్థానిక అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారని తెలిపింది. బాధితులకు అవసరమైన కాన్సులర్ సేవలు అందించేందుకు భారత రాయబారి, రాయబార కార్యాలయ అధికారులు ఫు క్వోక్ ద్వీపానికి బయలుదేరినట్లు వెల్లడించింది. దక్షిణ భారతానికి చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు, ఉద్యోగులు మొత్తం 110 మంది విహారయాత్ర కోసం వియత్నాం వెళ్లినట్లు సమాచారం.ఈ విషాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రిత్వ శాఖ వియత్నాం అధికారులతో సన్నిహితంగా పనిచేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఇంకా గల్లంతైన వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ప్రమాదంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు ఉన్నారనే సమాచారం నేపథ్యంలో ఢిల్లీలోని ఏపి భవన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుంచి వివరాలు కోరారు. విహారయాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన కొందరు ఈ ప్రమాదంలో చిక్కుకుని ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపినట్లు సమాచారం.బాధితులు, వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.

ఒక మొబైల్‌కంపెనీ భారత్‌నుంచి తమ పంపిణీదార్ల కుటుంబాలను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లింది. మొత్తం 250 మంది ఈ యాత్రకువెళ్లారు. ఎపినుంచి 35, తెలంగాణనుంచి 40 మందివరకూ ఉన్నారు. ట్రిప్‌లోభాగంగా మూడుపడవల్లో సముద్రంలో విహార యాత్రకువెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో హాన్‌మేరుట్‌నుంచి అన్‌థోయ్‌పోర్టుకు ఒక స్పీడ్‌బోట్ బయలుదేరింది. అందులో 32 మంది భారతీయులు నలుగురు సిబ్బంది ఉన్నారు. పడవ తీరానికి 400మీటర్ల దూరంలోఉండగా ఒక్కసారిగా బోల్తాపడింది. దీనితోప్రయాణీకులు నీటిలోమునిగిపోయారు. సమీపంలోని ఇతర పార్యటక బోట్లనిర్వాహకులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలుచేపట్టారు. గల్లంతయిన వారికోసం గాలింపు జరుగుతోంది. బోటులో ప్రయాణించిన 32 మంది ప్రయాణీకుల జాబితాను భారత రాయబార కార్యాలయం విడుదలచేసింది.

# కడప, మచిలీపట్నం, హిందూపురం వాసులు ముగ్గురు మృతి

**విజయవాడ, జులై 11, ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాం ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో స్పీడ్ బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది భారత టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు టూరిస్టులున్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ మరణించారు. కడపకుచెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డునఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. మరొకరు బందరువాసి గెల్లి కిశోర్‌కు తీవ్ర అస్వస్థతకుగురై పరిస్థితి విషమంగా ఉంది.



మృతి చెందిన శ్రీధర్ (ఫైల్)



మృతిచెందిన జయశ్రీ (ఫైల్)

**సంఘటనపై మంత్రి లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి, తక్షణ సాయం కోసం ఆదేశాలు**

వియత్నాంలో జరిగిన బోటు ప్రమాదంపై అక్కడి భారత ఎంబసీ అధికారులతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌మాట్లాడారు. తక్షణ సాయం అందేలా చూడాలని లోకేష్ కోరారు. తెలుగు వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు. వియత్నాంలో జరిగిన బోటు ప్రమాద ఘటనపై దేశ, రాష్ట్ర ఉన్నతాధికారు లతో మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. ఢిలీంలలోని ఎపి భవన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన వారు ప్రాణాపాయంలో చిక్కుకున్నారన్న సమాచారంపై అధికారులను వివరాలు ఆరా తీశారు. ఎపినుంచి విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులు ప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోందని అధికారులు తెలిపారు. బోటు ప్రమాదంపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. కేంద్రం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు సహాయం అందించాలని లోకేష్ సూచించారు.

# కరోనా వ్యాప్తికి అడ్డుకట్ట వేయండి

>>నమోదయితే వారిని కూడా ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. నెగిటివ్ వస్తే... కొద్ది రోజుల పాటు వారి ఇళ్లల్లోనే ఐసోలేషన్‌లో ఉంచాలని తెలిపారు. మరోమరణం సంభవించకుండా, ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఉన్నవారికి మెరుగైన వైద్యసేవలుఅందించాలని, జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌ను, డిఎంహెచ్‌ఒ రవిబాబుకు మంత్రి సవిత ఫోన్లో స్పష్టంచేశారు. వియత్నాం సందర్శనకు వెళ్లిన కడప వాసి, ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో ముడియం శ్రీధర్ సహా 15 మంది మృత్యువాతపడడం బాధాకరమన్నారు. సంతోషంగా ముగియాల్సిన విదేశీ టూర్ విషాదంగా ముగియడంపై ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని మంత్రి సవిత వ్యక్తంచేశారు.

# ‘మైక్రో’ వద్దు.. ఉమ్మడి ముద్దు

>> చేశాం. 20 యేళ్ల క్రితం ఐటి లాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని సంపద సృష్టించాం. అప్పుడు ఐటి, ఇప్పుడు ఎఐ గురించి మాట్లాడుతున్నాను. జనాభా నిర్వహణ గురించి కూడా చర్చిస్తున్నాం. ఆడబిడ్డల్ని చదివిస్తేనే కుటుంబానికి ఆస్తి, గతంలో వరకట్నం ఉండేది ఇప్పుడు ఎదురు కట్నం అనే పరిస్థితి వచ్చింది. అందుకే మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ గురించి మాట్లాడుతున్నాం. టోటల్ ఫెర్టిలిటీ రేటు మన రాష్ట్రంలోనూ పెరగాల్సి ఉంది. ఎలాంటి అభివృద్ధి అయినా జనాభా ఉంటేనే అది సార్ధకం అవుతుంది” అని ముఖ్యమంత్రి అన్నారు.


ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో జనాభా గణనీయంగా తగ్గిపోతోంది. భారత్‌లో దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి కూడా అదే. మన అభివృద్ధి సంతులనం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం. అంగన్‌వాడీలు, పాఠశాలల్లోనూ చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ప్రతీ వంద మంది జనాభాలో 89శాతం మందికి రెండో సంతానం లేదు. ఎపిలోని విశాఖ లాంటి జిల్లాల్లోనూ ఫెర్టిలిటీ రేటు అతి తక్కువగా ఉంది. ఎపి విస్తీర్ణంలో 7 స్థానంలో ఉన్నా పాపులేషన్ డెన్సిటీలో దిగువన ఉన్నాం. పిల్లలే మన రాష్ట్ర సంపద. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఆర్థిక ప్రగతి సాధించేలా రాష్ట్రంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తున్నాం. పీ4 ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచుతున్నాం. అభివృద్ధి ప్రాజెక్టులు కూడా సమతూకంలో జరగాలనే అన్ని ప్రాంతాలకూ పరిశ్రమలు, ప్రాజెక్టులు వచ్చేలా చూస్తున్నాం. ఆర్థిక అసమానతలు తగ్గించి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జనాభా సంరక్షణ అనేదే ఈ సమయంలో కీలకం. జనాభా పెంచాలని మాట్లాడితే విమర్శలు వచ్చాయి. పిల్లలను పెంచటం అనేది కేవలం మహిళలు ఒక్కరిదే బాధ్యత మాత్రమే కాదు అది ఉమ్మడి బాధ్యత. కాన్పుల్లో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలి. మహిళల ఆరోగ్య రక్షణ అత్యంత కీలకం. జనాభా నిర్వహణ ఇక ఓ వాస్తవిక అంశం అని గుర్తించాలి. సంతానం వద్దనుకునే దంపతులు పెరగటం దురదృష్టకరం. మైక్రో ఫ్యామిలీలు వద్దుభారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శం. పిల్లలే సంపద ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష” అని ముఖ్యమంత్రి వివరించారు

**సామాజిక మాధ్యమాలతో మానసిక సమస్యలు..**

“ఇవాళ తెలంగాణాలో జరిగిన ఘటన అత్యంత బాధాకరం. పోక్సో కేసులో ఉన్న నిందితుడు తనపై కేసు పెట్టిన వారి కుటుంబంలో 6 గురిని హత్య చేశాడు. అత్యంత దారుణమైన ఘటన ఇది. సామాజిక మాధ్యమాలు బాధ్యతారహితంగా వినియోగించటం, అసభ్యకరమైన, హింసాత్మక దృశ్యాల కారణంగా మానసిక సంతులన కోల్పోతున్నారు. విలువైన సమయాన్ని కూడా వృధా చేసుకుంటున్నారు. సోషల్ మీడియా వ్యసనంగా మారితే ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతాయి. టెక్నాలజీ స్పిర్చువాలిటీ ద్వారా యువతకు ప్రపంచాన్ని జయించే శక్తి సొంతం అవుతుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సంజీవని కార్యక్రమం చేపట్టాం. యువతతో పాటు వృద్ధులు సమాజానికి ఆస్తిగా తయారు కావాలి. త్వరలో ప్రభుత్వం వృద్ధుల కోసం క్షేమం అనే కార్యక్రమాన్ని తీసుకురావాలని ఆలోచన చేస్తోంది. నిరంతరం నైపుణ్యాలను అందిపుచ్చు కుంటేనే అత్యుత్తమ మానవ వనరులు దేశానికి అందుతాయి. టెక్నాలజీ నాలెడ్జి ఉన్నా దేశంలో చాలా రంగాల్లో నాయకత్వ లేమి ఉంది. అంగన్‌వాడీల నుంచే పిల్లల ఆరోగ్యంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. పాఠశాలల్లో విద్య అందించేందుకు తల్లికి వందనం కింద ప్రతీ ఒక్కరికీ రూ.15వేల చొప్పున ఇస్తున్నాం. 2047 నాటికి మన తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేర్చాలన్నదే నా సంకల్పం. జనాభా లేకపోతే మనం చేసుకున్న అభివృద్ధి లక్ష్యాలను సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించే సత్తామనకుంది.“ అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనంతరం పాపులేషన్ మేనేజ్మెంట్ ఫ్రేమ్ వర్క్ డాక్యుమెంటేషన్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దే రామ్మోహన్ రావు, వైద్యారోగ్యం కుటంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీషా తదితరులు హాజరయ్యారు.

# సముద్ర రక్షణలో భారత్‌కు కొత్త శక్తి

>> ర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, “ఐఎన్ఎస్ మహేంద్రగిరి కేవలం యుద్ధనౌక మాత్రమే కాదు.. సాంకేతికంగా అత్యాధునిక, యుద్ధ సన్నద్ధ భారత నౌకాదళ నిర్మాణానికి ప్రతీక. ఇది ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి మరో గర్వకారణం” అని పేర్కొన్నారు.ఈ నౌకలో బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు, మధ్యశ్రేణి వైమానిక రక్షణ క్షిపణులు, జలాంతర్గామి నిరోధక ఆయుధాలు, అత్యాధునిక రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, మల్టీ రోల్ హెలికాప్టర్, అత్యాధునిక స్టెల్త్ సాంకేతికతను అమర్చారు. దీంతో భారత సముద్ర సరిహద్దుల రక్షణతో పాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఆధిపత్యం మరింత బలోపేతం కానుంది.డ్రోన్లు, కృత్రిమ మేధస్సు, సైబర్ యుద్ధం, హైపర్‌సోనిక్ ఆయుధాలు వంటి ఆధునిక సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో తదుపరి తరం సాంకేతికతలో భారీగా పెట్టుబడులు పెడుతూనే సంప్రదాయ సైనిక సామర్థ్యాలను కూడా మరింత బలోపేతం చేస్తామని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. “భవిష్యత్ యుద్ధాలు కృత్రిమ మేధస్సుతో సాగవచ్చు.. కానీ విజయాన్ని అందించేది దేశభక్తి, శిక్షణ పొందిన సైనికులే” అని అన్నారు.భారత్ హిందూ మహాసముద్ర ప్రాంతంలో విశ్వసనీయ భద్రతా భాగస్వామిగా ఎదిగిందని, సముద్ర దోపిడీ నిరోధక చర్యలు, విపత్తు సహాయక కార్యక్రమాలు, సంక్షోభ ప్రాంతాలనుంచి భారతీయులు, విదేశీయుల తరలింపులో భారత నౌకాదళం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన కొనియాడారు.తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరుతో నామకరణం చేసిన ఈ యుద్ధనౌక నిర్మాణంలో 200కు పైగా భారతీయ పరిశ్రమలు, అనేక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు భాగస్వామ్యం కావడం దేశీయ రక్షణ తయారీ రంగానికి నూతన ఉత్సాహాన్ని అందించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, తూర్పు నౌకాదళ కమాండ్ ఇన్‌చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ ప్రతినిధులు, నౌకాదళ ఉన్నతాధికారులు, మాజీ సైనికాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



# రాధా గాయత్రి భర్త శ్రీచరణ్ అరెస్ట్

**అదుపులోకి తీసుకున్న డెహ్రాడూన్ పోలీసులు**

**విశాఖపట్నం, జులై 11, ప్రభాతవార్త :** మస్సోరీ లోని కియానాహోమ్‌స్టేలో అనుమానాస్పద పరిస్థితుల్లో రాధాగాయత్రి మృతిచెందిన కేసులో ఆమెభర్త శ్రీచరణ్‌ను డెహ్రాడూన్ పోలీ సులు అరెస్టు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డెహ్రాడూన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, చరణ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ పొందారు. అనంతరం నిందితుడిని న్యూఢిల్లీలో అదుపులోకి తీసుకుని మసూరీకి తరలించారు. కోర్టులో హాజరుపరచగా,న్యాయస్థానం 14రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ జిల్లా కారాగారం సుద్ధోవాలాకు తరలించాలని ఆదేశించింది.

## వారం - వర్జ్యం

12-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
త్రయోదశి రా. 10.29
రోహిణి ఉ.8.28, మృగశిర తె.5.41
వర్జ్యం : మ.1.25-మ.2.50
శుభసమయం : ఉ.8.00-9.00
దు.సా.4.55-సా.5.47
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారితీస్తాయి. వస్త్రలాభం కలదు.

**వృషభం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మిథునం:** విమర్శలను లెక్కచేయక మీ ఆలోచనలకు రూపకల్పన చేస్తారు. జీవిత భాగస్వామితో సంయమనం పాటించడం మంచిది.

**కర్కాటకం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ఋణాలు తీరుస్తారు.

**సింహం:** పాతబాకీలు వసూలవుతాయి. ఓర్పుతో ముందుకు సాగుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య:** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. వృత్తిలో పురోభివృద్ధి సాధిస్తారు.

**తుల :** పనులలో ఆటంకాలు ఎదురైనా అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. స్వల్పధన లాభం పొందుతారు.

**వృశ్చికం:** ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. పై అధికారులతో మెలకువగా వ్యవహరించండి.

**ధనుస్సు:** ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ముఖ్యమైన విషయాలు వాయిదా వేయడం మంచిది.

**మకరం:** సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు. ఏకాంత చర్చలకు అనుకూలమైన సమయం కలదు.

**కుంభం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలుగుతుంది. కోర్టుకేసుల నుండి బయటపడతారు.

**మీనం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. స్త్రీ మూలంగా ధనలాభం పొందుతారు. స్థలాలు కొనుగోలుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తుపాకీ కంటే కలం గొప్పది

>> ఆయన అందించిన మార్గదర్శకత్వాన్ని ఎన్నటికీ మరిచిపోలేనని, “ఆయన నాకు గురువులాంటి వారు... శిరసు వంచి నమస్కరిస్తున్నాను” అని మంత్రి అన్నారు.తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన యద్దనపూడి సులోచనారాణి పేరును సభా ప్రాంగణానికి పెట్టడం ఆమె సాహిత్య సేవలకు దక్కిన గొప్ప గౌరవమని మంత్రి పేర్కొన్నారు. అలాగే రంగనాయకమ్మ, ఓల్గా (పి.లలిత కుమారి), వాసిరెడ్డి సీతాదేవి, డి.కామేశ్వరి వంటి ప్రముఖ రచయిత్రుల సేవలను కొనియాడారు.

అదే సమయంలో మహిళా సాధికారత, ప్రజాజీవితం, సామాజిక చైతన్యానికి విశేష సేవలందించిన నన్నపనేని రాజకుమారి గారిని ప్రత్యేకంగా అభినందిస్తూ, “నాకు మాత్రమే కాదు... రాష్ట్ర మహిళలందరికీ ఆమె స్ఫూర్తిదాయక నాయకురాలు” అని పేర్కొన్నారు.జస్టిస్ జ్యోతిర్మయి సమాజం పట్ల అంకితభావం కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు., ఈ కార్యక్రమంలో తనతో పాటు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.“తెలుగు తనం అనేది కేవలం భాష కాదు... అది మన సంస్కృతి, మన ఆత్మ“ అని మంత్రి అన్నారు. పిల్లలు ఇతర భాషల్లో మాట్లాడినా, ప్రేమలోనైనా, బాధలోనైనా, ఆప్యాయతలోనైనా వారి నోట మొదట వచ్చే పదం “అమ్మ“ అని పేర్కొన్నారు. ‘అమ్మఅనే ఒక్క పదంలోనే తెలుగు మాధుర్యం, మమకారం, అనుబంధం, ఆత్మీయత నిక్షిప్తమై ఉన్నాయి” అని తెలిపారు. తెలుగు భాషలో యాసలు మారినా మనసులు ఒక్కటేనని పేర్కొంటూ, శ్రీకాకుళం, కృష్ణా, రాయలసీమ, నెల్లూరు ప్రాంతాల యాసలు వేరైనా భాష గొప్పతనం మారదని అన్నారు. “ప్రాంతాలు వేరైనా... పలుకు వేరైనా... మనల్ని ఏకం చేసేది తెలుగు భాష, తెలుగు మమకారమే” అని పేర్కొన్నారు.హోంమంత్రిగా తన భద్రత కోసం తుపాకులు ఉన్నప్పటికీ, సమాజాన్ని మార్చే అసలైన శక్తి కలానిదేనని మంత్రి స్పష్టం చేశారు. “కత్తి కన్నా కలం గొప్పది... గన్ కన్నా పుస్తకం గొప్పది. తుపాకి భయాన్ని సృష్టిస్తుంది... పుస్తకం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది” అని అన్నారు.

చిన్నతనంలో తన తండ్రి పుస్తకాలు చదివే అలవాటు పెంచారని, అదే తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిందని గుర్తు చేసుకున్నారు. యువత పుస్తక పఠనాన్ని జీవనశైలిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు, సోషల్ మీడియాలో పెరుగుతున్న అసభ్యకర వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, మహిళలకు మాత్రమే కాదు... అబ్బాయిలకు కూడా మహిళలను గౌరవించడం, సంస్కారవంతంగా ప్రవర్తించడం, బాధ్యతతో వ్యవహరించడం నేర్పించే ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు.

“నేడు సోషల్ మీడియాలో తల్లి ఎదుట కూడా మాట్లాడలేని భాషను, భార్యతో కూడా ఉపయోగించలేని భాషను, సోదరి లేదా కుమార్తె ఎదుట పలకలేని పదాలను కొందరు ఉపయోగిస్తున్నారు. అలాంటి వికృత సంస్కృతికి సమాజంలో స్థానం ఉండకూడదు” అని మంత్రి అన్నారు.



పాట్నాలో శనివారం భారీ వరదల మధ్య రోడ్లపై అవస్థలు పడుతున్న జనం

# పవన్‌కు ముంబయిలో శస్త్రచికిత్స

>> తెలియచేశారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్ర చికిత్స చేయడం వల్ల నొప్పి తీవ్రత భరించలేని స్థాయిలో ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో కుడి భుజానికి సంబంధించిన రొటేటర్ కఫ్ ఇంజ్యూరీకి శనివారం ఆపరేషన్ చేశారు. ముందస్తుగా చేయాల్సిన వైద్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. శనివారం రోజున నిర్వహించిన ఆపరేషన్‌కు మూడున్నర గంటల సమయం పట్టినట్లు వైద్యులు తెలిపారు. మరో భుజానికి రెండు నెలల వ్యవధిలో శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. పవన్ కల్యాణ్ 2016లో భుజానికి గాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు తగిన విశ్రాంతి అవసరం అని సూచించినా సమావేశాలలో పాల్గొన్నారు. 2018లో చేపట్టిన పోరాట యాత్ర సందర్భంలో జనసేన పార్టీ శ్రేణులు తమ అభిమాన నాయకుడికి దగ్గరగా వెళ్లి చేతులు కలపాలి అనే ఉద్దేశంతో చేతులు పట్టి లాగేవారు. ఆ సందర్భంలో నొప్పి కలిగినా భరించేవారు. ఈ యాత్రల్లో అభిమానులు దూసుకువచ్చి మరీ పవన్ కల్యాణ్‌తో కరచాలనం చేయాలని ఉత్సాహంతో చేతులు గుంజేవారు. అప్పుడు నొప్పి విపరీతంగా వచ్చినా పంటి బిగువున భరించారు. ఆ తరవాత కూడా ఆ గాయాలను అశ్రద్ధ చేశారు. 2019 ఎన్నికల అనంతరం రాయలసీమ జిల్లాల్లో.. ముఖ్యంగా మదనపల్లెలో టమోటా రైతుల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లిన సందర్భంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పవన్ కల్యాణ్‌కి చేరువగా వెళ్లి కరచాలనం చేయడం, ఆప్యాయంగా హత్తుకొనే సందర్భాల్లో గాయాలు తిరగబెట్టాయి. అయినా పట్టించుకోలేదు. గత సార్వత్రిక ఎన్నికలు, అంతకు ముందు వారాహి యాత్ర సందర్భంలోను అభిమానులు కరచాలనం కోసం దూసుకు వచ్చేవారు. గాయాల వల్ల నొప్పి వస్తున్నా భరించారు. ఏప్రిల్ మాసంలో పవన్ కల్యాణ్ ముక్కుకి శస్త్ర చికిత్స చేసే సందర్భంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంలో భుజాలకు రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్, మజిల్ టేర్స్ తీవ్ర స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఇంత తీవ్ర గాయాలు ఉన్నప్పటికీ ఏ విధంగా భరిస్తున్నారు అని వైద్యులు ఆశ్చర్యపడ్డారు. వీటికి వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని అప్పుడే వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే కొద్ది వారాల కిందట ముంబయిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో భాగంగా శనివారం కుడి భుజానికి ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతోంది.

# వియత్నాం బోటు ప్రమాదంపై సిఎం తీవ్ర విచారం

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాంలో జరిగిన పర్యాటక బోటు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందడం పట్ల సిఎం చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి మొత్తం 33 మంది వియత్నాం పర్యటనకు వెళ్లగా, వారిలో 19 మంది ప్రమాదానికి గురైన బోటులో ఉన్నారు. ఈ ప్రమాదంలో కడప జిల్లాకు చెందిన ముడియం శ్రీధర్, కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి జయలక్ష్మి, సత్యసాయి జిల్లాకు చెందిన నల్లపేట ఆదిశేషయ్య రవి తేజ మృతి చెందారు. కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి కిశోర్ తీవ్ర అస్వస్థతతో ఐసియులో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారందరూ సురక్షితంగా ఉన్నారు. విహారయాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, ప్రాణాలతో బయటపడిన వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉండాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు వెంటనే అందించాలని సిఎం ఆదేశించారు. ఢిల్లీలోని ఏపి భవన్ అధికారులు వియత్నాం ప్రభుత్వ అధికారులు, అక్కడి భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే మృతదేహాలను స్వదేశానికి త్వరితగతిన తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ఎస్ జానకి ఇక లేరు

>> జానకి ‘సౌత్ ఇండియా నైటింగేల్’గా ప్రసిద్ధి పొందారు. గత జనవరి నెలలో ఆమె కుమారుడు మురళీకృష్ణ (65) మరణించడంతో మనో వేదనతో బాధపడుతున్న జానకి చివరకు ఇదే కారణంగా గుండెపోటుకు గురై కన్ను మూశారు. దక్షిణాది దిగ్గజ గాయకులు ఎస్పి బాలసుబ్రమణ్యం, పి. సుశీలతో కలిసి జానకి వేలాది పాటలు పాడిన ఘనాపాటిగా పేరొందారు. 1957లో చెన్నైలోని ఎవిఎం స్యూడియోలో స్టాఫ్ సింగర్‌గా తన గాన ప్రయాణాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె పాడిన తొలిపాట తమిళంలో విదియిన్ విలయాట్టు సినిమాలోని విషాద గీతం. తెలుగులో తొలి పాట పెండ్యాల నాగేశ్వరరావు సంగీత దర్శకత్వంలో వచ్చిన ఎంఎల్ఏ సినిమాలోని నీ ఆశ అడియాస అనే పాట. ఈ పాటను ఘంటసాలతో కలిసి పాడారు. 1970 నుంచి 1990 వరకు దక్షిణాది రాష్ట్రాలలో మహిళా గాత్రానికి ప్రధాన స్తంభంగా ఆమె నిలిచారు. నా దస్వరం, వేణువు, షెహనాయ్ వంటి సంగీత వాయిద్యాలతో పోటీపడి పాడగల అరుదైన గాత్ర ప్రతిభ జానకి సొంతం. కాగా జానకికి నాలుగుసార్లు జాతీయ పురస్కారాలు అందాయి. దీంతో పాటు వివిధ రాష్ట్రాలు ప్రత్యేకంగా అవార్డులు ఇచ్చి సన్మానించాయి. 2017లో వయో భారంతో ఆమె పాటలు పాడడం మానేశారు. 2013 కేంద్రం ప్రకటించిన పద్మభూషన్ అవార్డును ఆమె తిరస్కరించడం సంచలనం రేపింది. తెలుగు భాషలో వేలాది పాటలు పాడిన ఆమెకు ప్రత్యేకంగా అభిమానులున్నారు. ఆదివారం ఆమె అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సమస్యలు పరిష్కరిస్తాం

>> దృష్టిలో ఉంచుకుని అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన ప్రయత్నం చేస్తుందని స్పష్టం చేశారు.ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు ఈనెల 21వ తేదీన సచివాలయంలో అన్ని ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారి అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రులు ఇరువురూ ప్రకటించారు.ఈలోగా రాష్ట్ర ఆర్థికమంత్రి వర్యులతో కూడా ఉద్యోగ సంఘాల సమస్యలపై మరొక సారి చర్చిస్తామని వారి పేర్కొన్నారు.కావున ఉద్యోగులు వారి ఆందోళన కార్యక్రమాల కార్యాచరణను వాయిదా వేసుకోవాలని మంత్రులిరువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు సూచించారురాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన సమావేశం పూర్తి సహృద్భావ వాతావరణంలో జరిగిందని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వర్యులు పూర్తి సానుకూలంగా ఉన్నారని పునరుద్ఘాటించారు.గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతోనే నేడు ఉద్యోగులకు ఈపరిస్థితి వచ్చిందని ఉద్యోగ సంఘాలు ఇచ్చిన 23 డిమాండ్లను పరిశీలించామని వాటన్నిటినీ ఏవిధంగా పరిష్కరించాలనే దానిపై ఈనెల 21న సిఎస్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# ఎరువుల కోసం క్యూలో వృద్ధురాలి పడిగాపులు అస్వస్థతకు గురై మృతి

**టెక్కలి (శ్రీకాకుళం జిల్లా), జూలై 11 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఎరువులు కోసం క్యూలైన్‌లో పడిగాపులు పడి అస్వస్థతకు గురై మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వంలో ఎరువులు వస్తాయో రావో అనే ఆందోళనతో ఆర్‌బికేల్లో ఉన్న ఎరువులు కొనుగోలు చేసేందుకు శుక్రవారం లవునిపల్లిలో ఉన్న ఆర్బికే కేంద్రానికి రైతులంతా చేరుకున్నారు. ఈ ఆర్‌బికే లో కేవలం 200 బస్తాలు మాత్రమే ఉండడం, ఒక్కో రైతుకి కేవలం ఒక బస్తా ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు తమకు యూరియా దొరుకుతుందో లేదో అని రైతులంతా ఒకేసారి అక్కడికి చేరుకున్నారు. ఇరుకు ప్రదేశం కావడం రైతులు అధికంగా చేరుకోవడంతో అందులో చిక్కుకున్న పినకాన కాంతమ్మ (70) అస్వస్థతకు గురైంది. వెంటనే అక్కడ ఉన్న రైతులు కాంతమ్మను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే కాంతమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో గత ఏడాది ఎరువులు కొరత ఏర్పడడంతో ఈ ఏడాది కూడా ఎరువులు దొరుకుతాయో లేదో అని ఆందోళనతో రైతులు ఉండడం శనివారం ఈ ఘటన జరగడం ఎరువుల కొరతకు ప్రత్యేక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రానికి మరిన్ని కొరియా పెట్టుబడులు



## 50కి పైగా కంపెనీలతో చర్చలు జరిపిన మంత్రి లోకేష్

## పల్లి..పల్లి మంత్రి అంటూ కొరియన్ ప్రతినిధుల ప్రశంసలు

**విజయవాడ, జులై11, ప్రభాతవార్తప్రతినిధి:**భారత్-కొరియా సంబంధాల బలోపేతమే లక్ష్యంగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (సౌత్ కొరియా) ఆహ్వానం మేరకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేపట్టిన సౌత్ కొరియా పర్యటన విజయవంతమైంది. మంత్రి లోకేష్ బృందానికి దక్షిణ కొరియా ప్రభుత్వంతోపాటు అక్కడి పారిశ్రామికవేత్తల నుంచి సముచిత గౌరవం లభించింది. ఎల్జీ లాంటి గ్లోబల్ కంపెనీలు ప్రత్యేకంగా తమ హెడ్ క్వార్టర్స్‌కు ఆహ్వానించి ఉన్నతస్థాయి బృందంతో గౌరవార్థ విందు ఇవ్వడం మంత్రి లోకేష్‌కు దక్కిన అరుదైన గౌరవం. ఈనెల 5నుంచి 11వరకు నిర్వహించిన అధికారిక పర్యటనలో 50కి పైగా కార్పొరేట్ సంస్థల నాయకత్వాన్ని కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా లోకేష్ కోరారు. తొలిరోజు సియోల్ లో తెలుగు ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంతో ప్రారంభమైన పర్యటన శుక్రవారం సీఐఐ ఆధ్వర్యాన పెట్టుబడిదారులతో నిర్వహించిన రోడ్‌షోతో ముగిసింది. రాష్ట్రంతో ద్వైపాక్షిక, రాజకీయ, వాణిజ్య సహకారాన్ని బలోపేతం ప్రాధాన్యతను గుర్తిస్తూ, దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిత్వశాఖ మంత్రి లోకేష్‌ను అధికారికంగా ఈ పర్యటనకు ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌తో నిర్వహించిన భేటీల అనంతరం ఎల్జీ, హ్యుందయ్, శాంసంగ్, బీఎన్ కే ఫైనాన్షియల్ వంటి దిగ్గజ కొరియన్ కార్పొరేట్ సంస్థలు, తమ ఉన్నత నాయకత్వంతో సంప్రదించి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న స్పష్టమైన పారిశ్రామిక విధానాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, అందజేస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్‌తో వివిధ సంస్థల ప్రతినిధి బృందాలు ఫిదాఅయ్యాయి. పర్యటన తొలిరోజున సియోల్ లో భారత్ రాయబారి గౌరంగలాల్ దాస్‌తో నిర్వహించిన మర్యాదపూర్వక భేటీలో కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తూ ఆంధ్రప్రదేశ్ విజన్‌ను ఆవిష్కరించారు. దక్షిణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వర్యాన అపెక్స్ - కొరియా పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగంను ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలకు నిదర్శనం. శ్రీసిటీ పరిసరాల్లో ఇప్పటికే కొలువై ఉన్న 40కిపైగా కొరియన్ కంపెనీలతోపాటు కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపే సంస్థలకు భరోసా ఇచ్చినట్లయింది. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రెండేళ్ల వ్యవధిలో 'కియా' సాధించిన విజయాన్ని ఉదహరిస్తూ, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, 3ఎస్ మోడల్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమతులపై మంత్రి లోకేష్ వివరించిన తీరుపై కొరియా మీడియా, దిగ్గజ కంపెనీలు సానుకూలంగా స్పందించాయి. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బృందం పర్యటనపై కోట్రా దక్షిణాసియా విభాగాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్ ప్రశంసల వర్షం కురిపిస్తూ నారా లోకేష్ బృందానికి హ్యాట్సాఫ్ అంటూ ట్విట్టర్ లో అభినందనలు తెలపడం పర్యటన విజయవంతానికి నిదర్శనం. కొరియన్ ప్రతినిధులు మంత్రి లోకేష్ వేగం చూసి పల్లి..పల్లి మంత్రిఅని కొత్త పేరు పెట్టారు. పల్లి.. పల్లి అనే కొరియన్ పదానికి అర్థం త్వరగా..త్వరగా అని. వారంరోజుల అధికారిక పర్యటనను పెట్టుబడుల యాత్రగా మార్చిన మంత్రి లోకేష్ లౌక్యం రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి, కమిట్‌మెంట్‌ను తెలియజేస్తోంది.

ఇక తన సౌత్ కొరియా పర్యటన ముగింపు సందర్భంగా 'ఎక్స్' వేదికగా తన టూర్ విజయవంతం కావడానికి సహకరించిన దక్షిణ కొరియా విదేశాంగ శాఖ, సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం, ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'మళ్లీ కలుద్దాం సియోల్ అంతవరకు కమ్సహమ్నిదా!' అంటూ కొరియన్ భాషలో పోస్ట్‌ను ముగించారు. కమ్సహమ్నిదా అనేది కొరియన్ భాషా పదం. ఎవరికైనా అత్యంత మర్యాదపూర్వకమైన

# పడవ ప్రమాదంపై మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

## బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులకు ఆదేశం

**విజయవాడ,జూలై11, ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాం లో జరిగిన పడవ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రమాద ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకున్న మంత్రి, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు చిక్కుకున్నారనే ప్రాథమిక సమాచారంపై తక్షణమే రంగంలోకి దిగారు.

# ప్రభుత్వ వైద్యుల పదవీ విరమణ వయసు పెంపునకు జూడా వ్యతిరేకం

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రభుత్వ వైద్యుల రిటైర్మెంట్ వయసు 70 యేళ్లకు పెంపు ప్రతిపాదనలను ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం (జూడా) వ్యతిరేకించింది. దీనివల్ల యువ వైద్యుల ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. వైద్యుల కొరతకు అర్హులు లేకపోవడం కారణం కాదని, ఖాళీలను భర్తీ చేయకపోవడమే అసలు సమస్య అని స్పష్టం చేసింది. వెంటనే పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. రోగుల రద్దీకి తగ్గట్లు అదనపు పోస్టులు ఇవ్వాలంది. స్పెషలిస్టుల నియామకంతో ఆసుపత్రులను బలోపేతం చేయాలని సూచించింది. వైద్యులకు సకాలంలో ప్రమోషన్లు ఇవ్వాలని, సీనియర్ వైద్యులను కేవలం సలహాదారులు, మెంటార్లుగా మాత్రమే వాడుకోవాలని జూడా ప్రభుత్వానికి సూచించింది.


**pnb Housing Finance Limited** Ghar Ki Baat

**అనుబంధం-IV-A - స్థిరాస్తి/లు యొక్క ఇ-వేలం విక్రయ ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు నిర్మాణంతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు ఇ-వేలం-విక్రయ ప్రకటన

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష్ భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

గుంటూరు బ్రాంచ్ : జిబి ప్రైమ్ 31-4-363, 1వ అంతస్తు, అరండల్‌పేట్, 4వ లేన్, గుంటూరు-522002.

[illegible] M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ [illegible] "ఏదీ ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ఏది ఎలా ఉన్నది అక్కడ ఏది ఉందో అది అలా" [illegible] M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ [illegible] www.pnbhousing.com [illegible]

| రుణం నెం./రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/హామీదారు/చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేదీ (B) | స్వాధీనత యొక్క స్వభావం (C) | తనఖాపెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వు ధర (RP) (E) | ధరావత్ (RP లో 10%) (F) | బిడ్ సమర్పణకు చివరి తేది (G) | బిడ్ ఇంక్రిమెంట్ రేట్ (H) | ఇన్స్పెక్షన్ తేది మరియు సమయం (I) | వేలం తేది మరియు సమయం (J) | తెలిసిన ఋణభారాలు/కోర్టుకేసులు ఉన్నచో (K) |
| --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- |
| NHL/GNTR/1019/749705, B.O: గుంటూరు, షేక్ మహబూబానీ / షేక్ హనీఫా బీ, SK ఎంటర్ ప్రైజెస్ | రూ. 3477778.06 24.03.2023 నాటికి | భౌతికంగా స్వాధీనం | [illegible] గుంటూరు జిల్లా, నరసరావుపేట [illegible] సత్తెనపల్లి [illegible] ఇ.నం.117, వార్డ్ నం.4, [illegible] RCC ఇల్లుతో [illegible] | రూ. 1564000 | రూ. 156400 | 29.07.26 | రూ. 10,000 | 17.07.26 [illegible] | 30.07.26 [illegible] | తెలియదు |
| HOU/GNTR/0224/1219996, [illegible] | రూ. 3660171.32 04.09.2025 నాటికి | భౌతికంగా స్వాధీనం | [illegible] | రూ. 2448000 | రూ. 244800 | 29.07.26 | రూ. 10,000 | 17.07.26 [illegible] | 30.07.26 [illegible] | తెలియదు |


[illegible] Foreclosureindia.com [illegible] info@bankauctions.in [illegible] 7428193765/ 9948562888/9392320800/9059529997/8790120868, PNBHFL [illegible] www.pnbhousing.com [illegible]

ప్రదేశము : గుంటూరు, తేది: 12.07.2026 సం/- అధీకృత అధికారి, M/s PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్


# బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

## 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2026' జాబితాలో చోటు

### అభినందనలు తెలిపిన సిఎం చంద్రబాబు, హర్షం వ్యక్తం చేసిన మంత్రి లోకేష్



న్యూఢిల్లీలో ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ సదస్సులో అవార్డు అందుకుంటున్న నారా బ్రాహ్మణి

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారాబ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ -2026' జాబితాలో ఆమె చోటు సంపాదించుకున్నారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలిచారు. ఢిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ 2026సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్రఎనలేనిదని, పాలఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన ఆశయమని స్పష్టంచేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకితమిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రతిష్ఠాత్మక జాబితాలో తన కోడలు, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి స్థానం సంపాదించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించారు. జాతీయ స్థాయిలో లభించిన ఈ అరుదైన గౌరవంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, తన 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలియజేశారు. ఫార్చ్యూన్ ఇండియా 100 మంది అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో గుర్తింపు పొందిన బ్రాహ్మణికి నా హృదయపూర్వక అభినందనలు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు కేవలం ఒక అవార్డు మాత్రమే కాదు. వ్యాపార రంగంలో ఆమెకున్న తిరుగులేని నాయకత్వ పటిమ, అంకితభావం, నిబద్ధతకు దక్కిన నిదర్శనం అని ముఖ్యమంత్రి కొనియాడారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

# డిసిఎం పవన్ శస్త్రచికిత్స విజయవంతంపై మంత్రి దుర్గేష్ హర్షం

## త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్ష

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై11,ప్రభాతవార్త:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ముంబయిలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి కావడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యులు కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని తెలిపినట్లు మంత్రి దుర్గేష్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అచంచలమైన నిబద్ధత, పట్టుదల గల ప్రజా నాయకుడని, నిరంతరం ప్రజల శ్రేయస్సు, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా శ్రమిస్తున్నా రన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని, మళ్లీ యథావిధిగా ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.సమస్య ఏదైనా, ప్రజల్లో ఉంటూ వారి కన్నీళ్లు తుడవాలనే తపన ఉన్న జనసేనాని పవన్ కళ్యాణ్ కు కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, అభిమానుల ప్రార్థనల బలం అండగా ఉన్నాయని, ఆయన తనశారీరక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసమే తపించే నిఖార్సైన ప్రజా నాయకుడని కొనియాడారు. రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తు న్నారని, ఆయన త్వరలోనే పూర్తి శక్తి సామర్థ్యాలతో,రెట్టింపు ఉత్సాహంతో విధుల్లోకి చేరుకుంటారని ఆశిస్తున్నట్లుమంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఆయన అనారోగ్యంతో ఉన్నా ప్రజాసమస్యలపై ఆలోచన నిరంతరం సాగుతూనే ఉంటుందని, అలసట ఎరుగని ఆయన పోరాట పటిమ, దృఢ సంకల్పం మనందరికీ ఎల్లప్పుడూ

# మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

## రాష్ట్ర ప్రసూతి మరియు స్త్రీ వైద్యశాస్త్ర సదస్సులో మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రసూతి మరియు స్త్రీ వైద్య శాస్త్ర సొసైటీ ఆధ్వర్యంలో "ఉమెన్స్ హెల్త్ - నేషన్స్ ప్రైడ్" అనే నినాదంతో ఒంగోలులో నిర్వహిస్తున్న మూడు రోజుల రాష్ట్రస్థాయి సదస్సు రెండో రోజు శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్, ప్రముఖ ప్రసూతి, స్త్రీరోగ వైద్య నిపుణులు, వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం ఒక కుటుంబానికే కాకుండా సమాజం, రాష్ట్ర అభివృద్ధికి కూడా కీలకమని అన్నారు. గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు, ప్రసూతి సేవలు, అవసరమైన పరికరాలు, నిపుణుల సేవలను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు తల్లి, శిశు మరణాలను తగ్గించే దిశగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" లక్ష్యంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని వివరించారు.ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ ఆధునిక వైద్య విజ్ఞానం ప్రజలకు చేరువ కావడంలో ఇలాంటి రాష్ట్రస్థాయి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు నాణ్యమైన ప్రసూతి




వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, సురక్షిత ప్రసవాలకు ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం పట్ల ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో కీనోట్ ఉపన్యాసాలు, శాస్త్రీయ పత్రాల ప్రదర్శనలు, ప్రత్యక్ష శిక్షణా కార్యక్రమాలు, వైద్య చర్చలు నిర్వహించారు. అధిక ప్రమాద గర్భధారణలు, వంధ్యత్వ చికిత్స, ప్రసూతి అత్యవసర పరిస్థితుల నిర్వహణ, గర్భాశయ క్యాన్సర్ నివారణ, నవజాత శిశు సంరక్షణ, ఆధునిక శస్త్రచికిత్స విధానాలపై నిపుణులు సవివరంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వైద్యులు తమ అనుభవాలను పంచుకుని వైద్య రంగంలో వస్తున్న నూతన మార్పులపై చర్చించారు.

# వైసిపి మహిళా నేత ఆత్మహత్యాయత్నం: రంగంలోకి రాయపాటి శైలజ



**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:** ఒంగోలుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మహిళా నాయకురాలు పేరం ప్రసన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ఇటీవల జిల్లా పార్టీ కార్యాలయంలో తనపై జరిగిన దాడి, వేధింపుల అనంతరం తీవ్ర మనోవేదనకు గురైన ఆమె నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో రికార్డు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆమెను ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. సెల్ఫీ వీడియోలో పార్టీ నాయకత్వం తనకు న్యాయం చేయలేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ వాట్సాప్ గ్రూపుల నుంచి తనను తొలగించడం, తాను పంపిన వీడియోలు, వాయిస్ మెసేజ్‌లను డిలీట్ చేయడం ద్వారా తనను అవమానించారని ఆరోపించారు. కొందరు తనపై అసభ్య వ్యాఖ్యలు చేసినప్పటికీ వారిపైన చర్యలు తీసుకోకుండా నాయకత్వం వారికి మద్దతు ఇస్తోందని విమర్శించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని ప్రసన్నను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు బాధితురాలితో ప్రత్యేకంగా మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ సునంద, వన్ స్టాప్ సెంటర్ మేనేజర్ ఎన్. సుప్రియ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాయపాటి శైలజ మాట్లాడుతూ, మహిళలు గౌరవంగా, భద్రంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని అన్నారు. గత ఏడాదిగా ప్రసన్న లైంగిక వేధింపులు, అసభ్య వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తనను ఎదుర్కొన్నట్లు తనకు వివరించిందన్నారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN: L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV (8 (1) నిబంధన చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో ఏప్రిల్ 01, 2024 నుండి విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకందారు "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడిన సెక్షన్ 13 (12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు.
దిగువ పేర్కొన్న తేదీకి రుణగ్రహీతలు దిగువ పట్టిక ఇచ్చిన వివరాల ప్రకారం నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పిలుపునిచ్చారు:-

| రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
| --- | --- | --- |
| (లోన్ ఎ/సి నెం.), 23660002005506, కొత్త మల్లీశ్వరి (రుణగ్రహీత), కొత్త వెంకటేశ్వర్లు (సహ-రుణగ్రహీత), | 17-అక్టోబర్-25 రూ. 6,98,038/- రూపాయలు ఆరు లక్షల తొంభై ఎనిమిది వేల ముప్పై ఎనిమిది మాత్రమే 17-అక్టోబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా, బాపట్ల RD, అడవి గ్రామ పంచాయితీ, అడవి గ్రామం, డోర్ నం. 577/5, విస్తీర్ణం ఎక. 0-03 సెంట్లు లేదా 145.2 చదరపు గజాలు స్థలం; డోర్ నం. 1-56/A, అసెస్‌మెంట్ నం. 1596, RCC ఇల్లు మరియు స్థలం. సరిహద్దుల మధ్య విస్తీర్ణం ఎక. 0-03 సెంట్లు లేదా 145.2 చదరపు గజాలు లేదా 121.4 చదరపు మీటర్ల స్థలం, ఇందులో 240 చదరపు అడుగుల RCC ఇల్లు మరియు 112 చదరపు అడుగుల పెంకులతో వేసిన సిట్-అవుట్ ఉన్నాయి; అన్ని ఫిక్చర్లు మరియు ఈజ్‌మెంట్ హక్కులతో సహా. తూర్పు: ఉమ్మడి దారి, పడమర: మార్ని పాండురంగారెడ్డి గారి ఇంటి స్థలం, ఉత్తరం: మార్ని నాగేశ్వరరెడ్డి గారి ఇంటి స్థలం, దక్షిణం: కొమట్ల శ్రీనివాసరెడ్డి గారి ఇంటి స్థలం. | | |
| (లోన్ ఎ/సి నెం.), 23630000031441, చోడిపల్లి సింహాద్రి (రుణగ్రహీత), చోడిపల్లి మేరీ (సహ-రుణగ్రహీత), | 17-అక్టోబర్-25 రూ. 9,68,009/- రూపాయలు తొమ్మిది లక్షల అరవై ఎనిమిది వేల తొమ్మిది మాత్రమే 17-అక్టోబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 24660001723390, [illegible] | 17-అక్టోబర్-25 రూ. 6,71,145/- [illegible] 17-అక్టోబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 23660000575886 & 24660002594614, [illegible] | 03-ఫిబ్రవరి-26 రూ. 5,85,729/- [illegible] & రూ. 2,07,078/- [illegible] 02-ఫిబ్రవరి-26 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 23660001018859, [illegible] | 06-ఆగస్టు-25 రూ. 4,93,913/- [illegible] 05-ఆగస్టు-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 22660000798738, [illegible] | 29-అక్టోబర్-25 రూ. 3,29,893/- [illegible] 28-అక్టోబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 22660000955693, [illegible] | 24-అక్టోబర్-25 రూ. 6,96,156/- [illegible] 23-అక్టోబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 23630000053839, [illegible] | 28-నవంబర్-25 రూ. 5,94,283/- [illegible] 28-నవంబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 24660001954814, [illegible] | 01-సెప్టెంబర్-25 రూ. 5,42,795/- [illegible] 01-సెప్టెంబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 24660000274261, [illegible] | 12-ఫిబ్రవరి-26 రూ. 6,77,900/- [illegible] 11-ఫిబ్రవరి-26 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 22630000048391, [illegible] | 24-అక్టోబర్-25 రూ. 8,36,047/- [illegible] 23-అక్టోబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 23660000866169 & 24660000761304, [illegible] | 12-ఫిబ్రవరి-26 రూ. 9,67,145/- [illegible] 11-ఫిబ్రవరి-26 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |
| (లోన్ ఎ/సి నెం.), 23630000025203, [illegible] | 23-డిసెంబర్-25 రూ. 9,48,147/- [illegible] 22-డిసెంబర్-25 నాటికి | 06-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible] | | |

[illegible]

తేదీ : 10/07/2026 స్థలం : బాపట్ల, ఆంధ్రప్రదేశ్ సం/- అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

12-7pg4_12-7pg4.qxd 11/Jul/26 11:23 PM Page 1



# పౌరసరఫరాల ప్రక్షాళనతో అవినీతి నిర్మూలన

భాగ్యనగర్ భాస్కర్‌కుమార్

తెలంగాణలోని భాగ్యనగర్‌కు చెందిన బండారి మారుతి, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామానికి చెందిన సొక్కం అంజయ్య సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాలలో సౌభాగ్య ఇండస్ట్రీస్ నడిపిస్తున్నారు. ధాన్యం పక్కదారి పట్టించడంతో వారిని సుల్తానాబాద్‌పోలీసులు అరెస్టుచేసి జైలుకూడా పంపించారు. స్టీఫెన్ రవీంద్ర చొరవతో లీగల్‌గైడ్‌లైన్స్ పుస్తకాలు తెలంగాణలోని పోలీసుస్టేషన్‌లు, తహసీల్, సివిల్ సప్లయ్ అధికారులకు సుమారు వెయ్యి పుస్తకాలు అందుబాటులోకి రావడంతో గతంలో రైసుమిల్లర్లు అక్రమాలు చేసి అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ పొందినట్లు పొంద లేకపోతున్నారు. లీగల్‌ఎక్స్‌పర్ట్స్‌తో రూపొందించిన ఏకరూప గైడ్‌లైన్స్‌తో శాస్త్రీయంగా కేసు నమోదు చేసి కోర్టుల్లో వీగిపోకుండా చర్యలు చేపట్టారు. ఆస్తుల వేలం కూడా మొదలైంది. నల్లగొండ సూర్యాపేటలో సిఎంఆర్ ధాన్యం ఇవ్వనివేలం వేసినబియ్యం అందించని రైసు మిల్లర్ల ఆస్తులు అటాచ్ చేశారు. నాలుగువేల కోట్ల ఆస్తులు స్వాధీనంకు మార్గం సుగమం చేశారు. రాబోయే 2026-27 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ఎలాంటిఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా చూడడానికి, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఈరోజు 'మిషన్ కె100' ను స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. కొత్త దిగుబడి రాకముందే గోదాములను సిద్ధం చేసే ఉద్దేశ్యంతో, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థకి అప్పగించడంపై సివిల్ సప్లయ్‌శాఖ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. తక్షణమే నిధులను సమకూర్చుకోవడంతో పాటు గోదాముల అద్దె భారాన్ని తగ్గించుకునే లక్ష్యంతో, ధాన్యాన్ని ఒక క్రమపద్ధతిలో, దశల వారీగా వేలం వేయడంపై ఇది ప్రధానంగా దృష్టి సారిస్తుంది. భారీ స్థాయిలో ధాన్యం వచ్చే కొనుగోలు కేంద్రాలను ఆధునీకరించ డమే మిషన్ కె100లక్ష్యంగా పెట్టుకొంది.

పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎకసెక్కాలు చేసినట్లు.. తెలంగాణ పౌరసరఫరాలశాఖ అక్రమార్కులకు స్వర్గధామంగా మారింది. తెలంగాణ పౌరసరఫరాలశాఖ రైతుల నుంచిధాన్యం సేకరణ చేయడంతోపాటు ఒక కోటి ఐదులక్షలకు పైగాకుటుంబాలకు తలసరి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. మరోవైపు పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి వంట గ్యాస్ ప్రజలకు సరఫరా చేయడంలో అత్యంత కీలకపాత్రదారైన పౌరసరఫరాల శాఖకు తెలంగాణ ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో రూ.7366 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వం వేల కోట్లు పేద ప్రజల కోసం బడ్జెట్‌లో పెట్టినా అవి చివరకు అక్రమార్కుల జేబులు నిపండానికి మాత్రమే దోహదపడుతున్నాయి. అక్రమార్కులను పట్టుకొన్నా పౌరసరఫరాల చట్టాలలో ఉన్న లొసుగులతో ఎంత పెద్ద నేరం చేసినా చిన్నపాటి శిక్షలతో బయటపడి మళ్ళీ అదే నేరం చేయడం రివాజుగా మారింది. పౌరసరఫరాల శాఖ ధాన్యం సేకరణ అంశం ఇటు రైతులను అటు ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసే తంతుగా మారింది. రబీ సీజన్‌లో 72.30 ఎంఎల్‌టి ధాన్యం సేకరణ చేసి 14,006కోట్ల రూపాయలు 10.78లక్షలమంది రైతులకు చెల్లించారు. ఇంత పెద్ద ఆర్థిక యజ్ఞమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఉద్దేశ్యపూర్వకంగానే ఆలస్యం చేసి విక్రయ కేంద్రాలలో కుప్పలుగా పేరుకుపోయాక తూకం వేసి రైతులను దోపిడి చేసేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తొలి పావును కదుపుతారు. ధాన్యం విక్రయానికి వచ్చిన రైతుల వద్ద కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలకు 50 రూపాయలు వసూలు చేస్తారు. అందులో 35 రూపాయలు హమాలీలకు చెల్లిస్తున్నామని మిగతా 15 రూపాయలు తాగునీరు, జనుము తాడు (సుతిలి) సమకూర్చుకోవడానికి ఖర్చు చేస్తున్నామని సెంటర్ నిర్వహకులు రైతులకు చెబుతూ దోపిడిని వ్యవస్థీకృతం చేశారు. టార్పాలిన్ కవర్లకు రోజుకు ఐదు రూపాయలు అద్దెకూడా వసూలు చేసుకొనే బిజినెస్ మొదలైంది. ధాన్యం తూకం వేశాక వాహనాలు సకాలంలో రాకపోవడంతో రైతులే సొంత ఖర్చులతో వాహనాల్లో ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఈ సమయంలో సొంత వాహనంలో తరలించినా వాహనానికి కొనుగోలు కేంద్ర నిర్వాహకులు డబ్బులు చెల్లించాల్సి ఉండగా చాలా ప్రాంతాల్లో చెల్లించడం లేదు. దీంతో రైతులు ట్రక్కుల డబ్బులు సొంత జేబులో నుంచి ఖర్చు చేయాల్సి వస్తుంది. మరోవైపు ప్రభుత్వం ఇస్తున్న ట్రక్ డబ్బులు అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి. ధాన్యం తరలించే డ్రైవర్లు కూడా రైతు నుంచి బస్తాకు ఐదు రూపాయల చొప్పు బత్తా పేరుతో దోపిడి చేస్తున్నారు. ఇక తాలు, సడెం, చేట, గన్నీబ్యాగ్



బరువు అంటూ క్వింటాల్‌కు సుమారు పదికిలోల వడ్లు అదనంగా తూకం వేస్తారు. తెలంగాణ వ్యాప్తంగా అదనపు కలెక్టర్లకు నుంచి మొదలు కొని పౌరసరఫరాలశాఖ రెవెన్యూ క్షేత్రస్థాయి సిబ్బందికి రైసుమిల్లర్లతో ఉన్న స్నేహబంధంతో మిల్లు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయిస్తూ బహిరంగ మార్కెట్లో అమ్ముకోవడానికి దొడిదారులు వెతుక్కొంటున్నారనీ ఆరోపణలున్నాయి. ఇలా సిఎం ఆర్‌ధాన్యం వేల కోట్ల విలువైనవి దారిమళ్ళించి నీకింతా నాకింత అని పంచుకొన్నారు. దీనితో అధికారులను కూడా రైస్‌మిల్లర్లు సవాల్ చేసే స్థాయికి ఎదిగారు. రైస్ మిల్లులో ఉన్న ధాన్యం తనిఖీ కోసం వెళ్లిన అధికారుల లెక్కలు కాకి లెక్కలు తప్పితే ఒరిజినల్‌గా లెక్కించే విధానం వారి వద్ద లేదు అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిఎంఆర్ బియ్యాన్ని ఇవ్వడానికి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇస్తున్నారు. బియ్యం కొంటామని వీధుల్లో ఉదయం బైక్‌పై మైక్‌తో అనౌన్స్‌చేస్తూ తిరిగే కొనుగోలుదారులు మొదలు కొని రేషన్‌డీలర్లు, ఎంఎల్‌ఎస్ పాయింట్ల ఇంచార్జీలు వీరికి రేషన్ బియ్యం సమకూర్చే వనరులుగా మారిపోయారు. సిఎంఆర్ ఎగ్గొట్టిన మిల్లర్లకు క్రిమినల్ కేసులు పెట్టి ఆస్తుల వేలం వేస్తున్న ప్రభుత్వం వారి అక్రమాలకు అండగా నిలిచిన కొంత మంది అధికారులపై చర్యలు తీసుకోవడం లేదనీ విమర్శలు పౌరసరఫరాలశాఖపై వినిపిస్తోంది. దీనికితోడు పంచనామా రిపోర్టు, ఎఫ్ఐరా చార్జీషీటు రిమాండ్ రిపోర్టు, రికార్డు రికవరీ వంటి అంశాలకు శాస్త్రీయంగా కోర్టుల్లో నిలబడేలా నివేదికలు రూపొందించే విధానం ఇప్పటివరకు లేకుండా పోవడం అక్రమార్కులదే పైచేయిగా ఇప్పటివరకు కొనసాగింది. పౌరసరఫరాలశాఖ చట్టాలు వినియోగించుకోవడంలో సరైన నైపుణ్యంలేని ఉద్యోగుల కారణంగా ఏడేళ్ళ శిక్షపడే కేసుల్లో కూడా బెయిల్ వచ్చేది. పౌరసరఫరాలశాఖ కమీషనర్‌గా స్టీఫెన్ రవీంద్ర వచ్చాక పరిస్థితి మారిపోయింది. పౌరసరఫరాలశాఖ కేసులు కోర్టుల్లో వీగిపోకుండా, నిందితులకు ముందస్తు బెయిల్ ఇవ్వకుండా ఒక లీగల్‌టీం ఏర్పాటు చేసి మార్గదర్శకాలను రూపొందించడమే కాకుండా పోలీసు, సివిల్ సప్లయ్‌శాఖ సిబ్బందికి పంచనామా రిపోర్టు, ఎఫ్ఐరా చార్జీషీటు రిమాండ్ రిపోర్టు, రికార్డు రికవరీ వంటి అంశాలకు శాస్త్రీయంగాకోర్టుల్లో నిలబడే విధంగా నివేదికలు రూపొందించే శిక్షణ ఇచ్చారు. మూడేళ్ల క్రితం పెండింగ్లో ఉన్న యాసంగి సీజన్‌కు సంబంధించిన బకాయిలను ఆగస్టు ఐదులోగా త్వరితగతిన చెల్లించాల్సిందిగా మిల్లర్లకు నోటీసులతో లీగల్ చర్యలు పకడ్బందిగా తీసుకొనేందుకు సివిల్ సప్లయ్ కమీషనర్ కఠిన నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో 348 రైసుమిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు, 128 మిల్లుయజమానులపై ఆర్ఆర్ యాక్టును నమోదు చేశారు. కోర్టు కేసుల్లో విజయం సాధించడానికి చట్టపరంగా బలోపేతం అవుతున్నా, పౌరసరఫరాలశాఖ అంతర్గతంగా ఇప్పటికి కాలం చెల్లిన జిపిఎస్ యంత్రాలను ఇంకా వాడుతున్నారు. దాని స్థానంలో ప్రతి బండికి గోదాముల్లో కేమెరాలను బిగించడం వల్ల సగం అక్రమాలు తగ్గే అవకాశం ఉంది. వడ్లు బియ్యం తరలించే వాహనాలకు జిపిఎస్ బదులుగా అదే ధరకు అందుబాటులో ఉన్న వెబ్ కెమెరాలు బిగించడం మంచిది. ప్రస్తుతం ఏఐ విస్తృతంగా వాడుకలోకి వచ్చింది. దీన్ని ఉపయోగించి మిల్లుల్లో జరుగుతున్న మోసాలను అరికట్టే అవకాశంఉంది. ప్రతి మిల్లులో సార్ టెక్స్ యంత్రాలు ఉన్నాయి. వాటికి నియంత్రిస్తున్న కంప్యూటర్లను లేదా యంత్రాలను ఏఐతో అనుసంధానం చేసి ధాన్యం ఎంతవేశారు, ఎంత మిల్లింగ్ వచ్చిందనీ ఎప్పటికప్పుడు లెక్కపెట్టే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి మిల్లును కమాండ్ కంట్రోల్ తరహాలో అనుసంధానం చేసి లెక్కలు ఎప్పటికప్పుడు సెంట్రల్ సర్వర్లో నమోదైతే అక్రమాలకు తావుఉండదు. చౌక ధరల బియ్యం రీసైకిల్ చేసి ఇవ్వకుండా నియంత్రించడానికి ఒక క్వింటాలు ధాన్యం మిల్లింగ్ చేస్తే ఎంత కరెంటు బిల్లువస్తుందో ఆ మేరకు ఆ మిల్లు సిఎంఆర్ కింద పెట్టిన మిల్లింగ్ అయిన ఖర్చు అయిన విద్యుత్ వినియోగాన్ని లెక్కిస్తే ఇట్టే దొంగతనాన్ని దొరకబట్టే అవకాశం ఉంది. అధికారులు అలా చేయకపోవడంతోయథేచ్ఛగా సిఎంఆర్ బియ్యంకు రేషన్ బియ్యం వాడుతున్నారు. రేషన్‌దుకాణాల్లో తూకాల్లో మోసాలు కూడా పెరిగిపోయాయి. తూనికల కొలతలశాఖ అధికారులు తీసుకొన్న జీతాలకు న్యాయంచేయడానికి రేషన్ షాపుల్లో తూకాలను తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో ఎలక్ట్రానిక్ కాంటాల్లో రిమోట్ కంట్రోల్‌తో తూకాన్ని నియంత్రించే ఏర్పాట్లు వచ్చాయి. ఇది మార్కెట్లో రూ.1500లకే లభిస్తుంది. ఇది ప్రతి దుకాణదారు రేషన్ షాపుల దుకాణాలు బిగించుకొని వినియోగదారులను మోసం చేస్తున్నా నియంత్రించడంలో అధికారులు విఫలమౌతున్నారు. తెలంగాణలో మహాలక్ష్మీ పథకంలో భాగంగా వంట గ్యాస్ సబ్సిడి చాలావరకు అందడంలేదని మహిళలుఆరోపిస్తున్నారు. రూ.500కు వంటగ్యాస్ ఇస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం చెబుతున్నా కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడి 46.90పైసలు మాత్రమే పడుతున్నాయని వినియోగదారులు అంటున్నారు. అర్హులైన తెల్లరేషన్ కార్డుదారులకు రూ.500కు వంటగ్యాసు సిలెండర్లు ఏడాదికి 12ఇస్తారు. సబ్సిడి కావాల్సినవారు ఇకెవైసి చేయాల్సిఉంటుంది. వార్షిక ఆదాయం పది లక్షలలోపు ఉన్నవారికి సబ్సిడిలభిస్తోంది. ఈ పథకంలో లేని వారు బుక్‌చేస్తే సర్వర్‌ఒటిపి రాకపోవడంతో ఎక్కువధర పెట్టి బయట కొనుగోలు చేయాల్సివస్తోందని అంటున్నారు. ●

# గుడి దొంగలు!

ఎ.వి.వి ప్రసాద్

ఉత్తరాఖండ్

గుడిని మింగేవారు కొందరైతే గుడిలోని లింగాన్ని మింగేవారు మరికొందరంటారు. ఆ ఇద్దరూ ఒకేచోట ఉంటే! మొత్తం ప్రపంచాన్నే మింగేయగలరన్న మాట. దేవాలయాలకు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే పేరు. అవి క్రమంగా ఆర్థిక కేంద్రాలుగా కూడా మారుతూండడంతో దొంగల కన్ను కూడా ఇప్పుడు వాటిపైనే ఎక్కువగా పడుతోంది. వారు బయటి దొంగలుకాదు.. ఇంటి దొంగలే. వారికైతేనే గుడి ఆనుపాన్లు ఎక్కువగా తెలుస్తాయి. చాలా తేలికగా స్వాహా చేయగలుగుతారు. అయోధ్య రామాలయ కుంభకోణం వివాదం ఇంకా కొలిక్కి రాకుండానే బద్రీనాథ్ ఆలయం వార్తల్లోకి రావడం చూస్తే ఎన్నెన్ని ఆలయాల్లో ఇంకెన్నెన్ని కుంభకోణాలు జరుగుతున్నాయో అనే అనుమానం తప్పక కలుగుతుంది. ఉత్తరాఖండ్‌లోని అలకనంద నదీ తీరాన ఉన్న బద్రీనాథ్ ఆలయానికి భక్తులు తండోపతండాలుగా వస్తూంటారు. దానికి తగినట్లుగానే బద్రీనారాయణునికి లభించే విరాళాలు, కానుకలు కూడా విశేషంగానే ఉంటాయి. అందుకే అక్కడా దొంగల కన్ను పడింది. భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనీ, గుడిలోని ఇంటి దొంగలు కొన్ని కోట్ల మేర స్వాహా చేశారనీ గత వారం వార్తలు గుప్పుమనడంతో ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఈ ఆలయం కూడా అందరి నోళ్లలో నానుతోంది. అక్రమాల ఆరోపణలు రాగానే ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే ప్రమోద్ నౌటియార్ అనే ఆలయ ఉద్యోగిని సస్పెండ్ చేసింది. బద్రీనాథ్, కేదార్నాథ్ ఆలయ కమిటీ (బికెటిసి) చైర్మన్‌కు ప్రైవేటు సెక్రటరీగా చేసిన ఆ ఉద్యోగి సారధ్యంలోనే మొత్తం కుంభకోణమంతా సాగిందన్నది వింటే గుడులలో అరాచకాలు ఎలా మితిమీరుతున్నాయో అర్థమవుతుంది. పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వం నియమించిన ముగ్గురుసభ్యుల కమిటీ ఆ ఆరోపణలన్నీ నిజమేనని ప్రాథమికంగా నిర్ధారించగానే ఆ ఉద్యోగిపై వేటు పడింది. 'భైరవ్ సేన' అనే సంస్థ బద్రీనాథ్ ఆలయంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు చేయడంతో తుట్టె కదిలింది. ధామి ప్రభుత్వం గత మంగళవారం త్రిసభ్య కమిటీని నియమించి 15 రోజుల్లో నివేదిక ఇస్తుందని తెలిపింది. సిసి టీవీ ఫుటేజిని పరిశీలించగా ఆరోపణలు నిజమేనని తేలింది. నౌటియాల్ నాయకత్వంలో కొందరు కౌంటింగ్ సిబ్బంది చాలా కాలం నుంచి చేతివాటం ప్రదర్శిస్తున్నారనీ, పెద్ద మొత్తంలోనే సొమ్ము కాజేశారనీ వెల్లడయింది. అయితే దీని వెనుక ఇంకాఎవరెవరు ఉన్నారో తేలవలసిఉంది. భైరవ్ సేన ఆరోపణల ప్రకారం ఆలయం నుంచి దాదాపు 90 కోట్ల విలువైన కానుకలు, నగదు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం చాలా కాలం నుంచే గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నా బికెటిసి పెద్దలకు ఎంతమాత్రం అనుమానం రాకపోవడమే విచిత్రం. దర్యాప్తు కమిటీకి నాయకత్వం వహిస్తున్న గరేవాల్ కమిషనర్ఆనంద్ స్వరూప్ ప్రాథమికంగా చెబుతున్న వివరాలను బట్టి చూస్తే బద్రీనాథ్ ఆలయం నుంచి భారీగానే స్వాహా అయినట్లు తెలుస్తుంది. కోట్లాది భక్తులు పవిత్ర క్షేత్రంగా భావించే బదరీనారాయణుని సన్నిధిలోనే ఇంతపెద్ద కుంభకోణం జరిగితే ఇక మిగిలిన క్షేత్రాల విషయం చెప్పేదేముంది! ఇటువంటిదే గతవారం వెలుగు చూసిన మరో కుంభకోణం మధ్యప్రదేశ్‌లోని బగళాముఖి ఆలయం వ్యవహారం. అగర్ మాల్వా జిల్లాలోని బగళాముఖి ఆలయంలో విరాళాల అక్రమాలు పెద్దమొత్తంలోనే జరిగిన వార్త కూడా ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఈ గుడిలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఉండగానే,ఓ ప్రైవేటు కమిటీ కూడా మొదలయింది. అది భారీగానే విరాళాల వసూళ్లు మొదలు పెట్టింది. వాటికి రసీదులు ఉండవు. భక్తితోనో, భయంతోనో ప్రజలు ఇచ్చే విలువైన కానుకలు గుడికి చేరకుండా పక్కదారి పడుతూంటాయి. ఈ కథ చాలాకాలం నుంచేసాగుతోందట. నడిపేవారు 'పెద్దమనుషులు' కావడంతో భక్తులు కూడా నోరెత్తకుండా కానుకలు సమర్పించుకొని 'తల్లీ! నీ సంపదను నువ్వే రక్షించుకోవా'లంటూ మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయంమొత్తానికి బయటకు రావడంతో కలెక్టర్ నాలుగు రోజుల క్రితం విచారణ కమిటీని నియమించారు. ప్రైవేటు కమిటీ వసూలు చేస్తున్న వెండి, బంగారాలు ఏమవుతున్నాయో కనిపెట్టడానికి నియమించిన ఈ కమిటీ ఏంచెబుతుందో, ఎవరిపై అభియోగాలు మోపుతుందో చూడాలి. పవిత్రతకు నిలయాలుగా భావించే ఆలయాల్లో ఇలా వెలుగు చూస్తున్న అక్రమాలు ఒకటీ రెండూ కావు. మరోవంక అయోధ్య బాలరాముని ఆలయం కుంభకోణం వ్యవహారం కూడా రోజుకో కొత్త మెరుపుతో సాగుతూనే ఉంది. దర్యాప్తు జరుపుతున్న సిట్‌కే కొన్ని విషయాలు అంతుచిక్కడం లేదంటే ఆ కుంభకోణం ఎంత లోతుగా పాతుకుపోయిందో అర్థమవుతుంది. కనీసం 180 రోజుల సిసి టీవీ ఫుటేజి ఉండాలనే నిబంధన ఉన్నా కేవలం 45 రోజులదే లభ్యమవుతున్నదిట. అంటేఅవసరమైన ఆధారాలన్నీ ముందుగానే మాయంచేశారన్న మాట. అంత పకడ్బందీగా అయోధ్య ఆలయంలోనే చౌర్యం జరిగితే ఇంకెక్కడ జరగదనుకోవాలి! సిట్ ప్రాథమిక నివేదిక ప్రకారం ఎనిమిది మందిని తొలుత అరెస్టు చేశారు. రామజన్మ భూమి తీర్థ క్షేత్రట్రస్టు ప్రధాన కార్యదర్శిచంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా చేసిన రాజీనామాలను గతవారం ట్రస్టు ఆమోదించింది కానీజరిగిన కుంభకోణంపై ఏ చర్యలు తీసుకొంటుందో చెప్పనేలేదు. అరెస్టయిన అవినాశ్ శుక్లాయే ఈ కేసులో ప్రధాన నిందితుడని సిట్ తేల్చింది. 70 సార్లు నగదును దారి మళ్లించినట్లు కూడా తేలింది. 200కోట్లు పైనే దారిమళ్లిన అయోధ్య కుంభకోణం అసలు గుట్టుతేలాలంటే సిబిఐ రంగంలోకి దిగవలసిందే. గుడులకు ఆదాయం ఇప్పుడు కోట్లల్లో ఉంటోంది. అందువల్ల దానిపై నిఘా కూడా ఆస్థాయిలోనే ఉండాలి. అందుకు ప్రభు



బద్రీనాథ్ ఆలయం

# జలప్రళయానికి డ్రాగన్ బీజం

గన్ని మోహన్

చైనా

ఆసియాలోనే అతిపెద్ద దేశంఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న చైనా పొరుగున ఉన్న దేశాల భూభాగాలను చేజిక్కించుకోడానికి సకలవిద్యలు ప్రయోగిస్తుందన్నది తెలియంది కాదు. నిన్నమొన్నటివరకూ ఇరుగు పొరుగుదేశాలను ఎగదోసి భారత్‌పై పెత్తనం చేయాలని చూసిన డ్రాగన్‌కు భారత్ చెక్‌పెట్టడంతో ఒక్కసారిగా అవాక్కయింది. అటుచొరబాట్లు, ఇటు ఆక్రమణలతోపాటు ఇప్పుడు తాజాగా జలయుద్ధానికి ప్రణాళికలు వేసింది. చైనా చేపట్టి ప్రారంభించిన ఈప్రాజెక్టుపై భారత్ ఎప్పటి నుంచో అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. టెక్టానిక్ ప్లేట్ల కదలికలు ఎక్కువ ఉండటం వల్ల భూకంప ప్రభావిత ప్రాంతంగా కూడా హెచ్చరించింది. అయితే చైనా మాత్రం దేశ విద్యుత్ అవసరాలకు అనుగుణంగానే ఈప్రాజెక్టు చేపట్టినట్లు చెప్పుకుంటోంది. భారత్‌కు అత్యంత సమీపంలోని టిబెట్ సరిహద్దులో 1.5 లక్షలకోట్ల వ్యయంతో అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించింది. భారత్‌లో బ్రహ్మపుత్రనదిగా ప్రవహించే ఈనది అస్సాం మీదుగా బంగ్లాదేశ్‌లో జమునానది పేరుతో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రాజెక్టు పరీవాహక రాష్ట్రాలకు ఈ మెగా ప్రాజెక్టువల్ల అత్యంత ముప్పు పొంచి ఉందని, పైగా ఈప్రాజెక్టు భూ ప్రకంపనల ప్రాంతంలో ఉందన్న హెచ్చరికలు ఇప్పుడు రెండు దేశాలకు భవిష్యత్ ముప్పును సూచిస్తున్నాయని చెప్పాలి. ప్రపంచంలోనే అత్యంత పెద్దదిగా భావించే త్రీగోర్జెస్ డ్యామ్‌కంటే పెద్దదిగా ఇప్పుడు చైనా మెగా ప్రాజెక్టు నిలుస్తోంది. ఈ ప్రాజెక్టు భూకంప ప్రభావిత ప్రాంతంలో చేపడుతోందని శాస్త్రవేత్తలు చెపుతున్నా జిన్‌పింగ్ సర్కారు చెవికెక్కడం లేదు. ఏడాదికి 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ విద్యుత్ ఉత్పత్తిసామర్థ్యం ఈ ప్రాజెక్టుకుంది. టిబెట్ ప్రాంతంలో బ్రహ్మపుత్ర నదికి యార్లుంగ్ సాంగ్పో అని పేరు అదే భారత్‌లో బ్రహ్మపుత్ర నదిగా వస్తోంది. ఇప్పుడు తాజాగా కడుతున్న ఈ ప్రాజెక్టునుంచి భారీ వరదలు ప్రకృతి విపత్తుల సమయంలో డ్యామ్ నుంచి నీటిని విడుదలచేస్తే అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ వంటి ఈశాన్యరాష్ట్రాలకు జలప్రళయం తప్పదు. భారత్ పరంగా ఈప్రాజెక్టు నుంచి ముప్పు ఉంటుందని పలుసార్లు హెచ్చరించినా కూడా చైనా ఎక్కడా లక్ష్యపెట్టకుండా డ్యామ్ నిర్మిస్తోంది. జలాశయం చుట్టూ ఉన్న ప్రాంతం బలహీనంగా ఉందని, అందువల్ల ఎక్కడముంపు విలయం ఉంటుందని హెచ్చరించినా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. హిమాలయాల్లో భూకంపాలు తరచూ వచ్చే ప్రాంతంలో పైజన్ ప్రాజెక్టు ఉందని సంప్ పేరిట నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ఎప్పటికీ భారత్‌కు ప్రమాదమే. ఈ ప్రాజెక్టు ప్రాంతంలోనే పదేళ్లక్రితం టిబెట్‌లో 6.9తీవ్రతతో భూకంపం సంభవించింది. అందుకు ధీటుగా అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత్‌కూడా మెగా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలిస్తే జలప్రళయానికి బీజం వేసినట్లుగా ఉంది. విద్యుదుత్పత్తి లక్ష్యమే కాకుండా వర్షాకాలంలో ఏర్పడేభారీ వరదలకు ఎగువప్రాంతంలోని మిగులు నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించేందుకు చైనా ఎంతమాత్రం వెనుకాడదు. భారత్ సరిహద్దుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో మాత్రమే నిర్మిస్తున్న ఈ మెగా హైడల్ ప్రాజెక్టు వల్ల భారత్‌లోని ఈశాన్య ప్రాంతానికి ఎప్పటికీ ముప్పే ఉంటుందని పాలకులకు తెలిసినప్పటికీ చైనా మాత్రం తన మెగా ప్రాజెక్టుతో దూకుడుగా ఉంది. ఇప్పటికే నేపాల్ వైపు సరిహద్దుల్లో గ్రామాలనే నిర్మిస్తున్నట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేసాయి. అదేవిధంగా సైన్యం, మిలిటరీ వాహనాల రాకపోకలకు వీలుగా భారత సరిహద్దుల్లోనే రహదారులను నిర్మిస్తోంది. వీటన్నింటినీ ఎప్పటి కప్పుడు భారత్ వ్యతిరేకిస్తున్నప్పటికీ డ్రాగన్ భిన్న వ్యూహాలతో ముందుకు సాగుతున్నది. నిన్న మొన్నటివరకూ ఇరాన్‌కు సహకరించిందని, మిలిటరీ సాయం చేసిందన్న ఆరోపణలు ఎదుర్కొన్న చైనాతో దగ్గరయ్యేందుకు ఇప్పుడు అమెరికా కూడా ఉవ్విళ్లూరుతోంది. చదీచప్పుడు కాకుండా తన దేశ సరిహద్దులను విస్తరించడంలో చైనా పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. నాటి మావోజెడాంగ్ నుంచి నేటి జిన్‌పింగ్ వరకూ ఈ విస్తరణ కాంక్ష కొనసాగుతూనే ఉంది. సరిహద్దుల ఒప్పందం జరగకపోవడం ఈశాన్యంలోని అరుణాచల్ మాదేనని చెప్పుకోవడం ఈ విస్తరణ కాంక్షల్లోభాగమే. ఆరువేల చదరపు కిలో మీటర్లకు పైగా తమ ప్రాంతం అనిచెప్పుకుంటూ వస్తున్న చైనా ఈ ప్రాంత విస్తరణ కోసమే సైనిక స్థావరాలతోపాటు మిలిటరీ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు, ఇప్పుడు తాజాగా జలవిద్యుత్ మెగా ప్రాజెక్టులు నిర్మించింది. కొండచరియలను బలోపేతం చేసుకోవాలని, రిటైనింగ్ గోడలు నిర్మించి ప్రాజెక్టు పటిష్టతను మరింత పెంచుకోవాలని సొంత శాస్త్రవేత్తలు హెచ్చరించినప్పటికీ చైనా మాత్రం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. ప్రత్యేకించి చైనా ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉన్న భూగర్భ సర్వేశాఖ నిర్వహించిన అధ్యయనంలోనే ప్రాజెక్టు ప్రాంత కింద చురుకైన భూకంప ఫాల్ట్‌లైన్ వెళుతోందని వెల్లడించింది. పైజన్ ఫాల్ట్ ప్రాంతం ఈ భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు కింద నుంచే కొనసాగుతోంది. దీనివల్ల ఇక్కడ నిర్మించే ఆనకట్టలు వంతెనలు, రహదారులు, సొరంగాలు ఇతర మౌలిక వనరుల నిర్మాణ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ ఫాల్ట్‌లైన్ వల్లనే పునాదుల బలంతగ్గిస్థిరత్వం కూడా దెబ్బతింటుందని చైనా శాస్త్రవేత్తలే హెచ్చరించారు. అయినా కూడా చైనా పాలకులకు ఇవేమీ పట్టడంలేదు. జలవిద్యుత్ ఉత్పత్తికోసమే ఈ ప్రాజెక్టు పూర్తిచేసామని, ఇతర దేశాలకు ఎలాంటి ప్రభావం ఉండదని సమర్థించుకుంటున్న చైనా ప్రత్యేకించి భారత్‌వైపే ఎక్కువ ఫోకస్ పెట్టిందనడంలో ఎలాంటి సందేహంలేదు. తాజాగా ఈ మెగా జలవిద్యుత్ ప్రాజెక్టుతో ఈశాన్య రాష్ట్రాలకు చెక్‌పెట్టే వ్యూహంతోనే చైనా వ్యవహరిస్తున్నదని నిస్సందేహంగా చెప్పవచ్చు. ●



జలవిద్యుత్

# రాజధాని పేరు రాజకీయ నినాదమా?



రుద్రరాజు శ్రీనివాస రాజు

ఒక రాష్ట్రానికి రాజధాని అనేది కేవలం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం మాత్రమే కాదు. అది ఆ రాష్ట్ర పరిపాలనకు కేంద్ర బిందువు, ఆర్థికాభివృద్ధికి చోదకశక్తి, పెట్టుబడిదారులకు విశ్వాసానికి ప్రతీక, ప్రజల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే శాశ్వత వ్యవస్థ. అలాంటి రాజధాని అంశం ప్రతి ఎన్నికకు ఒక రాజకీయ నినాదంగా మారితే, నష్టపోయేది ఏ పార్టీ కాదు మొత్తం రాష్ట్రం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన రాజధాని వివాదం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అమరావతే ఏకైక రాజధాని అనే వాదన, మరోవైపు మావిగాన్, విజయవాడ, దొనకొండ వంటి కొత్త ప్రతిపాదనలు. ఈ నేపథ్యంలో అసలు ప్రశ్న ఒక్కటే రాజధాని మార్పు నిజంగా అంత సులభమా? 2014లో రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్‌ను పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పేర్కొన్నారు. అనంతరం అప్పటి ప్రభుత్వం శాసనసభ తీర్మానం ద్వారా అమరావతిని రాజధానిగా నిర్ణయించింది. అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే, వేలాది మంది రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో ల్యాండ్ పూలింగ్ ద్వారా 30 వేల ఎకరాలకు పైగా భూమిని స్వచ్ఛందంగా అప్పగించారు. ప్రభుత్వంతో చట్టబద్ధమైన అభివృద్ధి ఒప్పందాలు చేసుకుని భూములను ఇచ్చారు. ప్రతిఫలంగా అభివృద్ధి చేసిన ప్లాట్లు, మౌలిక సదుపాయాలు, రాజధాని అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలపై వారు విశ్వాసం ఉంచారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన వచ్చింది. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో శాసన, కార్యనిర్వాహక, న్యాయ రాజధానులను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే ఈ ప్రతిపాదన రాజకీయంగా ఎంత చర్చకు దారితీసిందో, అంతకంటే ఎక్కువగా న్యాయపరమైన వివాదాలకు కూడా కారణమైంది. రాజధాని అభివృద్ధి ఆగిపోవడం వల్ల పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు. భూములు ఇచ్చిన రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాజధాని మార్పుకు మొదటి పెద్ద ప్రతిబంధకం రైతులతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం. ఇది ఎన్నికల హామీ కాదు. ప్రభుత్వఉత్తర్వులు, చట్టబద్ధమైన అభివృద్ధి ప్రణాళికలు, భూసమీకరణ ఒప్పందాల ఆధారంగా జరిగిన ప్రక్రియ. ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని చూపించి రైతుల నుంచి భూములు తీసుకుంది. అలాంటి పరిస్థితిలో తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ లక్ష్యాన్నే పూర్తిగా మార్చేస్తే, అది ఒప్పంద నమ్మకాన్ని దెబ్బతీసినట్లవుతుంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వానికైనా ప్రజలు భూములు ఇవ్వడానికి వెనుకాడే పరిస్థితి ఏర్పడుతుంది. అమరావతి రైతులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పులో, ప్రభుత్వం రైతులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొంది. రాజధాని అభివృద్ధి విషయంలో ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించకూడదని స్పష్టం చేసింది. ఈ తీర్పు మీద తదుపరి న్యాయపరమైన పరిణామాలు ఎలాఉన్నా, రైతుల ఒప్పందాలకు న్యాయపరమైన ప్రాధాన్యం ఉందనే విషయం స్పష్టమైంది. ఇటీవల కేంద్రప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో సవరణ చేసి అమరావతి పేరును రాజధానిగా చేర్చిందని, రాష్ట్రపతి ఆమోదం గెజిట్ ప్రకటన వెలువడిందని ప్రభుత్వం పేర్కొంటోంది. చట్టపరంగా రాజధాని పేరు స్పష్టంగా నమోదై ఉండటం వలన భవిష్యత్తులో దానిని మార్చాలంటే కేవలం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం సరిపోదు. మళ్లీ పార్లమెంటులో చట్ట సవరణ అవసరమయ్యే అవకాశం ఉంటుంది. అంటే రాష్ట్ర రాజకీయ సంకల్పం ఒక్కటే సరిపోదు. కేంద్రప్రభుత్వ మద్దతు, పార్లమెంట్ ఆమోదం కూడా అవసరమవుతుంది. అయితే పార్లమెంట్‌లో ప్రధాన ప్రతి పక్షంతోసహా అనేక రాజకీయ పక్షాలు అమరావతిని సమర్థించాయి. అయితే మరలా పార్లమెంట్‌లో రాజధాని మార్పుకు ఇవి ముందుకు వచ్చే అవకాశం ఉందా? ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి గణనీయమైన నిధులు కేటాయించింది. కేంద్రహామీతో ఆర్థిక సంస్థల నుంచి రుణాలు కూడా సమకూరాయి. ఇలాంటి పరిస్థితిలో నిర్మాణంలో ఉన్న రాజధానిని పూర్తిగా మార్చాలని ప్రతిపాదిస్తే అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఇప్పటికే ఇచ్చిన నిధుల పరిస్థితి ఏమిటి? తీసుకున్న రుణాల బాధ్యత ఎవరిది? కొనసాగుతున్న ప్రాజెక్టుల భవిష్యత్తు ఏమిటి? కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఎలా ఉంటుంది? ఇవి రాజకీయ ప్రశ్నలు మాత్రమే కాదు, ఆర్థిక, పరిపాలనా ప్రశ్నలు కూడా. కొనసాగుతున్న ప్రాజెక్టుల భవిష్యత్తు ఏమిటి? కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఎలా ఉంటుంది? ఇవి రాజకీయ ప్రశ్నలు మాత్రమే కాదు, ఆర్థిక, పరిపాలనా ప్రశ్నలుకూడా. ఒక ప్రాంతం రాజధానిగా ప్రకటించిన తర్వాత పెట్టుబడులు రావడం ప్రారంభమవుతుంది. రోడ్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ఐటీ సంస్థలు, వాణిజ్య సముదాయాలు, నివాస ప్రాజెక్టులు ఇవి అన్నీ దీర్ఘకాలిక ప్రణాళికలతో వస్తాయి. రాజధాని తరచూ మారుతుందనే భావన ఏర్పడితే పెట్టుబడిదారులు సహజంగానే వెనక్కి తగ్గుతారు. పెట్టుబడులకు రాజకీయ స్థిరత్వం ఎంత అవసరమో, విధాన స్థిరత్వం కూడా అంతే అవసరం. ప్రతి ప్రభుత్వం రాజధాని మార్చితే? ఇలా ప్రతి ఎన్నిక తర్వాత రాజధాని మారితే రాష్ట్ర పరిపాలన స్థిరత్వం ఎక్కడ ఉంటుంది? రాజధాని అనేది ఐదేళ్ల రాజకీయ అజెండా కాకూడదు. అది కనీసం యాభై సంవత్సరాల దూరదృష్టితో నిర్మించాల్సిన వ్యవస్థ. ప్రతిపక్షం రాజధాని నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తే, ప్రజాస్వామ్యంలో దానికి స్పష్టమైన మార్గాలున్నాయి. దానికై నిస్పాక్షిక విచారణ జరగాలి. సాక్ష్యాలు ఉంటే దర్యాప్తు జరగాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రజాధనం దుర్వినియోగమై ఉంటే తిరిగి రాబట్టాలి. కానీ అవినీతి ఆరోపణలకు పరిష్కారం రాజధానినే మార్చడంకాదు. తప్పు జరిగి ఉంటే దానిని సరిదిద్దాలి. మొత్తం వ్యవస్థనే మార్చేయడం సరైన ప్రజాపాలన కాదు. ప్రభుత్వాలు మారడం ప్రజాస్వామ్యంలో సహజం. కానీ ప్రభుత్వం ఇచ్చిన చట్టబద్ధమైన హామీలపై ప్రజలకు విశ్వాసం లేకపోతే, భవిష్యత్తులో ఏ అభివృద్ధి ప్రాజెక్టు కూడా ముందుకు సాగదు. పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టారు. ఆర్థికసంస్థలు రుణాలు ఇవ్వడంలో వెనుకడుగు వేస్తాయి. అందుకే రాజధాని అంశంలో రాజకీయాల కంటే ప్రజా విశ్వాసమే ముఖ్యమైనది. ముగింపు రాజధాని మార్పుఅనేది కేవలం ఒక ప్రకటనతో జరిగిపోయే విషయం కాదు. దానికి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, ఒప్పందపరమైన, ఆర్థిక, పరిపాలనా, రాజకీయ అంశాలు అన్నీ ముడిపడి ఉంటాయి. ప్రత్యేకించి రైతులతో జరిగిన భూసమీకరణ ఒప్పందాలు, న్యాయస్థానాల తీర్పులు, కేంద్ర నిధులు, రుణాలు, కొనసాగుతున్న నిర్మాణాలు, పెట్టుబడిదారుల విశ్వాసం, పార్లమెంట్ స్థాయిలో జరిగిన చట్టపరమైన మార్పులు ఇవన్నీకలిసి రాజధాని మార్పును అత్యంత సంక్లిష్టమైన అంశంగా మారుస్తాయి. అందువల్ల రాజధాని గురించి చర్చజరిగితే అది ప్రాంతాలమధ్య పోటీగాకాకుండా, రాష్ట్రభవిష్యత్తు, ప్రజా విశ్వాసం, చట్టబద్ధత, అభివృద్ధి అనే నాలుగుసూత్రాల ఆధారంగా జరగాలి. రాజధాని ఒక రాజకీయ నినాదంకాదు. అది తరతరాల భవిష్యత్తును నిర్ణయించే రాష్ట్ర నిర్మాణానికి పునాది. ఆ పునాదిని ప్రతి ఎన్నికకు మార్చడంకంటే, దానిని బలోపేతంచేయడం రాష్ట్రప్రయోజనాలకు మరింత అనుకూలమైన మార్గం. ఇప్పటికైనా రాజధాని రాజకీయాలకు ముగింపుపలికి, అభివృద్ధి రాజకీయాలకు శ్రీకారం చుట్టవలసిన సమయం ఆసన్నమైంది. ●



# గుంటూరు వార్త

## వావిలాల స్మారక పార్కులో తిష్టవేసిన సమస్యలు

### - సత్తెనపల్లి వాసులకు కానరాని ప్రశాంతత

సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త: సత్తెనపల్లికి ఒక గుర్తింపు కలిగిన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య మెమోరియల్ పార్కులో ప్రజల ఇక్కట్లు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని, ప్రశాంతతను అందించాల్సిన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య మెమోరియల్ పార్కు ఇప్పుడు సమస్యల వలయంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో కాసేపు సేదతీరుదామని వచ్చే ప్రజలకు ఇక్కడ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రజా ధనంతో ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలను కొందరు






ఆకతాయిలు, తాగుబోతులు ఇష్టారాజ్యంగా విరగ్గొట్టి ధ్వంసం చేశారు. పార్కుకు వస్తున్న వృద్ధులు, మహిళలు కూర్చోవడానికి కూడా సీట్లు లేని పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కానీ, సిబ్బంది కానీ కనీసం పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, పార్కులో మరో ప్రధాన సమస్య కోతుల విలయం. పార్కు అంతటా కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ, ఇక్కడికి వచ్చే చిన్న పిల్లలపై, వాకర్లపై దాడులకు తెగబడుతున్నాయి. పార్కుకు ప్రశాంతత కోసం వస్తే. ఎప్పుడు ఏ కోతి ఎటు నుంచి వచ్చి దాడి చేస్తుందో తెలియక జనం బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. తాగుబోతుల ఆగడాలు ఒకవైపు, కోతుల ఇబ్బందులు మరోవైపు. వెరసి పార్కు నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం చీకటి పడిన తరువాత వాకింగ్ ట్రాక్లో సరిగా లైటింగ్ లేని కరణంగా అసాంఘిక కార్యక్రమాలు కూడా యమ జోరుగా కొనసాగిస్తున్నారు. నిత్యం పిల్లలు, పెద్దలు, ముసలివారు వచ్చి వెళ్ళే ఈ ప్రశాంత ఆహ్లాదకరమైన ఈ ప్రదేశాన్ని ఈవిధంగా భ్రష్టుపట్టిస్తున్న అసాంఘిక శక్తులను కూడా పారద్రోలి సత్తెనపల్లికి ఒక గుర్తింపు కలిగిన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య మెమోరియల్ పార్కును కాపాడవలసిందిగా అధికారులకు సత్తెనపల్లి పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ గారు స్పందించి, పార్కులో విరిగిపోయిన బల్లలను పునరుద్ధరించాలని, కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మరియు అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా సత్తెనపల్లి పట్టణ పోలీసు అధికారులు సాయంత్రం వేళ రెక్కి నిర్వహించాలని, సత్తెనపల్లి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కాన్పుల మధ్య విరామం... తల్లి ,బిడ్డకు క్షేమం

క్రోసూరు( జూలై 11 ప్రభాతవార్త ): కాన్పుల మధ్య తగిన విరామం పాటించటం, అవాంఛత గర్భధారణలను నివారించటం, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా క్రోసూరు మండల వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు ఈనెల 11 నుంచి 18 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైద్యులు రవికుమార్ అనిల్ కుమార్ ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ లు శనివారం పేర్కొన్నారు శనివారం ప్రపంచ జనాభా



దినోత్సవం సందర్భంగా క్రోసూరు లో జరిగిన ప్రదర్శనలో వారు పాల్గొన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ డిసెంబర్ 1990 నాటి 45/216 తీర్మానం ద్వారా, పర్యావరణం, అభివృద్ధికి, జనాభా సమస్యలపై అవగాహన పెంచడానికి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని కొనసాగించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించింది అన్నారు ఆరోగ్య పర్యవేక్షకులు శివుడు, మహిళా సూపర్వైజర్ లక్ష్మీ కుమారి, ఫార్మసిస్ట్ ఫాతిమా, స్టాఫ్ నర్స్ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



కొల్లిపర, జూలై 11, ప్రభాతవార్త:విద్యుత్ ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన కొల్లిపర మండలంలోని అన్నవరంలో శనివారం చోటుచేసుకుంది. ట్రాక్టర్‌తో పశువుల ఎరువును రవాణా చేస్తున్న పిల్లి సాయికుమార్(21)కు కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే సాయికుమార్‌ను మెరుగైన వైద్య చికిత్స కోసం 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## వాహనచోదకులు నిబంధనలు విస్మరిస్తే చర్యలు:ఎస్ఐ ప్రసాద్

కొల్లిపర, జూలై 11, ప్రభాతవార్త:నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని కొల్లిపర ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం మండలంలోని



కొల్లిపర, దావులూరు, చివలూరు, సిరిపురంలలో వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే సీజ్ చేసి జరిమానా విధిస్తామని చెప్పారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగిన మైనర్లు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు నడిపితే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వాహనాలను నడిపే మైనర్లపై చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

## వైద్యుల సలహాతో మందులు వాడుకోవాలి

కొల్లిపర, జూలై 11, ప్రభాతవార్త:వైద్యుల సలహా ప్రకారం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మందులను వినియోగించుకోవాలని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శనివారం కొల్లిపరలో మెడికల్ క్యాంపును వైద్యాధికారులు నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సలహాలు, సూచనలిచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కళ్యాణి, ఎఎన్ఎం లక్ష్మి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు విజయ, జయప్రద, పద్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## పాటు కాటుకు వ్యక్తి మృతి



వేమూరు జూలై 11 (ప్రభాతవార్త_) : వేమూరు గ్రామానికి చెందిన రైతు మన్నే లక్ష్మయ్య (44)శనివారం ఉదయం పొలంలో పశువులకు మేత కోసేందుకు వెళ్ళగా పాముకాటుకు గురై మృతి చెందారు. పాముకాటుకు గురైన విషయాన్ని తెలుసుకున్న లక్ష్మయ్య తన తమ్ముడికి ఫోన్ చేయగా తమ్ముడుతో కలిసి మోటార్ సైకిల్‌పై వేమూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళగా ప్రథమ చికిత్స అనంతరం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మార్గ మధ్యంలో చనిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై రైతులు ఇబ్బందులు పడుతున్నారు

యడ్లపాడు, జూలై 11, ప్రభాతవార్త : యడ్లపాడులోని పీఏర్ విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎనిమిది గ్రామాల నుంచి 14 మంది కమిటీ సభ్యులు హాజరయ్యారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల పంపిణీ



కోసం ప్రవేశపెట్టిన యాప్ రైతులకు అనుకూలంగా లేదని, వెంటనే దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు, అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని, పంటలకు గిట్టుబాటు ధర అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ-క్రాప్ ఆధారంగా పంటల బీమాను ప్రభుత్వం పూర్తిగా అమలు చేయాలని, గ్రామ యూనిట్‌ని ప్రాతిపదికగా తీసుకుని బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎరువుల యాప్‌లోని నిబంధనల వల్ల సాధారణ రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందే పరిస్థితి ఉండదని నాయకులు విమర్శించారు. గతంలో సీసీఐ పత్తి కొనుగోలు కోసం తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు కాకపోవడంతో అనేక మంది రైతులు ప్రైవేట్ దళారులకు పత్తి విక్రయించాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అదే పరిస్థితి ఎరువుల యాప్ వల్ల కూడా ఏర్పడే ప్రమాదం ఉందని, యాప్‌లో నమోదు కాకపోతే రైతులకు ఎరువులు అందక దిగుబడులు తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు, ఎరువుల కొరతతో మరింత నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతులందరూ ఈ అంశంపై గ్రామస్థాయిలో చర్చించి సంఘటితంగా ముందుకు వచ్చి తమ హక్కులను సాధించుకోవాలని రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కల్లూరు రామారావు అధ్యక్షులు అనిల్, శ్రీనివాస రెడ్డి, రామస్వామి, వీరారెడ్డి, జయరాం, సుభాని, అంకమ్మరావు, మల్లికార్జున రావు, బాబు వెంకటేశ్వర్లు, వీరయ్య జగన్, ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు ఉండాలి

### -రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

వేమూరు జూలై 11 (ప్రభాతవార్త_) : అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండే విధంగా చూడాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం వేమూరులో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేమూరులో 103, 108 పోలింగ్ బూత్లలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఇంటింటికి తిరిగి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతంగా సాగుతుందన్నారు. ఈ



నేపథ్యంలో వేమూరు నియోజకవర్గంలోని వేమూరు గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఇంటింటికి వెళ్ళి ఓటర్ల వివరాలను నమోదు చేసే ప్రక్రియను పరిశీలన చేయడం జరిగిందని ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా సర్వే పూర్తి చేయాలని సూచించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 84శాతం సర్వే పూర్తైందని వెల్లడించిన ఆయన, మిగిలిన ప్ర క్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అధికారులు, కలెక్టర్లు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే ఓటర్లు, వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు కూడా సర్వే విజయ వంతానికి సహకరిస్తున్నారని తెలిపారు. ఈనెల 14వ తేదిలోపు ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు సర్వే చేయించుకోని అర్హులైన ఓటర్లు వెంటనే తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు లేదా వివరల్లో మార్పులు చేసుకోవాల్సి న వారు ఫారం-6, ఫారం-8ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆయనతో పాటు డిఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, ఆర్డీవో శ్రీదేవి, తహశీల్దార్ పి.పార్వతి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రేపల్లె, జూలై 11. ప్రభాతవార్త:మండలంలోని పోటుమెరక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ మహావిష్ణువు భజన భక్త సమాజం ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం, భజనలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, జాహ్నవి శివశ్రీ, సునీల్, రేపల్లె చెంచయ్య, బొల్లిముంత సుందరరామిరెడ్డి, మాదివాడ రేణుక స్వామి తదితరులు పాల్గొన్నారు.



## మానవత సేవా సంఘంతో ప్రజలకు ప్రయోజనం

రేపల్లె, జూలై 11, ప్రభాతవార్త:సమాజంలో మానవత సేవా సంఘం నిర్వహించే సేవలతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలుగుదేశం పార్టీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని బి.వి.శేషగిరిరావు పంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 143వ శాఖగా రేపల్లెలో సేవలు అందించేందుకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. సంస్థకు అవసరమైన సహకారాన్ని అందజేస్తామని తెలిపారు. రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వానికి బాసటగా స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. రేపల్లె డిఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ విపత్కర సమయంలో సేవలు అందించేందుకు మానవత సేవా సంఘం ముదుండాలన్నారు. సంఘలో యువకులు, విద్యార్థులను సభ్యులుగా చేర్చుకుని సంఘ సేవలను విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మున్సి పల్ కమీషనర్ కాకర్ల సాంబశివరావు, మానవత సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, సంస్థ గుంటూరు జిల్లా ఛైర్మన్ పావులూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**కార్యవర్గం ప్రమాణ స్వీకారం..**

మానవత సేవా సంఘం రాష్ట్ర శాఖ వ్యవస్థాపకుడు, రాష్ట్ర కమిటీ ఛైర్మన్ ఎన్.రామచంద్రారెడ్డి నేతృత్వంలో రేపల్లె శాఖ అధ్యక్షుడిగా కోడె గౌరీశంకర్, ఉపాధ్యక్షుడిగా పిన్ని సాంబశివరావు, కార్యదర్శిగా కె.శివశంకరరాజు, సంయుక్త కార్యదర్శిగా బావిరెడ్డి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా మేకా రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎంబిఎల్ నారాయణమూర్తి, కె.అగస్త్య, కె.నటరాజ్, పి.శ్రీనివాసరావు, డైరెక్టర్‌గా పి.వి.జగన్నాథ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రేపల్లె శాఖ అధ్యక్షుడు కోడె గౌరీశంకర్ మాట్లాడుతూ మానవత సేవా సంఘం ద్వారా ఉచిత భోజనాలు, రక్తదాన సేవలు, వైద్య శిబిరాలు, విద్యార్థుల కోసం నైపుణ్య వికాస శిక్షణ, శాంతి ర్యాలీలు, ఉచిత బాడీ ఫ్రీజర్ సేవలు, చైతన్య సదస్సు లు, ఆత్మీయ సమావేశాలు, నేత్ర, అవయవ దానంపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

## సర్ ప్రక్రియ గడువును పొడిగించాలి



రేపల్లె, జూలై 11, ప్రభాతవార్త:వందల సంఖ్యలో ఓటు హక్కు కోల్పోయే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సర్ ప్రక్రియ గడువును పొడిగించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.కృష్ణమోహన్, భట్టి ప్రోలు మండల కార్యదర్శి పి.మనోజ్‌కుమార్‌లు శనివారం భట్టి ప్రోలు తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. 2002 ఓటర్ల జాబితాలో తల్లిదండ్రుల ఓట్లు కనిపించకపోవడంతో తీవ్రమైన జాప్యం జరుగుతున్నదని, ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వలసవెళ్ళినవారి దరఖాస్తులను, ఆధారాలను తిరిగి ఇవ్వడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. బిఎల్‌వోలు వత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ఎన్నికల అధికారులు స్పందించి ఈ నెల 14వ తేదీ వరకే పరిమితం చేసిన సర్ కార్యక్రమాన్ని ఒక నెల రోజుల పాటు పొడిగించాలని కృష్ణమోహన్, మనోజ్‌కుమార్‌లు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మురుగుడు సత్యనారాయణ, జి.సుధాకర్, దీపాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ్‌కుమార్‌పై విమర్శలు అర్ధరహితం

రేపల్లె, జూలై 11. ప్రభాతవార్త:మాజీ న్యాయమూర్తి, హైకోర్టు ప్రముఖ న్యాయవాది, జై భీమ్‌రావు భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్‌పై జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న అసంబద్ధ వ్యాఖ్యలు అర్ధరహితమని జెబిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది దోవ రమేష్ రాంజీ స్పష్టం




చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపా చట్టాన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని చెప్పారు. ప్రశ్నించేందుకే పార్టీ ఏర్పాటు చేశానని చెప్పి అధికారంలోకి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశ్నించే వారిపైనే అక్రమ కేసులు పెట్టించడం విచారకరమన్నారు. ఈ కేసులను న్యాయపరంగా అడ్డుకుంటున్న జడ శ్రావణ్‌కుమార్‌పై జనసేన పార్టీ పరుష పదజాలంతో దూషణలకు పాల్పడటం శోచనీయమన్నారు. నిధులు, విధులు లేని మాల కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి పెదపూడి విజయ్‌కుమార్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్ధిక, అధికార బలం లేకపోయినా అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ స్ఫూర్తితో కూటమి పార్టీల కుయుక్తులను ప్రతిఘటిస్తామని రమేష్ రాంజీ చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెబిపి రేపల్లె మండల కన్వీనర్ క్రా బాబురావు, వేమూరు నియోజకవర్గ ప్రచార కమిటీ కన్వీనర్ పంతగాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో పాత ఇనుప సామాను దుకాణం దగ్ధం

రేపల్లె, జూలై 11, ప్రభాతవార్త:భట్టి ప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్, పెట్రోల్ బంక్ మధ్యలో కొనసాగుతున్న పాత ఇనుప సామాను దుకాణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం దగ్ధమైంది. లక్షలాది రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని వ్యాపారి సత్తార్ తెలిపారు భట్టి ప్రోలు ఎస్ఐ కె.అమీర్ భట్టిప్రోలు-రేపల్లె రహదారి మార్గంలోని ఆర్టీసీ బస్సు లు, లారీలు, ద్విచక్ర వాహనాలను దారి మళ్ళించారు.

## ఘనంగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ వజ్రోత్సవ వేడుకలు

రేపల్లె, జూలై 11, ప్రభాతవార్త:రేపల్లె ఆర్టీసీ డిపోలో శనివారం ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. రేపల్లె డిపో ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఆకురాతి రంగనాథ్ , ఈ కార్య క్రమంలో సిపిఐ సీనియర్ నాయకుడు కన్నెగంటి రమేష్‌బాబు, ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ బేబీ కుమారి, డిపో జాయింట్ సెక్రటరీ రాజశ్రీ, డిపో అసిస్టెంట్ సెక్రటరీ సిహెచ్.లక్ష్మి, ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డిఎస్ చిట్టిబాబు, గ్యారేజీ కార్యదర్శి మురళి, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పశుగ్రాస వారోత్సవాలు సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు, జూలై 11, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశుగ్రాస వారోత్సవాలను అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కొండా వీర వెంకట సత్యనారాయణ



కోరారు. నిడుబ్రోలు గ్రామంలో శనివారం జరిగిన పశుగ్రాస వారోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రైతులకు క్షేత్రస్థాయిలో పచ్చిగడ్డి పెంపకంపై అవగాహన కల్పించారు. నిడుబ్రోలు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కేశవరావు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు

పొన్నూరు, జూలై 11, ప్రభాతవార్త: స్థానిక ఆర్టీసి డిపోలో శనివారం ఏపిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



యూనియన్ నాయకులు మాట్లాడుతూ 1932సంవత్సరంలో నిజాంస్టేట్ రైల్వేలో భాగంగా ఉన్న రోడ్డు మోటార్ ట్రాన్స్‌పోర్టు సర్వీస్ పేరుతో ఉన్న రోడ్డు రవాణా సంస్థగా 1950సంవత్సరంలో రైల్వేల నుంచి విడిపోవడం జరిగిందన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ తెచ్చి సంస్కరణలు, ఇప్పటి వరకు సాధించిన విజయాల గురించి నాయకులు వివరించారు. స్థానిక డిపో ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. డిపో సెక్రటరీ ఎఎబేగ్, యూనియన్ అధ్యక్షుడు జ్ఞానరాజు, ఏఐటియుసి నాయకుడు ఆరేటి రామారావు, గ్యారేజి కార్యదర్శి కె.శ్రీనివాసరావు, బి.సురేష్, జాయింట్ సెక్రటరీ కెఎస్ రావు, షేక్ కరీముల్లా, షేక్ రహీంసాహెబ్, జి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నూరుశాతం డిజిటైజేషన్‌ను పూర్తి చేయాల్సిందే

పొన్నూరు, జూలై 11, ప్రభాతవార్త: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో బిఎల్వోలు వారికి సంబంధించిన డిజిటైజేషన్‌ను నూరుశాతం పూర్తి చేయాల్సి ందేనని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి కొండా వీర వెంకట సత్యనారాయణ ఆదేశించారు. మండల, పట్టణ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి బిఎల్వోలకు తగు సూచనలు చేశారు. తొలుత తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి కెవివి సత్యనారాయణ, తహశీల్దార్ మహమ్మద్



జియావుల్ హక్, మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు మండల, పట్టణ పరిధిలోని బిఎల్వోలతో వెబ్‌ఎక్స్ నిర్వహించారు. తక్కువశాతం డిజిటైజేషన్ పూర్తి చేసినవారిని హెచ్చరించారు. ప్రతి బిఎల్వో నూరుశాతం డిజిటైజేషన్ పూర్తి చేయాల్సి ందేన్నారు. నియోజకవర్గం మొత్తం మీద 85.67శాతం డిజిటైజేషన్ పూర్తి అయిందన్నారు. పెదకాకాని-85.38శాతం, చే బ్రోలు-85.26శాతం, పొన్నూరు అర్బన్-81.90శాతం, పొన్నూరురూరల్-90.18శాతం పూర్తి అయిందన్నారు. 95శాతంపైగా 8మంది, 90శాతం పైగా 29మంది, 80నుంచి 90మధ్య 27మంది, ఉన్నట్లు చెప్పారు. నియోజకవర్గం మొత్తం 2,28,214 ఓటర్లు కాగా వీరిలో 2,27,551మందికి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయడం జరిగిందన్నారు. 1,95,509మంది ఓటర్లను డిజిటైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు.

## ప్రతిపౌరుడి ఓటును కాపాడే బాధ్యత బిఎల్యేలదే

పొన్నూరు, జూలై 11, ప్రభాతవార్త: ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటును కాపాడడం ప్రతి బిఎల్యేపై ఆధారపడి ఉందని వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సూచించారు. స్థానిక పార్టీ



కార్యాలయంలో శనివారం బిఎల్యేల సమావేశం జరిగింది. సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సర్‌కు గడువు ఇక రెండు రోజులు మాత్రమే ఉందని, ఈ రెండు రోజుల్లో నూరుశాతం పూర్తి చేసి ఓటర్లను కాపాడాలన్నారు. సర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా బూత్ లెవల్ అధికారులతో బిఎల్యేలు సమన్వయం చేసుకొంటూ ప్రతి ఓటరుకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు సక్రమంగా నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. పట్టణ, మండల అధ్యక్షులు షేక్ నాజర్, చింతలపూడి మురళీకృష్ణ, చిర్రా అక్కిరెడ్డి, షేక్ మౌలాలి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవలందిస్తున్న హెల్ప్ డిస్క్

పొన్నూరు, జూలై 11, ప్రభాతవార్త: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ఫారుక్ షుబ్లీ ఆదేశాల మేరకు పొన్నూరు పట్టణంలో గత 20రోజుల నుంచి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నట్లు హెల్ప్ డెస్క్ కన్వీనర్ జాఫర్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సి వ్ రివిజన్ ప్రక్రియ వేగవంతంగా సాగేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారం,



దరఖాస్తులు నింపడం, సందేహాల నివృత్తి, అవసరమైన పత్రాలపై మార్గదర్శకత్వం అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గడువు రెండు రోజులు మాత్రమే ఉన్నందుకు ఇంకెవరైనా మిగిలినవారు ఉన్నట్లయితే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని కోరారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 373కేసులకు పరిష్కారం

పొన్నూరు, జూలై 11, ప్రభాతవార్త: స్థానిక ప్రిన్సి పల్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ




లోక్ అదాలత్ కార్యక్రమంలో మొత్తం 373కేసులకు పరిష్కారం లభించిందని ప్రిన్సి పల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి తెలిపారు. పరిష్కరించిన కేసుల్లో సివిల్ కేసులు-22, క్రిమినల్ కేసులు-62, మనోవర్తి కేసులు-3, ఎస్టీసీలు-255, గృహ హింస కేసులు-3, ఎక్సైజ్ కేసులు-28ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జడ్జి రుక్మిణి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు న్యాయం చేకూరుతుందన్నారు. ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న కేసులకు అదాలత్‌లో పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎంహెచ్‌ఎస్ సాయిబాబు లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రెండవ తరగతి మెజిస్ట్రేట్ ఎం.మురళీమనోహర్‌దాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్, న్యాయవాదులు మల్లెల ఈరేష, మగ్బుల్‌బేగ్, సదానందరావు, ఎన్.కృష్ణ, రాధాకృష్ణ, జి.శ్రీనివాసరావు, బి.అంకమ్మరావు, ఏవిపి లక్ష్మి, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా రవాణా ప్రభుత్వ అధీనంలోనే ఉండాలి


పొన్నూరు, జూలై 11, ప్రభాతవార్త: ప్రజా రవాణా ప్రభుత్వ అధీనంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసి ఉద్యోగ సంఘాల జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసి డిపో ఎదుట శనివారం ధర్నా, గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆర్టీసి విలువైన ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ఆలోచనను విరమించుకోవా



లన్నారు. విద్యుత్ బస్సు ఆపరేటర్ల కోసం డిపోలను ఖాళీ చేయించే విధానాన్ని మానుకోవాలన్నారు. స్త్రీ శక్తి పథకం విజయంతం చేసేందుకు వెంటనే నాలుగు వేల కొత్త బస్సు లను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఏసి జిల్లా కన్వీనర్ ఎంఎస్ రెడ్డి, కో-కన్వీనర్ రవిశంకర్, రాష్ట్ర కో కన్వీనర్ ఎం.హరిప్రసాద్, డిపో కన్వీనర్లు ఎం.నాగేశ్వరరావు, ఎఎబేగ్, షేక్ బాజిసాహెబ్, బుడేసాహెబ్, జె.కిషోర్, కె.శ్రీనివాస్ తదితరులున్నారు.

## విజ్ఞాన్స్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ ప్రదానం

పొన్నూరు, జూలై 11, ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పరిధిలోని ఈసీఈ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి మహబూబ్ సుభానీ పఠాన్‌కు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు యూనివర్సి టీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ అవేర్ ఆప్టిమల్ రూట్ సెలెక్షన్ ఫర్ ఇంటర్




వెహిక్యులర్ కమ్యూనికేషన్స్ ఇన్ వానెట్స్ అనే అంశంపై మహబూబ్ సుభానీ పఠాన్ విజయవంతంగా పరిశోధన పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ పరిశోధనకు విజ్ఞాన్స్ యూనివర్సి టీ ఈసీఈ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.అన్నపూర్ణ పరిశోధన మార్గదర్శకులరాలిగా(గైడ్‌గా) వ్యవహరించినట్లు తెలిపారు. పీహెచ్‌డీ పట్టా సాధించిన మహబూబ్ సుభానీ పఠాన్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ , వివిధ స్కూళ్ళ డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

## లోక్ అదాలత్‌లో 1225 కేసులకు పరిష్కారం

రేపల్లె, జూలై 11, ప్రభాతవార్త:పట్టణంలోని కోర్టు హాలులో శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కేసులను పరిశీలించిన తెనాలి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వెంకటేశ్వరరెడ్డి 1225 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెనాలి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## ఏపీఆర్‌జేసీ లో ఘనంగా అలుమ్ని మీట్

విజయపురిసౌత్ ,జూలై 11, ప్రభాతవార్త: స్థానిక విజయపురిసౌత్ ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలను ఎ. పి. ఆర్. జే. సి. ఆధ్వర్యంలో సాగర్ పరివార్ అలుమ్ని మీట్-2026 అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 1976 78 బ్యాచ్ చెందిన 25 మంది పూర్వ విద్యార్థుల హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి శ్రీ కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా, ఏపీఆర్ఈఐఎస్ జాయింట్ సెక్రటరీ ఉబేదుల్లా విశిష్ట అతిథిగా హాజరై విద్యార్థులను విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని వారు సూచించారు. అలాగే పూర్వ విద్యార్థులు తమ మాతృసంస్థతో అనుబంధాన్ని కొనసాగిస్తూ కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. హేమాంబర రెడ్డి మాట్లాడుతూ కళాశాల ప్రగతి, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల విజయాలు, తమ విద్యార్థి జీవితంలోని మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, జీవిత విలువలపై విలువైన సూచనలు అందించారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, వివిధ విద్యాసంస్థల, అతిథులు పాల్గొన్నారు.



## శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు అయోమయం

### ఉపాధి కోల్పోతున్న కార్మికులు : పునఃప్రారంభించాలని కోరుతున్న కార్మికులు

కారంపూడి, జూలై 11, ప్రభాతవార్త: ఒకప్పుడు పల్నాడు ప్రాంతంలో ఉపాధికి చిరునామాగా నిలిచిన శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ప్రస్తుతం కార్యకలాపాలు నిలిచిపోవడంతో వందలాది మంది కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పరిశ్రమపై ఆధారపడి జీవించిన అనేక కుటుంబాలు ప్రస్తుతం ఉపాధి లేక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. ఫ్యాక్టరీ మూసివేతతో కార్మికులే కాకుండా రవాణా రంగం, చిన్న వ్యాపారులు, హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఇతర అనుబంధ రంగాలపై కూడా తీవ్ర ప్రభావం పడిందని స్థానికులు చెబుతున్నారు. ఒకప్పుడు పరిశ్రమ కార్యకలాపాలతో కళకళలాడిన ప్రాంతం ఇప్పుడు నిర్మానుష్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఫ్యాక్టరీ కాలనీలో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు కాలనీని ఖాళీ చేయాలని యాజమాన్యం నోటీసులు జారీ చేసినట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా సంస్థలో శాశ్వత ఉద్యోగులుగా పనిచేసి కాలనీలో నివసిస్తున్న వారికి కూడా ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో వారి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కాలనీని ఖాళీ చేయకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించినట్లు కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం కొనసాగుతున్న సమయంలో పిల్లలు స్థానిక పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఇళ్లను ఖాళీ చేయాల్సి వస్తే ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కోల్పోయిన పరిస్థితుల్లో వేల రూపాయల అడ్వాన్స్‌లు చెల్లించి కొత్త ఇళ్లు అద్దెకు తీసుకోవడం తమ వల్ల కాదని, ఒకవైపు ఉద్యోగం లేక, మరోవైపు నివాసం కోల్పోయే పరిస్థితి రావడం అత్యంత బాధాకరమని వాపోతున్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఇప్పటికే మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరించడంపై తగిన చర్యలు కనిపించడం లేదని కార్మికులు అంటున్నారు. కొత్త పరిశ్రమలు రాకపోవడం వల్ల స్థానిక యువత ఉపాధి కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు. శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు, యాజమాన్యం చొరవ తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పరిశ్రమ పునఃప్రారంభమైతే వందలాది కుటుంబాలకు మళ్లీ ఉపాధి లభించడంతో పాటు, కాలనీలో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు కూడా భరోసా లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## పేదల హృదయాలలో శిరస్థాయిగా నిలిచిన ఆదినారాయణ

### 18న 20వ వర్ధంతి పాల్గొనున్న సిపిఐ నేతలు

కారంపూడి, జూలై 11, ప్రభాతవార్త: పేదల హృదయాలలో శిరస్థాయిగా నిలిచిన వ్యక్తి డాక్టర్ మంగుళూరి ఆదినారాయణ చిన్న వయసులోనే కమ్యూనిస్టు భావాలు కలిగిన వ్యక్తి పిడుగు రాళ్ల మండలం గుత్తికొండ గ్రామంలో మంగళూరు జలప్పాపులమ్మలకు 1946 ఆయన జన్మించారు యస్ ఎల్ సి ని కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ పాఠశాల లో పూర్తి చేసారు వైద్యంపై దృష్టి పెట్టారు ఆయుర్వేదిక వైద్యంలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మన సొంత గ్రామం గుత్తికొండలో ప్రజా వైద్యశాల ఏర్పాటుచేసి పేదఖి మధ్యతరగతి కుటుంబాలకు వైద్య సేవలు అందించారు గ్రామంలోని భూస్వాములకు వ్యతిరేకంగా భూ పోరాటం చేశారు. నిరు పేదలకు భూములు ఇప్పించే కార్యక్రమంలో తన వంతు సహకరించారు. 1982 సంవత్సరంలో కారం పూడి ప్రజా వైద్యశాల పేరుతో వైద్య సేవలు అందిస్తూ అప్పటి పార్థసారథి సిమెంట్ ఫ్యాక్టరీ ( శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ) లోఏఐటీయూసీ యూనియన్ స్థాపన కోసం కృషి చేశారు. కార్మికులతో సమావేశమై అప్పటి మాజీ గురజాల ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి , దామరచర్ల అప్పయ్య, వంటి నేతలతో యూనియన్ ఏర్పాటు చేశారు. యాజమాన్యం తో కార్మిక సంఘ నేతలు చర్చలు జరిపి కార్మికులు రావాల్సిన సదుపాయాలు కల్పించడంలో ఏఐటీయూసీ ముందుంది. గడిచిన కొంతకాలం తర్వాత కార్మిక సంఘ నేతలను అణిచి వేయటంలో యాజమాన్యం సిద్ధమైంది . 1995 సంవత్సరంలో కారంపూడి సమీపంలోని అడవి ప్రాంతంలో ఉన్న గో సదన్ ను మన సంరక్షణ సమితిగా ఏర్పాటు చేయాలని అప్పటి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సంప్రదింపులు చేసి ( వి ఎస్ ఎస్ ) ఏర్పాటు చేసిన ఘనత ఆదినారాయణ మాత్రమే చేశారు. ఎస్ టి, ఎస్సీ కులాలకు ప్రాధాన్యిస్తూ వన సంరక్షణ సమితిలో పండించిన పంట అందరికీ సమాన హక్కుకల్పించారు . 1995 సంవత్సరంలో సంవత్సరంలో కారంపూడి సమీపంలోని చెన్నకేశవ స్వామి మాన్యంలో 510 మందికి నివేశ స్థలాలు కల్పించిన ఘనత కూడా ఆదినారాయణకి దక్కుతుంది. కుల మతాలకు అతీతంగా అందరూ ఒకే ప్రాంతంలో ఉండాలని ఆయన ఆలోచన చేశారు. ప్రస్తుతం ఉన్న కాలనీ సిపిఐ ఆదినారాయణ కాలనీ . వైద్యుడుగా కూడా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు అప్పటి హోం శాఖ మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు కు మంచి సన్నిహితులుగా ఉండేవారు .కారంపూడి, బొల్లాపల్లి, పిడుగురాళ్ల మండలాల నుండి వైద్యం కోసం ప్రజలు వచ్చేవారు. వైద్యుడిగా తనకంటూ మంచి గౌరవాన్ని సంపాదించుకున్నారు. 2006 సంవత్సరంలో కారంపూడి మేజర్ పంచాయతీ బీసీలకు రిజర్వుడు కావడంతో సర్పంచ్ గా పోటీ చేసేందుకు సిపిఐ కార్యకర్తలతో కలిసి నామినేషన్ వేసేందుకు వెళ్లారు. గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఈనెల 18 తేదీన ఆయన 20 వర్ధంతి జరగనుంది. సిపిఐ ఆదినారాయణ కాలనీలోనే ఆయన పేరుతో 20 అడుగుల స్తూపం కూడా అప్పుడే ఏర్పాటు చేయడం జరిగింది. ఆయన లేకపోయినా ఇప్పటికీ ప్రజల హృదయాలలో శిరస్థాయిగా నిలిచారని చెప్పుకోవచ్చు. ఆయన భార్య విజయ లక్ష్మి, కుమార్తెలు పద్మావతి, నాగమణి, ఝాన్సీ, కుమారుడు లెనిన్ బాబు , సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.




## ప్రజల అనారోగ్యానికి కోళ్ల మాంసం వ్యర్థాల ఎర్ర

### హైదరాబాద్ నుంచి కోడి మాంసం వ్యర్థాలు దిగుమతి

### పల్నాడు చేపల చెరువుల్లో కలుపుతున్న మాఫియా

సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త: హైదరాబాద్ నుంచి ప్రమాదకర కోడి మాంసం వ్యర్థాలు ఆంధ్రప్రదేశ్ కి భారీగా దిగుమతి అవుతోంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా చేపల చెరువుల్లో కోళ్ల మాంసం వ్యర్థాలను కలిపి ప్రజల ఆరోగ్యం దెబ్బతీస్తున్న మాఫియా. అమరావతి, నరసరావుపేట మండలం కేతముక్కల అగ్రహారం , లింగంగుంట్ల, చిలకలూరిపేట, వినుకొండ తదితర ప్రాంతాల్లోని చేపల చెరువుల్లో కలిపిన కోళ్ల వ్యర్థాలతో కలుషితం. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం తొండపి, తురకపాలెం (పమిడిపాడు డొంక) వద్ద చెరువుల్లో ప్రమాదకర పంగస్ చేపల పెంపకం. రెస్టారెంట్లు, హోటల్స్ కి తక్కువ ధరకు ఈ చేపల విక్రయం. క్యాట్ ఫిష్, రూప్ చంద్ చేపలకు కూడా దాణాగా కోళ్ల వ్యర్థాలు. హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన కోళ్ల మాంసం వ్యర్థాలను తొండపి చెరువులో కలుపుతుండగా పట్టుకున్న ముప్పాళ్ల పోలీసులు. వినుకొండ, మాచర్ల, నకరికల్లుకు చెందిన కొంత మంది వ్యాపారులు మాఫియా సిండికేట్ గా కోడి మాంసం వ్యర్థాలు సేకరించి చేపల చెరువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు. ప్రమాదకర బ్యాక్టీరియా, వైరస్ వ్యాపించి ప్రజలు, పశువుల ఆరోగ్యం దెబ్బతింటున్న పట్టించుకోని అధికారులు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయకుండా మామూళ్లు తీసుకొని మాఫియాకు పశుసంవర్ధక, మత్స్య శాఖ యంత్రాంగం సహకరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానిక అధికారులు వివరణ ఇవ్వాల్సిందిగా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## అన్ని వర్గాలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం: గోపీ రెడ్డి

నరసరావుపేట, జూలై 11 ప్రభాతవార్త : ఎన్నికలలో ఇచ్చిన హామీలను విస్మరించి, అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వ మోసం చేసిందని పలనాడు జిల్లా వైఎస్సార్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పార్టీ విభాగాలకు సంబంధించి నియమితులైన నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రానికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం ద్వారా అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వైయస్సార్సీపి జిల్లా వాలంటరీ విభాగం సెక్రటరీగా నక్క వెంకట్ కోటేశ్వరరావు నియామకం కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు నూతన పదవులకు ఎన్నికైన సందర్భంగా పార్టీ కార్యాలయంలో నక్క కోటేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని పూలమాలలు శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా యాక్టర్ నియామకం కావడం సంతోషమని డాక్టర్ గోపిరెడ్డి పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా, వారిని కూటమి ప్రభుత్వం మోసం చేసిందని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై నిరంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని డాక్టర్ గోపిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు ఆకాష్ వేణు తదితరులు పాల్గొన్నారు.



## బ్యాంకు ఉద్యోగం సాధించిన కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి

రొంపిచర్ల, జూలై 11 ప్రభాతవార్త : స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి కావిడి వెంకటేష్ ఐబీపీఎస్ నిర్వహించిన బ్యాంకింగ్ నియామక పరీక్షలో ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ లో ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలియజేశారు. ఉద్యోగానికి ఎంపికైన వెంకటేష్ ను ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు , డైరెక్టర్ నాసరయ్య లు పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందించారు. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో శ్రమిస్తే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చు అన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వాన్ని కళాశాల నిరంతరం అందిస్తోందని తెలిపారు. డైరెక్టర్ నాసరయ్య మాట్లాడుతూ వెంకటేష్ విజయం కళాశాలకు గర్వకారణమని, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగం సాధించిన వెంకటేష్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైంది అన్నారు.




## పల్నాడు జిల్లా నూతన అదనపు ఎస్పీ(అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించిన రోహిత్ కుమార్ చౌదరి

నరసరావుపేట క్రైమ్, జూలై 11 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం, నరసరావుపేట నందు అదనపు ఎస్పీ (అడ్మిన్) గా రోహిత్ కుమార్ చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు వేగంగా న్యాయం అందించే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. 2022 బ్యాచ్ కు చెందిన రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ (గ్రేహౌండ్స్) నందు, తాడిపర్తి నందు అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీపై పల్నాడు జిల్లాకు రావడం జరిగింది. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి తెలిపారు.



## సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఆర్డీఓ బాలకృష్ణ

నరసరావుపేట టౌన్, జూలై 11 ప్రభాతవార్త : నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న సర్ ప్రత్యేక కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి బాలకృష్ణ శనివారం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పురపాలక సంఘ పరిధిలోని 160,161, 162, 168,169, 171, 172,173, 136, 137,138 పోలింగ్ స్టేషను పరిశీలించారు. అదేవిధంగా మండల పరిధిలోని కేసానుపల్లి గ్రామంలో, పెట్లూరివారిపాలెం గ్రామంలోనూ, ములకలూరు గ్రామంలోని ఆయా పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ ఫారాల పరిశీలన, ఇంటింటి ధ్రువీకరణ, ఓటర్ల వివరాల నమోదు, తదితరు అంశాలను సమీక్షించారు. పోలింగ్ స్టేషన్లో ఎన్నికల సంఘం ఉద్దేశించిన విధంగా అవసరమైన సమాచారం, ఓటర్ జాబితాలు, దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలని ఆదేశాలిచ్చారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారులు జాబితాను ఇంటింటి ధ్రువీకరణ ద్వారా ఖచ్చితంగా సిద్ధం చేయాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు స్థానం ఇవ్వద్దన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల వివరాలు, చిరునామా మార్పులు, మరణించిన ఓటర్లు వారి వివరాలు పూర్తి ఆధారాలతో నమోదు చేయాలన్నారు. మినిట్స్ ను నిర్దేశిత నమూనాలోసిద్ధం చేసిభద్రపరచాలన్నారు. ప్రజలకు ఓటర్ నమోదు మార్పులు తొలగింపులు, సవరణలకు సంబంధించిన సేవలను పారదర్శకంగా అందించాలన్నారు. 2026 కార్యక్రమంలోని అన్ని చర్యలు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్డీవో, ఓటర్ నమోదు అధికారి బాలకృష్ణ తెలియజేశారు. వారి వెంట రెవిన్యూ ఇతర శాఖల అధికారులు ఉన్నారు.




## విప్పర్ల రెడ్డిపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు దుశ్చర్య.... రెండు గ్రామాలను కుదిపేసిన పొగ..

రొంపిచర్ల, జులై 11 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల రెడ్డిపాలెం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిర్వాకం స్థానికులకు శాపంగా మారింది. గ్రామంలోని చెరువు సమీపంలో ఉన్న వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో, వెలువడిన దట్టమైన పొగ రెండు గ్రామాలను కమ్మేసింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తకు పెట్టిన నిప్పు వల్ల వెలువడిన కాలుష్యంతో గాలి నాణ్యత పూర్తిగా పడిపోయింది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో పాటు, కళ్లలో మంటలు వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఊపిరి ఆడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లోకి కూడా పొగ దట్టంగా రావడంతో నివాసం ఉండలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోయారు.



## జాతీయ లోక్ అదాలత్‌లో 2, 476 కేసుల పరిష్కారం

నరసరావుపేట క్రైమ్, జూలై 11 ప్రభాతవార్త: జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి ఎస్ రమేష్ నేతృత్వంలో న్యాయాధికారులు మూడు బెంచ్ లుగా ఏర్పడి2476 కేసులను పరిష్కరించారు. సివిల్ క్రిమినల్ ముందస్తు వ్యాజ్యాలు తదితర అన్ని రకాల వ్యాజ్యాలు కలిపి2476 కేసులు పరిష్కారం అయ్యాయి. పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు రూ 6,88,78,243 మేరకు లబ్ధి చేకూరింది. తొలుత న్యాయస్థానంలో ఆవరణలో న్యాయవిజ్ఞాన నిర్వహించారు. సదస్సులో న్యాయధికారులు లోకోదాలత్ యొక్క ప్రాధాన్యతను, విశిష్టతను ,ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయధికారులు కిరణ్ కుమార్ ,ఏ సలోమి, న్యాయవాద సంఘ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు , కక్షిదారులు. పోలీసులు పాల్గొన్నారు



## టీడీపీ కార్యాలయంలో ఎస్‌బీఐ తాత్కాలిక సెంటర్ వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే

నరసరావుపేట, జూలై 11 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ విజయవంతం చేసేందుకు నరసరావుపేటలో ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఈ నెల 17న నరసరావుపేటలో నిర్వహించే రుణమేళాకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.1,500 కోట్ల మేర వివిధ వర్గాల లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో నరసరావుపేటలోని గుంటూరు రోడ్డులో గల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీజినల్ మేనేజర్ రవికుమార్ ఆధ్వర్యంలో తాత్కాలిక బ్యాంకు సెంటర్ ను ఏర్పాటు చేశారు. రుణాలు పొందాలనుకునే అర్హులైన రైతులు, స్వయం ఉపాధి దారులు, చిన్న వ్యాపారులు, విద్యార్థులు, హోటల్ నిర్వాహకులు, పశుసంవర్ధక రంగానికి చెందిన వారు తదితరులు తమ దరఖాస్తులను నేరుగా ఎస్‌బీఐ అధికారులకు అందజేయవచ్చని తెలిపారు. దరఖాస్తులను వెంటనే పరిశీలించి, అర్హత ఆధారంగా ఈ నెల 17న జరిగే రుణమేళాలో రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో నిర్వహించే క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ పల్నాడు అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందన్నారు. ప్రజలు బ్యాంకుల చుట్టూ తిరగకుండా బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలోనే తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేసి నాలుగు రోజుల పాటు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో "షైనీ పల్నాడు - వెల్తీ పల్నాడు" అనే భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.



## రుణమేళా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట జులై 11 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న భారీ రుణమేళా ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం పరిశీలించారు. రుణమేళా వేదికగా ఎంపిక చేసిన కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే సందర్శించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలోని సౌకర్యాలు, లబ్ధిదారులకు కల్పించాల్సిన వసతులు, ట్రాఫిక్, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ నెల 17న జరగనున్న రుణమేళాను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు సూచించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, ఉమ్మడి కూటమి నాయకులు క్రాంతి కుమార్ , అంకమ్మ చౌదరి, స్థానికులు పాల్గొన్నారు.



## ఈశ్వర్ కళాశాలలో విద్యార్థులకు 'అబ్రాడ్ ఎడ్యుకేషన్ పై అవేర్‌నెస్ ప్రోగ్రామ్...,

నరసరావుపేట టౌన్, జూలై 11 ప్రభాతవార్త : స్థానిక కేసానుపల్లి లోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నందు 4వ సంవత్సము చదువుతున్న విద్యార్థులకు, ఉన్నత విద్యను విదేశాల్లో అభ్యసించాలనుకునే విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించాలనే ఉద్దేశంతో లియో గ్లోబల్ ఓవర్సీస్ వారి సౌజన్యంతో "అబ్రాడ్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్" నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నాగమల్లేశ్వర రావు తెలియచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ హయ్యర్ ఎడ్యుకేషన్ కొరకు అబ్రాడ్ వెళ్ళే విద్యార్థులకు లండన్, కాన్సాస్, ఎడిన్బర్గ్ వంటి దేశాలలో ఉన్న విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల ప్రక్రియ, కోర్సుల ఎంపిక, స్కాలర్‌షిప్‌లు, విద్యా రుణాలు, వీసా దరఖాస్తు విధానం, పార్ట్‌టైమ్ ఉద్యోగ అవకాశాలు, చదువు పూర్తయిన తర్వాత కెరీర్ అవకాశాలపై సమగ్రంగా వివరించారు. అలాగే విద్యార్థులు విశ్వవిద్యాలయం కోర్సును ఎంపిక చేసుకునే ముందు ర్యాంకింగ్, గుర్తింపు, ఖర్చులు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ షేక్ .కరీమ్ మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ విదేశీ విద్యకు సంబంధించిన తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా ఐఈఎల్ టి ఎస్, టిఓఈఎఫ్ఎల్ , పిటిఈ, జిఆర్ఈ, జిఎంఏటి వంటి ప్రవేశ పరీక్షల ప్రాధాన్యతను వివరించి, ముందస్తు ప్రణాళికతో సిద్ధమైతే విదేశీ విద్య కలను సాకారం చేసుకోవచ్చని విద్యార్థులకు తెలిపారు. విదేశీ విద్యకు అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. విద్యార్థులు అధికారిక నోటిఫికేషన్లను ఎప్పుడు పరిశీలిస్తూ ఉండాలి అని కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా ఇఎస్ టాస్క్‌ఫోర్స్ సిఐగా నాగలక్ష్మికి పదోన్నతి

సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త:ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్, సత్తెనపల్లి నందు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.నాగలక్ష్మి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గా పదోన్నతి పొంది నెల్లూరు జిల్లా ఇఎస్ టాస్క్ ఫోర్స్ సిఐ గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు, సత్తెనపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మరియు సిబ్బంది ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## వ్యాస మహర్షి పురస్కారానికి సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు ఎంపిక

సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త: హిందూ ఉపాధ్యాయ సమితి ప్రతి సంవత్సరం ప్రకటించే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ వ్యాస మహర్షి పురస్కారానికి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి అనంతవరం శ్రీనివాసరావు ఎంపికైనట్టు హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు దేగల మహేష్ తెలిపారు. జాతీయవాద ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి వ్యాస మహర్షి పురస్కారాలు, హిందూ వీరులకు హైందవ శ్రేష్ఠ పురస్కారాల ప్రధానోత్సవం జూలై 26న రాజమహేంద్రవరంలో జరుగుతుందన్నారు. ఆ కార్యక్రమంలో అనంతవరం శ్రీనివాసరావు కి పురస్కారం అందించనున్నట్టు తెలిపారుఈసందర్భంగా ఎస్టీయూ పల్నాడుజిల్లా సీపీఎస్ కన్వీనర్ జెల్ది విజయప్రసాద్, ఎస్టీయూ పల్నాడుజిల్లా అసోసియేట్ అధ్యక్షులు వల్లూరి నాగరాజు, కార్యదర్శి తురకా రాజు, సత్తెనపల్లి మండల ఎస్టీయూ గౌరవ అధ్యక్షులు మోదుగుల అప్పారావు, మండల సీపీఎస్ కన్వీనర్ జి.తులసీదాస్ తదితరులు అభినందనలు తెలియచేశారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితులకు జరిమానా

సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త: సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్లో డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిని స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గోకన్నకొండ చిన్న ఎదుట హాజరు పరచగా డ్రంక్ అండ్ డ్రైవ్ లో ముద్దాయిలు అయిన పల్నాటి నరసింహారావు, బండారు అనిల్, అనపర్తి డేనియల్, కొతారి అశోక్, నామాల గోపి, పొట్లూరి మస్తాన్ అను వారికి ఒక్కొక్కరికి రూ.10,000/ రూపాయలు ఫైన్ విధించడం అయినది. మరియు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసిన ముద్దాయిలు యిద్దరికి మందికి ఒక్కొక్కరికి 500/ రూపాయలు ఫైన్ విధించారు.

## అక్రమ మద్యం అమ్మకాలు, బహిరంగ మద్యపానం నిషేధం : ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్

సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త: ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్, సత్తెనపల్లి ఇన్‌స్పెక్టరు విజయకుమార్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ నేరాలు అయిన గంజాయి , అక్రమ మద్యం



అమ్మకాలు మరియు బహిరంగ మద్యంపానం నిషేధం అని తెలిపినారు. స్టేషన్ పరిధి లో 01.10.2024 నుండి 10.07.2026 వరకు అక్రమ మద్యం షాపులు మరియు అమ్మకముల పై (123) కేసులు నమోదు చేసి, 295.3 లీటర్ల అక్రమ మద్యమును స్వాధీనం చేసుకున్నారు మరియు (105) బహిరంగంగా మద్యపానం చేయు వ్యక్తులపై కేసులు నామోదు చేయటం జరిగినది. ముక్యం గా రాజుపాలెం మండల పరిదిలో (34) అక్రమ మద్యం కేసులు నమోధు చేసి, 74.14 లీటర్ల మధ్యమ్ సీజు చేయటమైనది మరియు 15 బహిరంగ మద్యపానం కేసులు నమోదు చేయటమైనదని తెలిపినారు.ఈ సందర్భం గా ప్రజలు అక్రమ మద్యం అమ్మకములు మరియు మధ్యపానం కు ద్వూర గా ఉండవలెనని తెలిపినారు.

## ఫాదర్ ఫెడ్రిక్ హయ్యర్ 233వ జయంతి



సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త: గుంటూరు ఏఇఎల్ సీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఫాదర్. క్రిస్టియన్ ఫెడ్రిక్ హయ్యర్ 233 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులతో పాటు పాల్గొని నివాళులర్పించారు. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ తదితరులు నివాళులర్పించారు.

## సత్తెనపల్లి జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన..

### భారీగా కేసుల రాజీ పరిష్కారం

సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించి నజాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి న్యాయస్థాన పరిధిలో విశేష స్పందన లభించింది. సత్తెనపల్లి న్యాయస్థానంలోని నాలుగు కోర్టుల్లో నాలుగు ప్రత్యేక బెంచ్లుగా లోక్ అదాలత్ నిర్వహించి పలు సివిల్, బ్యాంకు సంబంధిత కేసులను రాజీమార్గంలో పరిష్కరించారు.ఈ సందర్భంగా సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి. విజయ్ కుమార్ రెడ్డి



మాట్లాడుతూ, " రాజీ మార్గమే రాజమార్గం", "లోక్ అదాలత్లో ఇచ్చే అవార్డు అంతిమ తీర్పుతో సమానం" అని పేర్కొన్నారు. ప్రజలు లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకుని సుదీర్ఘ న్యాయపోరాటాలకు బదులుగా పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించు కోవాలని సూచించారు.జాతీయ లోక్ అదాలత్ నిర్వహణను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా న్యాయమూర్తులు సత్తెనపల్లి న్యాయస్థానంలోని న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ పనితీరును అభినందించారు. అత్యధిక కేసులను పరిష్కరిస్తూ పలుమార్లు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.లోక్ అదాలత్లో మొదటి బెంచ్ కు న్యాయమూర్తిగా వి. విజయ్ కుమార్ రెడ్డి, సభ్యునిగా బి. ఎల్. కోటేశ్వరరావు, రెండో బెంచ్ కు న్యాయమూర్తిగా థౌషీద్ హుస్సేన్, సభ్యునిగా కె. లక్ష్మణ్, మూడో బెంచ్ కు న్యాయమూర్తిగా పి. ప్రియదర్శిని, సభ్యునిగా పి. హరి మణికంఠ, నాలుగో బెంచ్ కు న్యాయమూర్తిగా జె. సుజిన్ కుమార్, సభ్యునిగా గంటా వెంకట శివ వ్యవహరించారు.ఈ లోక్ అదాలత్లో ముఖ్యంగా బ్యాంకు రుణాలకు సంబంధించిన కేసుల పరిష్కారంలో విశేష పురోగతి నమోదైంది. ఎస్బీఐ గుంటూరు జిల్లా రీజినల్ మేనేజర్ కిషోర్ కుమార్ స్వయంగా హాజరై కేసుల పరిష్కార ప్రక్రియలో పాల్గొన్నారు. ఒక కేసులో సుమారు రూ.16 లక్షల బకాయిని రాజీ ద్వారా రూ.5 లక్షలకు పరిష్కరించి, ఆ మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో స్వీకరించి కేసును ముగించడం విశేషంగా నిలిచింది. ఇదే తరహాలో పలు బ్యాంకులు రాజీ పరిష్కారానికి సహకరించి కేసుల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాయి.జాతీయ లోక్ అదాలత్ ద్వారా తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని న్యాయాధికారులు పేర్కొన్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద స్పెషల్ కాంపెయిన్ డే

సత్తెనపల్లి , జూలై 11, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం, సత్తెనపల్లి పట్టణం పరిధిలో పోలింగ్



కేంద్రం సంఖ్య 48,49,50 ల వద్ద స్పెషల్ కాంపెయిన్ డే సందర్భంగా పూర్ పెర్ఫార్మెన్స్ ఉన్నందున ప్రక్రియను నిశితంగా పరిశీలించి, డెత్ లు ఆబ్సెంట్ ఓటర్లు,షిఫ్ట్ ఓటర్లు,డూప్లికేట్ ఓటర్ల విషయము తగు సూచనలు, సలహాలు ,ఇస్తున్న 98సత్తెనపల్లి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి రెవెన్యూ డివిజనల్ అధికారి కె. గోపాలకృష్ణ . 12న మ్యాపింగ్ చేయు నిమిత్తం స్పెషల్ కాంపెయిన్ డేస్ గా ఎలక్షన్ కమిషన్ నిర్ణయించింది. కావున ప్రతి ఓటరు వివరములు డిజిటలైజేషన్ 100 పూర్తి చేయవలసినదిగా తెలియజేసి యున్నారు. లిస్ట్ లు తయారు చేసి, సదరు పోలింగ్ కేంద్రం పరిధిలోని ప్రచురించవలసిందిగా, తీలితి లకు, కూడా లిస్ట్ లు కమ్యూనికేట్ చేయవలసినదిగా తెలియజేసియున్నారు .

## బీఎల్ఓలకు సర్ పై అవగాహన కార్యక్రమం



మాచర్ల రూరల్ ,జూలై 11, ప్రభాతవార్త: గ్రామ సచివాలయంలో మాచర్ల రూరల్ పరిధిలోని కంభంపాడు,రాయవరం,గన్నవరం, తాళ్లపల్లి గ్రామాలలో తహసీల్దార్ కిరణ్ అధ్యక్షతన శనివారం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై అవగాహన సమావేశం నిర్వహించారు.అనంతరం బి. ఎల్. ఓ. లకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,మరియు ఆశ వర్కర్లకు సర్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై సమగ్ర అవగాహన కల్పించారు.

## మాచర్లలో ఓటర్ల వేట ..2002 నాటి మూలాల వెతుకులాట

మాచర్ల టౌన్ ,జూలై 11,ప్రభాతవార్త : మాచర్లలో ఓటర్ల వేట 2002 నాటి మూలాల వెతుకులాటమాచర్ల నియోజకవర్గంలో ఇప్పుడు ఓటర్ల సవరణ ప్రక్రియ ఒక పెద్ద డిటెక్టివ్ ఆపరేషన్‌లా మారింది. ఇంటింటికి వెళ్తున్న అధికారులు కేవలం పేర్ల నమోదుకే పరిమితం కాకుండా, కోడళ్ల ఓటు హక్కు కోసం ఏకంగా 2002 నాటి రికార్డులను తిరగేస్తున్నారు.ఇది ఇప్పుడు స్థానికంగా హాట్ టాపిక్ గా మారింది.2002... ఓటర్ల ఐడి కి ప్రామాణికం.! సాధారణంగా ఓటు మార్పు అంటే ఫామ్



6,7 అని అనుకుంటారు.కానీ, మాచర్లలో పరిస్థితి భిన్నం.తమ ఇంటికి కోడలిగా వచ్చిన మహిళల ఓటు హక్కును నిర్ధారించడానికి,అధికారులు ఏకంగా 2002 నాటి ఓటర్ జాబితాను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు.ఆ కాలంలో వారి తల్లిదండ్రుల ఓటు ఎక్కడ ఉండేది? ఆ ఐడి వివరాలు ఏంటి? అని ఆరా తీస్తున్నారు.పాత ఓటర్ల జాబితాలోని డేటాను, ప్రస్తుత ఆధార్ వివరాలకు లింక్ చేసే పనిలో పడ్డారు.కొత్త చిక్కులు... కనిపించని ఓట్లు..!ఇక్కడే అసలు ఇబ్బంది మొదలైంది. 2002 నాటి రికార్డుల్లో పేరు ఉంటేనే కదా.. దాన్ని ఇప్పుడు వెతికి పట్టుకునేది? చాలామంది మహిళల వివరాలు పాత లిస్టుల్లో దొరక్కపోవడంతో, ఒకవేళ దొరికినా దాన్ని ఇప్పుడున్న ఓటర్ లిస్టులోకి తీసుకురావడానికి అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు.కోడళ్లు తమ పుట్టింటి ఓటు వివరాలను,ఐడి కార్డులను వెతికి తెచ్చేలోపు,బీఎల్ఓల దగ్గర క్యూ లైన్లు కట్టక తప్పడం లేదు.అధికారుల ఉరుకులపరుగులు.. కలెక్టర్ కృతిక శుక్ల పర్యవేక్షణ, మరోవైపు డీఆర్వో అధ్యయ్య నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుండటంతో, మాచర్ల రెవెన్యూ సిబ్బందికి ఏమాత్రం తీరిక దొరకడం లేదు.తహసీల్దార్ కిరణ్ కుమార్,మున్సిపల్ కమిషనర్ వేణుబాబు ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రక్రియ చూస్తుంటే, పాత ఓట్లను వెలికితీసి,కొత్త ఓటర్ల జాబితాను పక్కాగా సిద్ధం చేయాలన్న వారి పట్టుదల అర్థమవుతోంది.లీఫ్ సీజన్.. అయినా పట్టువదలని సిబ్బందిపోలం పనులతో ఊరంతా బిజీగా ఉన్నా, రెవెన్యూ యంత్రాంగం మాత్రం మాచర్ల ఓటర్ల జాబితాలో క్లీన్ స్వీప్ చేసేందుకు నిరంతరం శ్రమిస్తోంది.పాత తరం ఓట్లను,కొత్త తరం ఆధార్‌తో జతచేస్తూ.. ఓటర్ల జాబితాను డిజిటలైజ్ చేయడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ కొనసాగుతోంది.

## ఓటర్ జాబితా సవరణ వేగవంతం చేయండి: ప్రత్యేకాధికారి సలీం బాషా

తెనాలి జులై11(ప్రభాతవార్త): తెనాలి పురపాలక ప్రత్యేకాధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష శనివారం పట్టణంలోని పెరుగు మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తో కలిసి పరిశీలించారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో ఎదురవుతున్న సమస్యల గురించి బిఎల్ఓ లను అడిగి



తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఓటరు జాబితా సవరణపై వెలుబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని బిఎల్ఓ లను ఆదేశించారు. ఈ సందర్భంగా తెనాలి అర్బన్ ప్రత్యేక అధికారి షేక్ సలీం భాష మాట్లాడుతూ, ఓటర్ల నుండి తగు సమాచారాన్ని సకాలంలో సేకరించి ఓటర్ జాబితా సవరణ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాను క్షుణంగా పరిశీలించి అందుకు సంబంధించిన పత్రాలను ఓటర్ల నుండి తీసుకున్న వెంటనే ఆన్లైన్లో పొందుపరచాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఏర్పాటుచేసిన అంగన్వాడి కార్యకర్తలు ,నగర దీపికలు ఇతర సిబ్బంది బిఎల్ఓ లకు సహకరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు శనివారం పట్టణము లోని మారిసు పేట పినపాడు, బాలాజీ రావు పేట, ఐదవ సచివాలయం, ఎన్టీఆర్ సర్కిల్, నందుల పేట, ఐతానగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ శిబిరాలను, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించి సిబ్బంది తో చర్చించారు.ఈ కార్యక్రమలో మున్సిపల్ సిబ్బంది బిఎల్వోలు సూపర్వైజర్లు , బిఎల్ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వెరికోస్ రోగులకు ఉచిత వైద్యశిబిరం

తెనాలి జులై11(ప్రభాతవార్త): రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంటపురం మరియు ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సుశ్రుత ఫౌండేషన్ మరియు ఏషియన్ వాషిక్యులర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో తెనాలి బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా గల ఈ కన్వెన్షన్ నందు 12 జులై 2026 ఆదివారం ఉదయం పది గంటల నుండి



మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉచిత వెరికోస్ వైద్య శిబిరం జరుగును, ఈ శిబిరంలో రక్తనాళాకులలో బుడిపలు, సన్నని నరాలు, కాలి వేళ్లకు నల్లని మచ్చలు, కాళ్లకు పుండ్లు వాపులు కు 5000 రూపాయలు ఖరీదు అయ్యే కలర్ డ్రాపర్ స్క్రీనింగ్ టెస్ట్ ఉచితముగా చేయబడుతుంది. మరియు అవసరమైన వారికి ఉచితముగా ఆపరేషన్లు కూడా చేయబడుతాయి. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గుమ్మడి సరోజ్ బాబు, కార్యదర్శి కొల్లి రాజేంద్రప్రసాద్, ట్రస్ట్ అధ్యక్షులు ఈదర వెంకట పూర్ణ చంద్, కార్యదర్శి ఈదర శ్రీనివాసరావు, చేతన్ రాజ్ కోటారి కార్యదర్శి ఎలెక్ట్ మల్లాది అర్జున్, బత్తుల వెంకటేశ్వరరావు, ఉన్నవ సూర్యనారాయణ , కాకుమాను ఉపేంద్ర, హాస్పిటల్ రిప్రజెంటేటివ్ మధు తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ యాత్ర నుంచి తిరిగి వచ్చిన గంజి రవీంద్రనాథ్ ఘన సత్కారం

మంగళగిరి, జూలై 11, ప్రభాతవార్త: విదేశీ యాత్ర 15 రోజులు పాటు ఆస్ట్రేలియా, బెల్జియం, జెస్ట్ రిపబ్లిక్, ఫ్రాన్స్, హంగ్రీ, లగ్జెంబరింగ్, జర్మనీ, నెదర్లాండ్స్, స్లోవెన్కియా, స్విట్జర్లాండ్, విదేశీ యాత్ర ముగించుకొని తిరిగి ఇండియాకు చేరుకున్న మన మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ



సంఘం కోశాధికారి గంజి రవీంద్రనాథ్ ను మంగళగిరి దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలోని శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి స్వామివార్ల కళ్యాణ మండపం లోని సంఘం ఆఫీసు నందు సంఘం అధ్యక్షులు గుత్తికొండ ధనుంజయరావు, కార్యవర్గ సభ్యులు అందరూ గంజి రవీంద్రనాథ్ ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చింతక్రింది కనకయ్య, సహాయ కార్యదర్శి రామనాథ పూర్ణచంద్రరావు, వంగర లక్ష్మయ్య, బిట్రా భాస్కరరావు, జొన్నాదుల బిక్షారావు, దామర్ల కనక లింగేశ్వరరావు ,శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 14లోగా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించాలి..

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 11, ప్రభాతవార్త : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్2026) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసేందుకు అర్హత కలిగిన ప్రతి ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా స్థానిక బిఎల్వోలకు అందించాలని ఇన్చార్జి తహసీల్దార్ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. సర్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పోలింగ్ బూత్లలో జరుగుతున్న ఎన్యుమరేషన్ పత్రాల అప్లోడ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ..ఈ నెల14తో ఈ ప్రక్రియ ముగియనున్నందున మిగిలిన ఉన్న మూడు రోజులను సద్వినియోగం చేసుకొని ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ప్రస్తుతం మండలంలో 38,293మంది ఓటర్లు నమోదై ఉన్నారన్నారని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత



బలోపేతం చేయాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.దీనిలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి రెండు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఒక ఫారమ్‌ను ఓటరు స్వీకరించినట్లు అక్నాలెడ్జ్ చేయగా, రెండవ ఫారమ్‌ను అవసరమైన వివరాలతో పూరించి తిరిగి బిఎల్ఓలకు అందజేయాల్సి ఉంటుందన్నారు. అందిన ఫారమ్‌లన్నింటిని డిజిటలైజ్ చేసి తుది ఓటరు జాబితా తయారీకి వినియోగిస్తామని తెలిపారు. ఫారమ్‌ను తిరిగి సమర్పించని పక్షంలో సంబంధిత ఓటరు పేరు రాబోయే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌లో నమోదు కాదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు మండలంలో 31,938 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి తిరిగి అందగా వాటిని విజయవంతంగా డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 83.40శాతం అప్లోడ్ చేసినట్లు వివరించారు. అలాగే బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి అలాంటి 280 ఫారమ్‌లను కూడా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మిగిలిన ఫారమ్‌ల సేకరణను వేగవంతం చేసేందుకు ఈరోజు, రేపు మండల వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఓటరు బాధ్యతగా స్పందించి తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను వెంటనే సంబంధిత బిఎల్ఓలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకమైన, సమగ్రతతో కూడిన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఓటరి భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని ఆయన పేర్కొన్నారు. కుర్నూతల, అనంతవరప్పాడు గ్రామాల్లోని పోలింగ్ బూత్లను పరిశీలించారు. కార్యక్రమంలో బిఎల్ఓ లు వీఆర్వో జెట్టి వెంకటేశ్వరరావు, నిర్మల జ్యోతి, సహాయకులు అంగన్వాడీలు పిల్లి భవాని, ఎడ్లూరి విజయలక్ష్మి, ఆశా వర్కర్ దాసరి మహాలక్ష్మి ఉన్నారు.

## జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యం..

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 11, ప్రభాతవార్త : జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యమని కాట్రపాడు, వట్టి చెరుకూరు, ముట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ దివ్యశ్రీ, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శివాని, డాక్టర్ సరిత, డాక్టర్ మానస ప్రియదర్శిని, డాక్టర్ వంశీ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆయా పిహెచ్సి పరిధిలో శనివారం



సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్సీ డాక్టర్లు మాట్లాడుతూ.. జనాభా పెరుగుదల వలన వనరుల కొరత ఏర్పడి ఆర్థికంగా వెనుకబడి పోతామన్నారు. అధిక జనాభాతో పేదరికం, అవిద్య, అనారోగ్యం, పౌష్టికాహార లోపం, మౌలిక వసతుల లేమి వంటి అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని చెప్పారు. బాధ్యత గల ప్రతి ఒక్కరు కుటుంబాన్ని నియంత్రణను పాటించాలని సూచించారు. పెరుగుతున్న జనాభాతో ముడిపడి ఉన్న సమస్యలు, కుటుంబ నియంత్రణ మరియు సుస్థిరాభివృద్ధిపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ విజయ సుశీల, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం. వెంకటేశ్వరరావు, హెచ్వి ఎంవి. రత్నప్రియ, ఫార్మసిస్ట్ లక్ష్మణ్ కుమార్, వి.జయకుమార్ మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి హామీ



దుర్గి జూలై 11,ప్రభాతవార్త : ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్.ఐ గోపాల్‌దుర్గి లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రజలు సహకరించాలని దుర్గి ఎస్.ఐ గోపాల్ కోరారు. శనివారం సాయంత్రం దుర్గి బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. సెంటర్‌లో ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ పరిస్థితిని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసు స్టేషన్ 9440796242 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

## ఓబులేసునపల్లె గ్రామంలో పర్యటించిన డి.ఆర్.ఓ అడ్డయ్య

దుర్గి, జూలై 11,ప్రభాతవార్త : దుర్గి మండలంలోని ఓబులేసున పల్లె గ్రామంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ పనులను డి.ఆర్.ఓ కే. అడ్డయ్య పరిశీలించారు. డి.ఆర్.ఓ అడ్డయ్య ఇంటింటి సర్వే, ఓటరు జాబితా నమోదు, కొత్త ఓటర్ల చేరిక, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బి.ఎల్.ఓలు తమకు అర్థంకాని



సందేహాలు, సాంకేతిక అంశాలపై డి.ఆర్.ఓ ను అడిగి తెలుసుకున్నారు. అధికారులు అడిగిన ప్రతి సందేహానికి డి.ఆర్.ఓ అడ్డయ్య సవివరంగా సమాధానాలు ఇచ్చి, పనులు ఎలా చేయాలో దిశానిర్దేశం చేశారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దుర్గి తాసిల్దార్ వరకుమార్ రెవెన్యూ అధికారులు, బి.ఎల్.ఓలు, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

మాచర్ల టౌన్ , జూలై 11, ప్రభాతవార్త: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మాచర్ల పట్టణంలోని రోప్ లైన్ కాలనీలోని 8వ వార్డులో"డ్రగ్స్ వద్దు బ్రో"అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ సీఐ షేక్ నజీర్ బేగ్ మాట్లాడుతూ..డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల యువత జీవితాలు నాశనం



అవుతున్నాయని,మాదక ద్రవ్యాల వినియోగం కుటుంబాలు,సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి,మంచి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు.ఎస్సై వెంకటరమణ మాట్లాడుతూ.. డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని, ఎవరైనా మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ప్రజల సహకారంతోనే డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ సందర్భంగా కత్తి స్వర్ణలత,పోలీస్ సిబ్బంది కాలనీ వాసులతో మాట్లాడి డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య,సామాజిక సమస్యలను వివరించారు.ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## తల్లిని చంపి తండ్రి జైలుకి: దిక్కుతోచని స్థితిలో చిన్నారులు.

తెనాలి మున్సిపాలిటీ జులై11(ప్రభాతవార్త): అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త జైలుకి



వెళితే, దిక్కులేక ఆచిన్నారులు బంధువుల పంచన చేరాల్సిన దుస్థితి నెలకొంది. తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో, భార్యపై అనుమానంతో, శుక్రవారం మన్నే నరేంద్రబాబు తన భార్య సంధ్యారాణితో గొడవపడి విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి నరికి హత్య చేసాడు.వీరికి పది సంవత్సరాలు ఉన్న ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రుల గొడవతో ఇద్దరు చిన్నారులు అనాధలు అయ్యారని,పెద్దల క్షణికావేశం పిల్లల భవిష్యత్ ను అంధకారం లోకి నెట్టేసిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డిఓ శ్రీరమణి

తెనాలి జులై11(ప్రభాతవార్త): తెనాలి రెవిన్యూ సబ్ డివిజనల్ అధికారిణి శ్రీరమణి శనివారం కొత్తపేట సచివాలయంలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తో కలిసి పరిశీలించారు. ఓటర్ సవరణ ప్రక్రియ గురించి బిఎల్వో లతో మాట్లాడారు.ఓటర్ జాబితా సవరణను వేగవంతం చేయాలని సూచించారు.ప్రభుత్వం నియమించిన గడువు ముగుస్తున్నందున త్వరితగతిన ఓటర్ల నుండి సమాచ్చార సేకరించి జాబితా వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని ఆదేశించారు.



## ఓటు హక్కును ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలి


మంగళగిరి, జూలై 11, ప్రభాతవార్త: భారత ఎన్నికల సంఘం గత నెల 15వ తేదీ చేపట్టిన ఎస్ ఐ ఆర్ సర్వే ఈనెల 14వ తేదీతో ముగియనుండటంతో మంగళగిరి ప్రాంతంలోని ఓటర్లకు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు మంగళగిరి పట్టణంలోని కొన్ని సచివాలయాల్లోని బిఈఎల్ఓ బి ఎల్ ఏ లను కలిసి రిజిస్ట్రేషన్ అవుతున్న విధానాన్ని అడిగి తెలుగు తీసుకున్నారు. ఈ విషయమై కొప్పురావు కాలనీలోని 11వ సచివాలయ పరిధిలో ఓటరు



రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికే దాదాపు 80 ఓటర్లు సర్వేలో తమ రిజిస్ట్రేషన్ ను చేసుకున్నారని కొంతమంది ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి, ఒక కాలనీ నుంచి మరొక కాలనీకి మారినటువంటి కుటుంబాల సభ్యులు వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో నిర్లక్ష్య ధోరణి వహించటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అనేకసార్లు బిఎల్వోలు ఫోన్లు చేసి మాట్లాడిన స్పందించకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కు ఇంకా మరో రెండు రోజులే వ్యవధి ఉన్న దృష్ట్యా ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతగా గుర్తించి వెంటనే వచ్చి సంబంధిత సచివాలయంలో బిఎల్ఓ లను కలిసి తమ ఓటు హక్కు నిలబెట్టుకునేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బట్టు సదానంద శాస్త్రి, జంజనం వెంకట సుబ్బారావు, వంగర లక్ష్మయ్య, తిరువేదుల సతీష్, బిట్ర దుర్గారావు, మాచర్ల శ్రీనివాసరావు, నాగులపల్లి శ్రీనివాసరావు, తాటిచెర్ల వీరన్న తదితరులు పాల్గొన్నారు

## పేద ఆర్యవైశ్య కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ

మంగళగిరి, జూలై 11, ప్రభాతవార్త: మంగళగిరిలోని వాసవి వనిత క్లబ్ కార్యాలయంలో రాజ్యలక్ష్మి అవోప, వామ్, వాసవి క్లబ్ వనిత, రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం పేద ఆర్యవైశ్య కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కోఆర్డినేటర్ శ్రీమతి గాదంశెట్టి సుజాత చేతుల మీదగా పేద ఆర్యవైశ్య మహిళలకు సరుకుల కిట్ల పంపిణీ చేశారు. అనంతరం శ్రీమతి సుజాత మాట్లాడారు. దాత సుజాత తన కుమారుని పుట్టినరోజు సందర్భంగా పేద మహిళలకు



నిత్యవసర సరుకులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంట జరిగే శుభకార్యాల సందర్భంలో సమాజంలో పేదలకు ఎంతోకొంత సాయం అందించడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో దాత చీదెళ్ల సుజత తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణపై, సందేహాలను నివృత్తి చేసిన కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ జులై11(ప్రభాతవార్త): మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు శనివారం పట్టణం లోని 33 వార్డు బాలాజీరావు పేట లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ సవరణ(స్పెషల్ క్యాంపింగ్ )కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచన చేశారు.ఓటర్ జాబితా సవరణపై స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. నిబంధన ప్రకారం ఓటర్ జాబితా సవరణను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణము నందు ఏర్పాటుచేసిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ శిబిరాన్ని సందర్శించి సిబ్బందితో చర్చించారు. ఓటర్లు తీసుకువచ్చిన పత్రాలను పరిశీలించి జాబితా సవరణ ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఆన్లైన్ ప్రక్రియను మరియు డెర్త్,షిఫ్ట్, డబల్ ఎంట్రీ లను వేగవంతం చేసి త్వరితగతిన జాబితా సవరణను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమ లో మున్సిపల్ సిబ్బంది బిఎల్వోలు సూపర్వైజర్లు, బిల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

12 -7Pg9th cheli_12 -7Pg9th cheli.qxd 12/Jul/26 1:04 AM Page 1



# కీమా రుచులు

మటన్ ముక్కలో సింగిల్ ఎముక లేకుండా కీమా కొట్టడం అంటే మామూలు ముచ్చట కాదు. అంతపద్ధతిగా కొట్టిన కీమా..చేయి తిరిగిన వంటవాడి చేతిలో పెడితే.. ఎలా ఉంటుంది చెప్పండి? మసాలా దట్టించుకొని.. నూనెలో మునిగి.. కూరలో తేలి..బిర్యానీలో కుదిరి.. పళ్లెంలోకి వచ్చేస్తుంది. ముదముద్దనూ ఆస్వాదిస్తూ లాగించేయడమే మన పని. కాదంటారా! అయితే వెరైటీలు చేసి చూడండి. కీమా కథ క్లైమాక్స్‌లో ఆహా, ఓహోలు తప్ప మరే మాటలూ వినిపించవు !



## కార్జం-కీమా ..

**కావాల్సినవి :** కీమా-300గ్రా, నూనె-నాలుగు చెంచాలు, ఉల్లిపాయ-ఒకటి, అల్లం-రెండు అంగుళాల ముక్క, వెల్లుల్లి రెబ్బలు-పది, టమాటా గుజ్జు - నాలుగు చెంచాలు, పసుపు- అరచెంచా, కారం- అరచెంచా, ధనియాలపొడి-రెండు చెంచాలు, గరంమసాలా పొడి- అరచెంచా, ఉప్పు-రుచికి తగినంత, కార్జం-200 గ్రా, కొత్తిమీర కొద్దిగా.

**తయారీ :** ఒక కడాయిలో నూనె పోసి వేడిచేసుకోవాలి. తరిగిన ఉల్లిముక్కలని నూనెలోవేసి గోధుమరంగులోకి వచ్చేంత వరకూ వేయించుకోవాలి. మిక్సీలో అల్లం,వెల్లుల్లి రెబ్బలువేసి మెత్తగా మిక్సీ పుట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేగిన ఉల్లిపాయముక్కల్లో వేసి మూడు నిమిషాలపాటు వేయించుకోవాలి. ఆ తర్వాత టమాటా గుజ్జు కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించు కోవాలి. ఇప్పుడు పసుపు, కారం, ధనియాల పొడి, గరంమసాల పొడి,ఉప్పు కూడా వేసుకోవాలి. ఇవన్నీ ఉడుకుతూ నూనెపైకి తేలుతుంది. అప్పుడు కీమా వేసి మూతపెట్టి పావుగంటపాటు ఉడికించు కోవాలి. చివరిగా కార్జం కూడా వేసి మరో పది నిమిషాలపాటు ఉడికించుకుంటే రుచకరమైన కీమాకార్జం సిద్ధమవుతుంది



## కీమా బిర్యానీ...

**కావల్సినవి :** బాస్మతి బియ్యం-350, పెరుగు-3 చెంచాలు, అల్లం పేస్ట్-చెంచా, నెయ్యి-100గ్రా, కుంకుమపువ్వు- చిటికెడు, కారం-చెంచా నిమ్మరసం-చెంచా, కీమా-400 గ్రా, ఉల్లిపాయ-ఒకటి, వెల్లుల్లి పేస్ట్ - చెంచా, పాలు-అరకప్పు, దాల్చినచెక్క-ఒకటి, లవంగాలు- నాలుగు, చికెన్ ఉడికించిన నీళ్లు- కప్పు, ఉప్పు-తగినంత.

**తయారీ:** ముందుగా బాస్మతి బియ్యాన్ని ఉప్పు వేసిన నీళ్లలో పలుకుగా ఉడికించి వార్చి పక్కన పెట్టుకోవాలి. పాలల్లో కుంకుమపువ్వు కలిపి పక్కనపెట్టుకోవాలి. కడాయిలో నెయ్యి వేడి చేసుకుని అందులో ఉల్లిపాయ ముక్కలు ముదురు గోధుమరంగులోకి వచ్చేంతవరకూ వేయించుకోవాలి. ఇందులోనే దాల్చినచెక్క, లవంగాలు వేసి వాటి పరిమళం బయటకు వచ్చేంతవరకూ ఉండాలి. ఇందులోనే కీమా వేసి గరిటెతో కలియతిప్పి.. అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించి ఉప్పు కలుపుకోవాలి. కీమా పూర్తిగా వేగిన తర్వాత.. పెరుగు, కారం వేసి తక్కువ మంట మీద మగ్గించుకుని పక్కన పెట్టుఓవాలి. కుక్కర్ కానీ, మూత ఉన్న మందపాటి పాత్రను కానీ తీసుకుని ముందుగా పలుకుగా ఉడికించిన అన్నాన్ని ఒక పొరలా వేసుకోవాలి. దానిపై ఉడికించిన కీమాని వేసుకోవాలి. ఆపైన కుంకుమపువ్వు కలిపిన పాలను సగం పోసుకుని, ఆపై కొద్దిగా నిమ్మరసం వేసుకోవాలి. ఇదే పద్ధతిలో మళ్లీ పలుకుగా ఉడికించిన అన్నం, కీమా, పాలు వేసి చివరిగా తగినంత చికెన్ ఉడికించిన నీళ్లు పోసుకోవాలి. ఆవిరి బయటకు పోకుండా మూతపెట్టేసి తక్కువమంట మీద పదిహేను నిమిషాల పాటు ఉడికించుకుని దింపుకోవాలి. కుక్కర్‌ని నేరుగా మంట మీద పెట్టకుండా ఒక పాన్ పెట్టుకుని దానిమీద పెట్టుకుంటే అడుగు మాడకుండా బిర్యాని చక్కగా పొడిపొడిగా వస్తుంది.

## తవా కీమా...

**కావాల్సినవి :** కీమా-పావుకేజీ, ఉల్లిపాయ-ఒకటి, టమాటాలు-రెండు, కసూరీమేథీ- అరచెంచా, కారం-చెంచా, పసుపు- పావుచెంచా, అల్లంవెల్లుల్లి పేస్ట్- చెంచా, సన్నగా తరిగిన అల్లం-చెంచా, పచ్చిమిర్చి-రెండు, జీలకర్ర-చెంచా, ఉప్పు తగినంత, గరంమసాలా- అరచెంచా, నూనె-. నాలుగు చెంచాలు.



**తయారీ:** పెనంగానీ, వెడల్పుగా, మందంగా ఉండే పాన్‌గానీ తీసుకుని అందులో రెండు పెద్ద చెంచాల నూనె పోసుకోవాలి. అది వేడెక్కిన తర్వాత అల్లం వెల్లులి పేస్ట్ వేసి అది పూర్తిగా వేగిన తర్వాత కీమా కూడా వేసి రంగు మారేంతవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత టమాటా ముక్కలు వేసి మూతపెట్టేసి మరో ఐదు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఇప్పుడు ఉప్పు, పసుపు, కారం, కసూరిమేథి, జీలకర్రపొడి, గరంమసాలా పొడి వేసి పూర్తిగా కలిసేంతవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించుకుని తగినన్ని నీళ్లు పోసి సన్నమంట మీద ఉంచి కీమాని పూర్తిగా ఉడికించుకోవాలి. చివరిగా సన్నగా తరిగిన అల్లం ముక్కలు పైన అలంకరించు కుంటే తవా కీమా రెడీ. పావ్ బ్రెడ్‌లకి కొద్దిగా బటర్

### చిట్కా

అర్ధరోగహరి నిద్రాహా:సరైన నిద్ర, మీ వ్యాధుల లో సగం నయం చేస్తుంది. మనిషికి ఆహారం ఎంత ముఖ్యమో, తగినంత నిద్ర కూడా అంతే ముఖ్యం. ఆరోగ్యవంతుడు రోజుకి కనీసం ఆరు గంటలు నిద్రపోవాలి. తిన్న ఆహారం జీర్ణం కావడానికి, శారీరక శ్రమ వల్ల కాళ్ళు, చేతులు, గుండె, మెదడు మొదలైన ముఖ్య అంగాలు అలసట తీరి సక్రమంగా పనిచేయడానికి నిద్ర ఉపకరిస్తుంది. అటువంటి వారికి రోగాలు దరిచేరవు. కనుక మంచి నిద్ర సగం రోగాలను హరించి వేస్తుంది అని ఈ సూక్తికి అర్థం.

# చిరు ప్రాయంలో వ్యక్తిత్వ సూత్రాలు



దేశం ఏదైనా, ప్రేమాప్యాయతలు ఎలాంటివైనా, పిల్లల నడవడికల గురించి ఇప్పుడు తల్లిదండ్రులు ఎంతో ఆందోళన పడుతున్నారు. సోషల్ మీడియా వచ్చాక పిల్లల్ని అదుపులో పెట్టడమే కష్టమౌతోంది. మా రోజుల్లో ఇలా లేదమ్మా! ఇప్పుడే ఈ వికామంతా ! అంటూ పెదవి విరుపులు వినడం కద్దు. ఐనా కానీ వారిని నయానో భయానో దార్లో పెట్టడం కన్నా చిన్ననాటి నుంచీ వ్యక్తిత్వానికి పునాది. ప్రాధాన్యతనిచ్చి చిన్న చిన్న అలవాట్లు ను సరిదిద్దగలిగితే అవే పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని జపాన్ పేరెంటింగ్ చెబుతోంది . ఈ విలువలను రోజూ ఆచరణలో చూపిస్తూ పిల్లలకు అలవాటు చేస్తారు. అందుకే గౌరవం, బాధ్యత, కృతజ్ఞత, క్రమశిక్షణ వంటి లక్షణాలు వారి వ్యక్తిత్వం లో భాగమైపోతాయి. మంచి మనుషులను తీర్చిదిద్దాలంటే ఖరీదైన పాఠశాలలు, సాంకేతిక పరికరాలు అవసరం లేదని.. సరైన విలువలు, మంచి అలవాట్లు నేర్పిస్తే చాలని జపాన్ పేరెంటింగ్ ప్రపంచానికి చెబుతోంది. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల కన్నా ఏ ఇతర దేశ ఆచార వ్యవహారాలూ గొప్పవి కాదు. కానీ ప్రాశ్చాత్య సంస్కృతి ప్రభావం పిల్లలపై ఎక్కువగా ఉంది. అందుకే ఎవరి జాగ్రత్తలో వారుండాలి. పిల్లలు బాగా చదివి మంచి ఉద్యోగం సాధించాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. కానీ మార్కులు, ర్యాంకులే జీవిత విజయాన్ని నిర్ణయించవని జపాన్ తల్లిదండ్రులు నమ్ముతారు. పిల్లలు మంచి మనుషులుగా ఎదగాలంటే చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు, విలువలు నేర్పాలని భావిస్తారు. పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇవ్వకుండా.. రోజువారీ జీవితంలోనే వాటిని అలవాటు చేస్తారు. అందుకే జపాన్ పేరెంటింగ్ విధానం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.. హోదా, వృత్తిని బట్టి కాకుండా ప్రతి మనిషిని మర్యాదగా చూడాలనే భావన చిన్నప్పటి నుంచే అలవాటు చేస్తారు. దీంతో ఇతరుల పట్ల గౌరవం, వినయం పిల్లల్లో సహజంగా పెరుగుతాయి.భోజనం ముందు, దైవానికి కృతజ్ఞత చెప్పే విషయంలో మనకూ ఓ మంచి సంప్రదాయం. ఉంది. వారూ అలాంటి సంప్రదాయాన్నే పాటిస్తారు. ఆడుకున్న తర్వాత బొమ్మలు సర్దుకోవడం, గదిని శుభ్రం చేసుకోవడం, ఉపయోగించిన వస్తువులను తిరిగి వాటి స్థానంలో పెట్టడం వంటి పనులు పిల్లలే చేయాలని ప్రోత్సహిస్తారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులే తమ తరగతి గదులను శుభ్రం చేస్తారు. దీంతో బాధ్యత, స్వీయ క్రమశిక్షణ పెరుగుతాయి.బ్యాగ్, పుస్తకాలు, చెప్పులు, బొమ్మలు.. ఏ వస్తువైనా జాగ్రత్తగా ఉపయోగించడం నేర్పిస్తారు. కొత్తవి కొనివ్వాలని అడగడం కంటే ఉన్నవాటిని సంరక్షి ఒచ డం ముఖ్యం అని తెలియజేస్తారు. దీంతో వస్తువుల విలువ అర్థమవు తుంది. సమయానికి చేరుకోవడం అంటే ఎదుటివారి సమయాన్ని గౌరవించినట్టేనని జపాన్‌లో భావిస్తారు. అందుకే స్కూల్, క్లాస్, సమావేశం.. ఎక్కడికైనా సమయానికి వెళ్లే అలవాటు చిన్నప్పటి నుంచే పెంచుతారు. ఇది జీవితాంతం క్రమశిక్షణగా మారుతుంది. క్యూలో ఓపికగా నిలబడటం, పబ్లిక్ ప్రదేశాల్లో మర్యాదగా ఉండటం వంటి అలవాట్లు సానుభూతి, సామాజిక బాధ్యతను పెంచు తాయి. ఆహారం విలువ, సహజ వనరుల ప్రాముఖ్యత పిల్లలకు అర్థ మవుతుంది. విద్య అంటే పాఠశాలకే పరిమితం కాదని జపాన్ తల్లి దండ్రులు యోచన. పుస్తకాలు చదవడం, కొత్త విషయాలు తెలుసుకోవడం, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం జీవితాంతం కొనసాగాలని ప్రోత్సహిస్తారు. దీంతో పిల్లల్లో జిజ్ఞాస, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. బస్సులు, రైళ్లు, లైబ్రరీలు, క్యూల్లో బిగ్గరగా మాట్లాడ కుండా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉండటంమంటే జపాన్ ప్రజలకు పవిత్రత కార్యంగా భావిస్తారు. □

అంతర్వాణి

# మనకన్నీ దేవుడే ఇచ్చాడు కదా..!

ఒకరోజు సొలొమోను అనే ఇశ్రాయేలీయుల రాజు వద్దకు ఇద్దరు వేశ్యలు వచ్చారు. వారిలో ఒక స్త్రీ రాజుతో ఇలా మనవి చేసింది. 'రాజా..నా యేలినవాడా! నేను ఈ స్త్రీ మేమిద్దరం ఒకే ఇంట్లో ఉంటాం. మూడురోజుల తేడాతో మేం పిల్లల్ని కన్నాం. మేం తప్ప ఇంట్లో ఎవరూ ఉండరు. అయితే రాత్రివేళ ఈ స్త్రీ నిద్రలో తన పిల్లపై పడగా ఆ బిడ్డ చనిపోయింది. మధ్యరాత్రివే ఆమె వచ్చి, బతికి ఉన్న నాబిడ్డను తనవద్ద పెట్టుకుని, మృతి చెందిన తన బిడ్డను నా పక్కన పడుకోబెట్టింది. ఉదయం నేను పాలు ఇచ్చేందుకు చూడగా అది చనిపోయింది. నిదానించి బిడ్డను పరిశీలిస్తే ఆ బిడ్డ నాది కాదు. అయితే బతికి ఉన్న బిడ్డ అని చెప్పింది. రెండవ స్త్రీ కాదు బతికి ఉన్న బిడ్డ నాది, చచ్చిన బిడ్డ ఆమెదే అని చెప్పింది. ఇలా ఇద్దరు బతికి ఉన్నది నాది అంటే నాది అని గొడవకు దిగారు. సొలొమోను రాజు మహాజ్ఞాని కాబట్టి వెంటనే ఒక పెద్ద కత్తి తెమ్మని, తమసేవకుడికి చెప్పాడు. అతడు కత్తి తెచ్చిన తర్వాత రాజు ' ఆ కత్తితో బతికి ఉన్న బిడ్డను రెండు ముక్కలుగా చేసి, చెరి సగం ఇవ్వమని' చెప్పాడు. సేవకుడు ఆ ప్రయత్నం చేసేందుకు కత్తి ఎత్తగా.. బతికి వున్న నిజమైన తల్లి కడుపులో పేగులు తరుగు కొనిపోయినదై 'రాజా! బిడ్డను మాత్రం చంపవద్దు, ఆమెకే ఇవ్వండి' అని మనవి చేసింది. రెండవ స్త్రీ మాత్రం కాదు అది నాదైననుదాని దైనను కాకుండా చెరిసగము చేయమని కోరింది. వెంటనే రాజు తల్లిని ఎంతవ మాత్రం చంపవద్దని చెప్పిన స్త్రీకే ఆ బిడ్డను ఇవ్వ..ఆమె నిజమైన తల్లి అని తీర్పు చెప్పాడు. తన బిడ్డ మరణించింది కాబట్టి, తనతోటి స్త్రీ బిడ్డ కూడా చనిపోవాలని రెండస్త్రీ ఆశించింది. కానీ నిజమైన తల్లి మాత్రం బిడ్డ ప్రాణంతో ఉంటే చాలు.. తన వద్ద లేక పోయినా పర్వాలేదని భావించింది.దేవుడు ఇంతటి జ్ఞానం సొలొమోనుకు రాజు ఇచ్చాడు. ఆ తెలివితేటలతో ఎన్నో కీర్తనలు, సామెతలను రాశాడు. కానీ వృద్ధాప్యంలో మాత్రం చాలామంది స్త్రీలను వివాహం చేసుకుని, దేవుడికి వ్యతిరేకంగా పాపంలో జీవిస్తూ, మరణింస్తారు. సొంత తెలివి తేటలతో దేవుడిని సేవించలేం. మనకు ఏదైతే ఉందో అదంతా దేవుడు ఇచ్చిన కృపగా, బహుమానంగా భావించాలి. జ్ఞానముగలవానికి ఉపదేశము చేయగా వాడు మరింత జ్ఞానము నొందును (సామెతలు 9:9). ఆస్తిపాస్తులు, తెలివితేటలు, హోదా, ఆరోగ్యం, అంతస్తులు ఏవైనా సరే ఇవన్నీ దేవుడు తన దయతో మనకు ఇచ్చాడు అనే భావనతో మిక్కిలి వినయంతోప్రభువును సేవించాలి. ఆ జ్ఞానం పరలోకానికి చేర్చేలా ఉండాలి.

**- పి.వాణిపుష్ప**

# తెర

## 'ఓ.! సుకుమారి' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. : నిర్మాత మహేశ్వర్ రెడ్డి



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఓ.! సుకుమారి'తో అలరించబోతున్నారు.

**'ఓ..! సుకుమారి' ఎలా ఉండబోతోంది?**

ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఎమోషన్, కామెడీ, వినోదం అన్నీ సమపాళ్లలో ఉంటాయి. సినిమా చాలా బాగా వచ్చింది.

**ఈ సినిమా ఎలా మొదలైంది?**

మా డీవోపీ దర్శకుడు భరత్ దర్శన్‌ను పరిచయం చేశారు. ఆయన కథ చెప్పారు. కథ చాలా నచ్చింది. దాదాపు ఏడాది పాటు స్క్రిప్ట్‌పై వర్క్ చేసిన తర్వాత సినిమా ప్రారంభించాం.

**ఈ కథలో మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?**

ఈ సినిమాలో ఒక యూనిక్ పాయింట్ ఉంది.'షాక్ కొట్టడం' అనే కాన్సెప్ట్ చుట్టూ వచ్చే వినోదం, భావోద్వేగాలు చాలా కొత్తగా ఉంటాయి. ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తాయి.

**తిరువీర్, ఐశ్వర్య రాజేష్‌లను ఎంపిక చేయాలనే ఆలోచన ఎవరిది?**

కథకు తిరువీర్, ఐశ్వర్య రాజేష్ అయితే బాగా సరిపోతారని అనిపించింది. ఐశ్వర్య రాజేష్ కోసం దాదాపు మూడు నెలలు వెయిట్ చేశాం. ఆమె ఒకే చెప్పిన తర్వాతే షూటింగ్ ప్రారంభించాం.

**సినిమా గురించి ప్రేక్షకులకు ఏమి చెబుతారు?**

ప్రేక్షకులు టికెట్‌కు పెట్టిన ప్రతి రూపాయికి పూర్తి స్థాయి వినోదం పొందుతారు. ఇది ప్రతి కుటుంబం కలిసి చూసే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.

**ఈ సినిమాను థియేటర్లను దృష్టిలో పెట్టుకునే తీశారా?**

అవును. నేను మొదట నుంచి డిస్ట్రిబ్యూటర్‌ని. అందుకే థియేటర్ ఎక్స్‌పీరియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను రూపొందించాం.

**పాన్ ఇండియా రిలీజ్ చేయడానికి కారణం ఏమిటి?**

తిరువీర్‌కు తెలుగులో మంచి గుర్తింపు ఉంది. ఐశ్వర్య రాజేష్ కోసం తమిళంలో కూడా రిలీజ్ చేస్తున్నాం.

**అనుకున్న బడ్జెట్‌లోనే సినిమా పూర్తి చేశారా?**

నేనే అనుకున్న దానికంటే ఎక్కువ ఖర్చు చేశాను. ఈ రోజుల్లో ప్రేక్షకులు ప్రతి రూపాయికి విలువ కోరుకుంటున్నారు. ఖచ్చితంగా విజయం సాధిస్తుంది.

## 'లెనిన్' సక్సెస్ మీట్‌లోనాగార్జున



లెనిన్‌ను ఆదరిస్తోన్న తెలుగు ప్రేక్షకులకు థాంక్స్.. సక్సెస్ మీట్‌లో అఖిల్ అక్కినేని.. అఖిల్ హిట్టు కొట్టాడు అని అందరూ అంటుంటే ఆనందంగా ఉంది..'లెనిన్' సక్సెస్ మీట్‌లో నిర్మాత సూర్య దేవర నాగవంశీ.. అఖిల్ అక్కినేని హీరోగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం'లెనిన్. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదలై బ్లాక్ బస్టర్ టాక్‌తో సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ..నిర్మాత కింగ్ నాగార్జున మాట్లాడుతూ అన్నమయ్య చేశాక నేను దేవుడ్ని ఏదీ అడిగింది లేదు. కానీ తిరుపతిలో ఈవెంట్ అయ్యాక.. స్వామిని దర్శించుకున్నప్పుడు మాత్రం మా వాడికి ఓ హిట్టు ఇవ్వండని అడిగాను. భాగ్యశ్రీ కూడా అదే కోరుకుందని తర్వాత నాకు తెలిసింది. ముందుగా ఆ వెంకటేశ్వర స్వామికి కృతజ్ఞతలు. లెనిన్‌కి వాయిస్ ఇచ్చిన నా పెద్ద అబ్బాయి తారక్‌కి థాంక్స్. ఏడాదిన్నర క్రితం తండేల్ సక్సెస్ మీట్‌కి వచ్చాం. ఇప్పుడు ఇలా లెనిన్ సక్సెస్‌కి వచ్చాను. ఇద్దరూ నా రెండు కళ్లలాంటి వాళ్లు. లెనిన్ టీంని చూస్తే అసూయగా ఉంది. అందరూ ఎంతో ఇష్టపడి కష్టపడి చేశారు."శివ,"నిన్నే పెళ్లాడుతా, అన్నమయ్య సినిమాలు కూడా ఇలానే అందరం కలిసి చేశాం. ఈ మధ్య నాకు మళ్లీ ఇలాంటి అనుభవం కలగడం లేదు."లెనిన్‌కి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అని అన్నారు..హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ లెనిన్ ఓ డిఫరెంట్ మూవీ అని మాకు తెలుసు. కమర్షియల్‌గా ఎలాంటి నంబర్స్ వస్తాయో అని అనుకున్నాను. కానీ మా లెనిన్ చిత్రానికి ప్రేక్షకులు గొప్ప విజయాన్ని అందించారు.

## 'శ్రీనివాస మంగాపురం'తో తెలుగులో పరిచయం కావడం నా అదృష్టం. : రాషా తడానీ



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. .

**'శ్రీనివాస మంగాపురం' కథను ఎప్పుడు విన్నారు?**

గత ఏడాది జూలైలో ఈ కథ విన్నాను. దర్శకుడు అజయ్ భూపతి గారు కథ చెప్పిన విధానం, పాత్రలను, అందులోని ప్రేమ, ఎమోషన్‌ను తీర్చిదిద్దిన తీరు నాకు ఎంతగానో నచ్చాయి.

**మీ క్యారెక్టర్ ఇందులో ఎలా ఉండబోతుంది?**

నా పాత్రకు రెండు షేడ్స్ ఉంటాయి. ఒకవైపు చాలా బబ్లీగా, ఎక్సైటెడ్‌గా ఉంటుంది. మరోవైపు చాలా పద్ధతిగా, హుందాగా ఉండే అమ్మాయిగా కనిపిస్తుంది. నాకు తెలుగు అర్థమవు తుంది. కానీ స్పష్టంగా మాట్లాడలేను. ఈ సినిమా కోసం దర్శకుడు అజయ్ భూపతి ప్రతి డైలాగ్, అందులోని ఎమోషన్‌ను దగ్గరుండి నేర్పించారు. ప్రతి విషయంలో చాలా కేర్ తీసుకున్నారు. మంగా పాత్ర నాకు చాలా దగ్గరగా ఉంటుంది.

**జయకృష్ణ ఘట్టమనేనితో పని చేయడం ఎలా అనిపించింది?**

జయకృష్ణ చాలా స్వీట్ అండ్ కూల్ పర్సన్. సెట్లో చాలా సరదాగా వుంటారు. షూటింగ్ సమయంలో చాలా ఫన్ ఉండేది.

**మోహన్ బాబుతో పని చేయడం ఎలా అనిపించింది?**

మా అమ్మగారు కూడా మోహన్ బాబుతో కలిసి పని చేశారు. ఆయనతో పని చేయడం చాలా ఫన్ ఎక్స్‌పీరియెన్స్. సెట్లో చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడూ జోకులు చెబుతూ ఉంటారు.

**ఇది తెలుగులో మీ మొదటి సినిమా. ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు?**

నాకు తెలుగు తెలియదు. మొదట్లో డైలాగులు అర్థం చేసుకోవడానికి కాస్త కష్టపడ్డాను. కానీ దర్శకుడు అజయ్ భూపతి నాకు చాలా హెల్ప్ చేశారు. తెలుగు, హిందీ కలిపి డైలాగుల అర్థం చెప్పేవారు.

**వైజయంతి మూవీస్ ద్వారా తెలుగులో రావడం ఎలా అనిపించింది?**

వైజయంతి మూవీస్ చాలా ప్రతిష్ఠాత్మకమైన సంస్థ. ఆ సంస్థ నుంచి మహేష్ బాబుతో పాటు ఎంతో మంది స్టార్స్ పరిచయం అయ్యారు. నా జీవితంలో కలిసిన బెస్ట్ పర్సన్‌లలో అశ్వినిదత్ ఒకరు.

## 'సూపర్ హీరో బాబు' ఫస్ట్ లుక్ విడుదల



అర్జున్ దాస్, శాండీ మాస్టర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సూపర్ హీరో బాబు' (తమిళంలో 'సూపర్ హీరో'). ఈ చిత్రాన్ని జాతీయ అవార్డు గ్రహీత నిర్మాత కె.ఎస్. సినిష్ 'సోల్జర్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ' బ్యానర్‌పై సమర్పిస్తుండగా 'రెడాక్టెడ్ స్టూడియోస్'కు చెందిన శంజన్ జి సంయుక్తంగా నిర్మించారు. తెలుగు తమిళ ద్విభాషా చిత్రంగా"సూపర్ హీరో బాబు రాబోతోంది.'బెలూన్‌ఖి చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన కె.ఎస్. సినిష్ డిక్కిలూనా. పార్కింగ్‌తో నిర్మాతగానూ మంచి పేరు సంపాదించుకున్నారు. నిర్మాతగా సినిష్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా కంటెంట్ ఉన్న కథతో 'సూపర్ హీరో'ని నిర్మించారు.అర్జున్ దాస్‌కి తెలుగులో మంచి క్రేజ్ ఉందన్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా ఓజీతో అందరినీ ఆకట్టుకున్నారు. అలాంటి అర్జున్ దాస్ సూపర్ హీరో బాబుచిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. హీరోయిన్ తేజు అశ్విని, అర్జున్ దాస్ సీన్స్ ఈ మూవీకి హైలెట్ కానున్నాయి. ఈ చిత్రంతో విఘ్నేష్ వేణుగోపాల్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఖిబెలూన్‌ఖి సినిమాకి కె.ఎస్. సినీష్ వద్ద సహాయ దర్శకుడిగా విఘ్నేష్ వేణుగోపాల్ పనిచేశారు. సూపర్ హీరో బాబు చిత్రానికి సంగీతాన్ని హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించారు.ఖుషి, హాయ్ నాన్న, ది గర్ల్‌ఫ్రెండ్ వంటి భావోద్వేగభరితమైన చిత్రాలకు హేషమ్ అందించిన సంగీతం ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే.

## ఎంఆర్‌పి 'నీకెంత నాకెంత' ప్రీ రిలీజ్ ఈవెంట్.



ఈ చిత్రంలో నరేష్ అగస్త్య హీరోగా నటించగా, డోనల్ బిష్ట్ కథానాయికగా అలరించనున్నారు. అలాగే వెన్నెల కిషోర్, సుదర్శన్, కసిరెడ్డి రాజ్‌కుమార్, హర్ష వర్ధన్, చైతన్య జొన్నలగడ్డ, పృథ్వీ రాజ్, గగన్ విహారి, నంద గోపాల్, స్నేహా సింగ్ తదితరులు కీలక పాత్రల్లో నటించి సినిమాకు మరింత బలం చేకూర్చారు. శ్రవణ్ జేష్ట నిర్మాతగా, దర్శకుడిగా తెరకెక్కించిన ఈ చిత్రానికి రాకేష్ కొలాంచి సినిమాటోగ్రఫీ అందించగా, అజయ్ అరసాడ సంగీతాన్ని సమ కూర్చారు. మార్థాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. దర్శక నిర్మాత శ్రవణ్ జేష్ట మాట్లాడుతూ:.. మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విచ్చేసి మాకు అండగా నిలిచిన మీడియా మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాను పూర్తి చేయడానికి తమ సమయం, కృషిని అంకితం చేసిన మా నటీనటులు, సాంకేతిక నిపుణులు, మొత్తం చిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు.

.హీరో నరేష్ అగస్త్య మాట్లాడుతూ:.. మా ఎంఆర్‌పి 'నీకెంత నాకెంత' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విచ్చేసి మాకు అండగా నిలిచిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన మా దర్శక నిర్మాత శ్రావణ్ జేస్తాకి ప్రత్యేక కృతజ్ఞతలు. హీరోయిన్ డోనల్ బిష్ట్ మాట్లాడుతూ:.. ఎంఆర్‌పి నీకెంత నాకెంత నా తొలి తెలుగు సినిమా కావడం నాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఈ సినిమాపై వస్తున్న స్పందన చూసి చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది.

## 'వెంకట్రామయ్యగారి తాలుకా' మూడో పాట 'అడుకున్న దిక్కడే' లిరికల్ సాంగ్ విడుదల




కుటుంబ బంధాలు, మానవ సంబంధాల విలువలను హృద్యంగా ఆవిష్కరిస్తూ రూపొందు తున్న వెంకట్రామయ్య గారి తాలుకా ఈ చిత్రం ఈనెల 17 న ప్రేక్షకుల ముందుకి రానుంది. ప్రమోషన్ లో భాగంగా ఈ చిత్రం నుంచి మూడో గీతం ..ఆడుకున్న దిక్కడే.. లిరికల్ సాంగ్‌ను స్టార్ దర్శకుడు వి.వి. వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సినిమా మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షి ంచారు.ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మాట్లాడుతూ, "ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు విడుదల చేసిన ..ఆడుకున్న దిక్కడే.. పాట కూడా ప్రతి ఒక్కరిని హృదయానికి హత్తుకునేలా ఉంటుంది. కథలోని భావోద్వేగాలను ప్రతిబింబించే ఈ గీతం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని తెలిపారు.హీరో దినేష్ కుమార్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న దివిజ ప్రభాకర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల దర్శకత్వం వహిస్తున్నారు. కోమలి క్రియేషన్స్ పతాకంపై కోమలి మహేందర్ తొట్టె సోమేష్ సారిపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కుటుంబ అనుబంధాలు, తల్లిదండ్రుల ప్రేమ,

12-7Pg5_12-7Pg5.qxd 11/Jul/26 11:25 PM Page 1



# భారత్‌లో భారీగా న్యూజిలాండ్ పెట్టుబడులు



## వచ్చే 15 యేళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు హామీ

## 10 ఒప్పందాలు సహా 18 కీలక నిర్ణయాలు

## ఇండోపసిఫిక్ ప్రాంత భద్రతపై ఉభయ ప్రధానుల చర్చలు

## సముద్ర భద్రతలో వ్యూహాత్మక భాగస్వామ్యం

**ఆక్లాండ్,జులై 11:** భారత్, న్యూజిలాండ్ తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్ చేసుకున్నాయి. రాబోయే నాలుగేళ్లలో రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత విస్తరించేందుకు వ్యూహాత్మక భాగస్వామ్య రోడ్‌మ్యాప్ 2030ని ఆవిష్కరించాయి. 2030 నాటికి వస్తువులు, సేవల రంగాల్లో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సుమారు రూ.35 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాయి. రాబోయే 15 యేళ్ల పాటు భారత్‌లో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ హామీ ఇచ్చింది. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న, ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో విస్తృత చర్చలు జరిపారు. ఈ భేటీలో 10 ఒప్పందాలతో సహా మొత్తం 18 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇద్దరు ప్రధానులు ఇండోపసిఫిక్‌ప్రాంత భద్రత, స్థిరత్వంపై విస్తృతంగా చర్చించారు. స్వేచ్ఛా యుతమైన, అందరికీ అందుబాటులో ఉండే, అభివృద్ధి చెందే ఇండోపసిఫిక్ ప్రాంత నిర్మాణానికి కలిసి పనిచేయాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. ప్రతి దేశం సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం, అంతర్జాతీయ నిబంధనల ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయడం అత్యంత అవసరమని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ సముద్ర చట్టాలకు అనుగుణంగా సముద్ర మార్గాల్లో నౌకల రాకపోకలు, విమానాల స్వేచ్ఛాయుత ప్రయాణం నిరంతరంగా కొనసాగాల్సిన అవసరాన్ని ఇరు దేశాలు నొక్కి చెప్పాయి. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందం సూత్రాలను గౌరవించాలని అభిప్రాయపడ్డాయి. ఇండోపసిఫిక్‌లో పెరుగుతున్న వ్యూహాత్మక సవాళ్ల దృష్ట్యా సముద్ర భద్రత రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని భారత్, న్యూజిలాండ్ నిర్ణయించాయి. దీనికోసం ప్రత్యేక మారిటైమ్ సెక్యూరిటీ డైలాగ్ ఏర్పాటు చేయాలని అంగీకరించాయి. ఈ వేదిక ద్వారా సమాచారమార్పిడి, సమన్వయం, సంయుక్త చర్యలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే పరస్పర లాజిస్టిక్ సహకార ఒప్పందం ద్వారా ఇరు దేశాల నౌకాదళాల మధ్య కార్యాచరణ సామర్థం మరింత పెరుగుతుందనిఅధికారులు భావిస్తున్నారు.

**వాణిజ్యానికి కొత్త ఊపు**

ఇటీవల కుదిరిన భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) అమలుకు వేగం తీసుకురావాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ ఒప్పందం త్వరగా అమల్లోకి వచ్చేలా అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రధానులు అంగీకరించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వస్తు, సేవల వాణిజ్యాన్ని 700కోట్ల న్యూజిలాండ్ డాలర్లు, అంటే సుమారు రూ.35 వేల కోట్లకు పెంచే లక్ష్యాన్ని నిర్దేశించుకు న్నారు. పెట్టుబడులు, సాంకేతికత, వ్యవసాయం, విద్య, ఆవిష్కరణలు, సేవల రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు.

**ఐక్యరాజ్యసమితి సంస్కరణలకు మద్దతు**

ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్య సమితిలో సమగ్ర సంస్కరణలు అవసరమని మోడీ, లక్సన్ అభిప్రాయపడ్డారు. అంతర్జా తీయ సంస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయా లంటే ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వాటి నిర్మాణంలో మార్పులు అవసరమని పేర్కొన్నారు.

**కస్టమ్స్, పర్యాటక రంగాల్లో కీలక నిర్ణయాలు**

విశ్వసనీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు కస్టమ్స్ ప్రక్రియలను సరళీకృతం చేసే అథరైజ్డ్ ఎకనామిక్ ఆపరేటర్స్ మ్యూచువల్ రికగ్నిషన్ అరేంజ్‌మెంట్ అమలుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పర్యటక రంగంలో అవగాహన ఒప్పందాన్ని స్వాగతించిన ఇరు దేశాలు, భారత్, న్యూజిలాండ్ మధ్య ప్రత్యక్ష నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు విమానయాన సంస్థలు ముందుకు రావాలని కోరాయి.

**వ్యవసాయం, పాడి పరిశ్రమల్లో సహకారం**

ఉద్యానవనం, అటవీ, పశుసంవర్ధక, పాల ఉత్పత్తి రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించారు. కివీ పండ్లు, యాపిల్స్, తేనె ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నారు. భారత్‌లో కివీ పరిశోధన, ఉత్పత్తి కోసం సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్‌ల ఏర్పాటుకు కూడా సహకరించనుంది న్యూజిలాండ్.

పశుసంవర్ధక, పాడి పరిశ్రమలపై ప్రత్యేక అవగాహన ఒప్పందం కూడా కుదిరింది.

ప్రధాని నరేంద్ర మోడీ మూడు దేశాల విదేశీ పర్యటనలో చివరి దశగా ఆక్లాండ్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో ఇండోపసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.



## నన్ను చంపితే ఇరాన్ పూర్తిగా ధ్వంసమే

### వెయ్యి క్షిపణులను లోడ్‌చేసి పెట్టాం తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

**వాషింగ్టన్, జులై 11:** అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో హెచ్చరిక చేశారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే వెయ్యి క్షిపణులను లోడ్ చేసి పెట్టామని వెల్లడించారు. ఆ వెంటనే వేలాదిగా విరుచుకుపడతాయని, అందుకు సంబంధించి సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్న దానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకుముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్‌పై బాంబుల వర్షంకురిపించాలని సూచనలు జారీచేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. హార్ముజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్‌పై దాడులు చేయడం.. ఆ వెంటనే ఆదేశంపై అమెరికా క్షిపణులవర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధ మేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్‌చేసిన వ్యాఖ్యలనుకూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. 'యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్నిఉల్లంఘిస్తారో..అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగాఉంటాం' అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

## ఇరాన్ అణుకేంద్రాల వద్ద మళ్లీ కార్యకలాపాలు

### పశ్చిమాసియాలో భగ్గుమన్న ఉద్రిక్తతలు

**టెహ్రాన్, జులై 11:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. ఈ సమయంలో ఇరాన్ అణు కేంద్రాల వద్ద మళ్లీ కార్యకలాపాలు మొదలయ్యాయని, ఈ విషయం ఉపగ్రహ చిత్రాల ఆధారంగా తెలిసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇటీవల అమెరికా దాడుల్లో అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటిని పునర్నిర్మించేందుకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఇనిస్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ ఈ చిత్రాలను విశ్లేషించింది. హార్మూజ్‌లో వాణిజ్య నౌకలపై దాడుల నేపథ్యంలో ఇరాన్‌తో డీల్ ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దానికిముందే, జూన్ చివర్లోనే ఇరాన్ ఈ అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మాణ పరికరాలు, వాహనాల కదలికలు, దెబ్బతిన్న నిర్మాణాల్లో మార్పులు వంటివి అణు కేంద్రాల వద్ద కనిపించాయి. దీంతో అణు కార్యకలాపాల పునుద్ధరణ కోసం ఇరాన్ ప్రయత్నాలు ప్రారంభించిందా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే నష్టాన్ని అంచనా వేసేందుకు శిథిలాలను తొలగించే చర్యకూడా అయి ఉండొచ్చని తెలుస్తోంది. స్పష్టంగా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయన్నది మాత్రం తెలియరాలేదు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని, శుద్ధి చేసిన యురేనియాన్ని వారి వద్ద ఉంచుకోకూడదన్న కీలక షరతులతోనే తమ మధ్య ఒప్పందం కుదిరిందని అమెరికా చెబుతోంది. హార్ముజ్‌పై నియంత్రణ కోల్పోతే అణు కార్యక్రమం వంటి కీలకాంశాల్లో అగ్రరాజ్యానికి తలొగ్గాల్సి వస్తుందనే ఆందోళన ఇరాన్‌లో ఉంది. ఈ క్రమంలోనే తన పట్టు నిలపుకొనేందుకు హార్ముజ్‌ను ఇరాన్ ఒక ఆయుధంగా వాడుకోవాలని చూస్తోందని, తన అనుమతి లేకుండా ప్రయాణిస్తోన్న నౌకలపై దాడులు చేస్తోందనే వాదనా ఉంది. తాజా ఘర్షణలకు అదే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మహిళలకు ఓటు హక్కు కల్పించినదేశం న్యూజిలాండ్

### ఆక్లాండ్ సదస్సులో ప్రధాని మోడీ ప్రశంసలు

**ఆక్లాండ్,జులై 11:** మహిళలకు మొట్టమొదట ఓటు హక్కు కల్పించిన దేశం న్యూజిలాండ్ అని నేడు న్యూజిలాండ్ సమాజానికి మహిళలు పెద్ద ఎత్తున సేవలందిస్తున్నారని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. భారతదేశం కూడా మహిళా నేతృత్వ అభివృద్ధి అనే మంత్రంతో మహిళలకు కొత్త అవకాశాల తలుపులు తెరుస్తోంది. న్యూజిలాండ్‌లో వీధులు కూడా భారతీయ నగరాలను గౌరవిస్తాయి. ఎక్కడో ఖండాలా, ఎక్కడో బొంబాయి హిల్స్, ఎక్కడో కోర మండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్ సర్ స్ట్రీట్ ఇలా ఎన్నో పేర్లు ఉన్నాయి. అక్కడ నివసిస్తున్న మీరుకూడా పూర్తిగా ఒక కివీగా మారిపోయారు. నేను ఏ న్యూజిలాండ్ నాయకుడిని కలిసినా, ఆయన మిమ్మల్నందరినీ ప్రశంసిస్తారు. ఆ ప్రశంస మీకే దక్కుతుంది, నేను గర్వంగా తల ఎత్తుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రధాని మోడీ బాల్యాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఒక సాధారణ నేపథ్యం నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగారు. ఆయన లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేయడంలో సహాయపడ్డారు. ఆయన మన కాలంలోని అత్యంత ముఖ్యమైన నాయకులలో ఒకరు, న్యూజిలాండ్‌కు నిజమైన స్నేహితుడని కొనియాడారు.

## బహమాస్‌లో కుప్పకూలిన విమానం



### 10 మంది స్పాట్‌లోనే మృతి, పలువురికి గాయాలు

**నసావు,జులై 11:** కరేబియన్ దేశమైన బహామాస్ దీవుల్లో ఒక ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక చిన్న ప్రైవేట్ విమాన ప్రమాదంలో ఏకంగా 10 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ప్రమాదం నార్త్ ఆండ్రోస్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఇది బహామాస్ రాజధాని నసావుకు పశ్చిమ దిశలో సముద్ర తీరానికి సమీపంలో ఉంటుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక రక్షణ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విమానంలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడినట్లు బహామాస్ ప్రధాన మంత్రి ఫిలిప్ బ్రేవ్ డేవిస్ మొదట ప్రకటించినప్పటికీ ఆ తర్వాతజరిగిన అత్యవసర ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, తీవ్ర గాయాలకారణంగా ఆవ్యక్తికూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు ధృవీకరించారు. మరణించిన వారి వివరాలను అధికారులు ఇంకా అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ తీరని విషాదం దేశమంతా ఎంతో సంతోషంగా పండుగ జరుపుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం ఆ దేశాన్ని తీవ్ర శోకసంద్రంలో ముంచేసింది. ఈ ఘటనపై బహామాస్ ప్రధాన మంత్రి ఫిలిప్ బ్రేవ్ డేవిస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బహామాస్ ప్రజలంతా దేశ 53వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా జరుపుకుంటున్న తరుణంలో ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరమని, ఈ పండుగ రోజు కాస్తా దేశానికి పెద్ద శోకదినంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విమానం రాజధాని నసావులోని ప్రసిద్ధ లిండన్ పిండ్లింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికులతో బయలుదేరింది. ఇది సాన్ ఆండ్రోస్ వైపు వెళ్తుండగా మార్గమధ్యంలోనే అదుపుతప్పి నార్త్ ఆండ్రోస్ సమీపంలో కుప్పకూలిపోయింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక లోపం తలెత్తిందా లేక వాతావరణం అనుకూలించలేదా అనే కోణంలో దర్యాప్తు సంస్థలు ఆధారాలు సేకరిస్తున్నాయి. ఒకే రోజులో రెండు ప్రమాదాలు ఈ ఘోర ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే బహామాస్ ఇంధన, యుటిలిటీస్, ఏవియేషన్ మంత్రిత్వ శాఖ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రమాదానికి గురైన విమాన సంస్థ ఫ్లెమింగో ఎయిర్‌కు చెందిన ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికేట్‌ను ప్రభుత్వం తక్షణమే సస్పెండ్ చేసింది. అంటే ఆ సంస్థకు చెందిన అన్ని విమానాల సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. విమాన ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుగుతున్నందున, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఈ ముందస్తు జాగ్రత్త చర్య తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే కేవలం ఈ ఒక్క ప్రమాదమే కాకుండా, ఫ్లెమింగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన మరో విమానంలో కూడా భద్రతా లోపం తలెత్తడం ఈ సస్పెన్షన్‌కు దారితీసింది.

## ముందుగా వందేమాతరం, తర్వాత జనగణమన

### గీతాలను తప్పక ఆలపించాలి ఆ తర్వాతే రాష్ట్ర గీతం

### స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ,జులై 11:** జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందే మాతరం, రాష్ట్ర గీతాల ఆలాపన విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు ఈ మేరకు ఈ నెల 9న ఆదేశాలు పంపింది. అధికారిక కార్యక్రమాలలో జాతీయ చిహ్నాల గౌరవాన్ని కాపాడటం, ఏకరూపతను పాటించడంకోసం ఈ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులలో ఇప్పటికే ఉన్న ఆదేశాలను పునరుద్ఘాటిస్తూ, కొన్ని కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. జాతీయ గీతం పాడేటప్పుడు లేదా దాని సంగీతం వినిపించినప్పుడు ప్రేక్షకులు తప్పనిసరిగా నిలబడి అటెన్షన్‌లో ఉండాలి. అయితే, వార్తా చిత్రాలు (న్యూస్‌రీల్స్) లేదా డాక్యుమెంటరీల ప్రదర్శన సమయంలో జాతీయ గీతం వస్తే, ప్రదర్శనకు అంతరాయం కలగకుండా ఉండేందుకు నిలబడాల్సిన అవసరం లేదని మినహాయింపు ఇచ్చింది. ఇది ఎప్పటి నుంచో ఉన్న నిబంధన అయినప్పటికీ, దీన్ని మరోసారి గుర్తుచేసింది. అధికారిక కార్యక్రమాల్లో రాష్ట్ర గీతంతో పాటు జాతీయ గేయం, జాతీయ గీతం కూడా ఆలపించాల్సి వస్తే, పాటించాల్సిన క్రమంపై హోంశాఖ స్పష్టతనిచ్చింది. దీని ప్రకారం.. ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమనలను పూర్తిగా ఆలపించాలి. ఈ రెండు పాడడం పూర్తయ్యాక మాత్రమే ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అధికారిక రాష్ట్ర గీతాన్ని పాడాల్సి ఉంటుంది. జాతీయ గౌరవాన్ని కాపాడేందుకే ఈ ప్రాధాన్యత క్రమాన్ని నిర్దేశించినట్లు కేంద్రం పేర్కొంది. విదేశీ ప్రముఖులు, ప్రతినిధులు హాజరయ్యే కార్యక్రమాల విషయంలోనూ ప్రోటోకాల్‌ను హోం శాఖ వివరించింది. గౌరవ వందనం స్వీకరించే విదేశీ అతిథి ఉన్నప్పుడు, మొదట ఆ దేశ జాతీయ గీతాన్ని పూర్తిగా ప్లే చేసి, ఆ తర్వాత భారత జాతీయ గీతాన్ని ప్లే చేయాలి. విదేశీ దౌత్య కార్యాలయాలు నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలకు కూడా ఇదే తరహా నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది.

బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతీయ గేయం హోదాను కలిగి ఉండగా, రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన జాతీయ గీతంగా గుర్తింపు పొందిందని ఈ ఆదేశాల్లో మరోసారి గుర్తుచేశారు. ఈ యేడాది ఫిబ్రవరిలో వందేమాతరం పూర్తి ఆలాపనపై ఇచ్చిన ఆదేశాలకు కొనసాగింపుగా తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జాతీయ గీతం, గేయాలకు సంబంధించిన అధికారిక పాఠాలు, సరైన ఉచ్చారణ, లిపి వంటి వివరాలు తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని హోం శాఖ తెలిపింది. జెండా వందనం వంటి అంశాలలో ప్రజల విచక్షణకే వదిలేస్తున్నామని, సందర్భం లేకుండా విచక్షణారహితంగా జాతీయ గీతాన్ని పాడటం లేదా ప్లే చేయడాన్ని మానుకోవాలని సూచించింది. దేశ సాంస్కృతిక వారసత్వం, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, జాతీయ చిహ్నాల పట్ల గౌరవాన్ని, దేశ ప్రజలలో ఐక్యతను పెంపొందించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.



## జమిలి ఎన్నికలు 2029 నుంచే

### జెపిసి చైర్మన్ జెపి చౌదరి

**న్యూఢిల్లీ, జులై 11:** లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ 2029లో కచ్చితంగా సాకారమవుతుందని పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జెపిసి) చీఫ్, కేంద్ర మాజీ మంత్రి పిపి చౌధరి ఆశాభావం వ్యక్తంచేశారు. ఒక దేశంఒకే ఎన్నిక బిల్లుపై గోవా సిఎం ప్రమోద్ సావంత్, మంత్రి వర్గంతో చర్చల కోసం గోవాలో జెపిసి సమావేశ మైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లా డారు. వివిధ అవకాశాలు, ఆలోచనలపై అధ్యయనం చేస్తున్నామని అన్ని రాజకీయ పార్టీలకు ఆమోదయోగ్యమైన విధానం రూపకల్పనకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఒకేసారి ఎన్నికలకు పార్టీలు, కొందరు సిఎంలు స్వచ్ఛందంగా అంగీ కరిస్తే కొన్నిరాష్ట్రాల ఎన్నికలను ముందుగానే.. అంటే2029లో నిర్వహించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. జమిలి ఎన్నికలను ఎలా నిర్వహిస్తే బాగుంటుంది ఎదురయ్యే సవాళ్లు ఏమిటి వాటిని ఎలా పరిష్కరించాలో గోవా ముఖ్యమంత్రి అభిప్రాయాలు తెలుసుకున్నామనితెలిపారు. జెపిసి ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణా, ఢిల్లీల్లో పర్యటించిందని రాజ్యాంగ నిపుణులు, విద్యావేత్తలు, పౌరసమాజం సంస్థలు తదితరులను కలిసిందనిచెప్పారు. తదుపరి లోక్‌సభ ఎన్నికలుజరిగే 2029నాటికి ఒక దేశం ఒకే ఎన్నిక కార్యరూపం దాలుస్తుందన్న సంకేతాలు అందుతున్నాయని తెలిపారు.

## ఆస్ట్రేలియాలో పెచ్చుమీరుతున్న జాత్యహంకారం

### ట్రక్కుడ్రైవర్లకు విద్వేషకారుల హెచ్చరికలు

**కాన్‌బెర్రా, జులై 11:** భారత్, ఆస్ట్రేలియాలు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతానికి కృషి చేస్తున్నప్పటికీ అక్కడ భారతీయులు ఎదుర్కొంటున్న తీవ్రమైన జాత్యహంకార సమస్య ఎవరి దృష్టికి రాకుండా ఉండిపోయింది. ఆస్ట్రేలియాలోని భారతీయ ట్రక్కు డ్రైవర్లపై జాత్యహంకార దాడులు, దూషణలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.

వారిని చంపుతామని లేదా అంతకంటే ఘోరంగా హింసిస్తామని చాలా మంది బెదిరింపులకు దిగుతున్నారు. వీరిలో చాలా మందికి ఇప్పటికే ఆస్ట్రేలియా పౌరసత్వం ఉన్నప్పటికీ జాత్యహంకార దూషణలకు గురవుతున్నారు. ఆస్ట్రేలియాలో రవాణా రంగానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ట్రక్కులు నడకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చాలా సాఫీగా సాగిపోతున్నట్టు కనిపించే ఈ రంగం వెనుక పరిష్కారం లేని ఓ పెద్ద సమస్య దాగి ఉంది. ఇది వలస డ్రైవర్ల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తాము ఎదుర్కొంటున్న జాత్యహంకార దూషణలను, వ్యవస్థాగత దోపిడీని భారతీయ డ్రైవర్లు ఎబిసి న్యూస్‌తో పంచుకున్నారు. డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉన్న సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి తాము సేవలను అందిస్తున్నందుకే ఈ వివక్ష ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. ఆస్ట్రేలియా రవాణా రంగంలో ప్రస్తుతం భారతీయ డ్రైవర్లు అత్యంత ముఖ్యమైన వలస శ్రామిక శక్తిగా మారారు.

అయినప్పటికీ వీరు నిరంతరం వేధింపులకు గురవుతున్నారు. పిప్పల్ సింగ్ అనే భారతీయ ట్రక్కు డ్రైవర్ కమ్యూనికేషన్ రేడియో ద్వారా తమకు వచ్చిన బెదిరింపులను రికార్డ్ చేశారు. 'ఇక్కడ త్వరలోనే అంతర్యుద్ధం రాబోతోంది మేము భారతీయ పురుషులందరినీ చంపేస్తాం పిల్లలను పాతిపెట్టి, మహిళలను అమ్మేస్తాం శ్వేతజాతీయుల ఎదుట మురికి భారతీయులు నిలబడలేరు' అని ఓ ఆస్ట్రేలియన్ చేసిన బెదిరింపులు అందులో రికార్డయ్యాయి. 'మంచి భారతీయుడు అంటే చచ్చినవాడే అని మరొకడు మాట్లాడాడు. ఇటువంటి బెదిరింపులతో చాలా మంది భారతీయ ట్రక్కు డ్రైవర్లు ప్రస్తుతం రేడియోను ఉపయోగించడం మానేశారు. సోషల్ మీడియాలోనూ డ్రైవర్లను ఎగతాళి చేస్తూ జాత్యహంకార మీమ్స్ షేర్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా ఆస్ట్రేలియాలో అత్యంత వేగంగా పెరుగుతున్న వలసదారుల సమూహంలో భారతీయులు మొదటి స్థానంలో ఉన్నారు. వీరిలో చాలామంది రవాణా రంగంలో దీర్ఘకాలంగా ఉన్న కార్మికుల కొరతను తీరుస్తున్నారు. అంతర్జాతీయ రోడ్డు రవాణా సంఘం అంచనా ప్రకారం 2024లో అనుభవజ్ఞులైన డ్రైవర్లు పదవీ విరమణ చేయడం, ఆస్ట్రేలియా యువత ఈ వృత్తిపై ఆసక్తి చూపకపోవడంతో సుమారు 28వేల మంది భారీ వాహన డ్రైవర్ల కొరత ఉంది. భారత్‌లో వ్యవసాయం, రవాణా పరిశ్రమతో అనుబంధం కారణంగా, చాలా మంది సిక్కు, పంజాబీ వలసదారులకు ట్రక్కు డ్రైవింగ్ సహజంగానే అలవడింది. 'ఇది నా రక్తంలోనే ఉందని జస్విందర్ అనే ట్రక్కు డ్రైవర్ అన్నారు. ఇండియాలో మా నాన్నకు సొంత రవాణా సంస్థ ఉండేది, అందుకే నాకు మొదటి నుంచీ ట్రక్కులంటే చాలా ఇష్టం అని ఆయన చెప్పారు.

## సంక్షిప్త వార్తలు

### వెనెజులా విలయం.. నాలుగు వేలు దాటిన మృతులు




**కారకస్, జులై 11:** వెనుజులాలో గత నెల 24న సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో ఇప్పటివరకు 4వేలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. 16,740 మంది గాయపడగా.. భవన శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నారు. ఇంకా చాలా మంది జాడ తెలియరాలేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు శుక్రవారం కారకస్‌లో 3.0 తీవ్రతతో భూకంపం సంభవించడంతో స్థానికంగా ఉన్న భవనాలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

### పెళ్లివిందులో మటన్‌లేదని ఘర్షణ

**పాట్నా,జులై 11:** బీహార్‌లో ఓ నిఖా విందులో హింస చోటుచేసుకున్నది. వధూవరులకు చెందిన కుటుంబసభ్యులు కొట్టుకున్నారు. విందు సమయంలో ఈ ఘటన జరిగింది. పెళ్లి విందులో మటన్ పెట్టలేదని వరుడి వర్గం వాగ్వాదానికి దిగింది. అయితే ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. సహర్స జిల్లాలోని సిమ్రి భక్త్యార్‌పూర్ గ్రామంలో ఈ కొట్లాట జరిగింది. అమ్మాయి, అబ్బాయి తరపున బంధులు తన్నుకున్న ఘటనలో మొత్తం 12 మంది గాయపడ్డారు. విందులో మటన్ పెడుతామని చెప్పిన అమ్మాయి తరపున కుటుంబీకులు హామీ ఇచ్చారు, కానీ భోజనంలో చికెన్ పెట్టడాన్ని వ్యతిరేకించారు.

### బెటాలియన్ కమాండింగ్ అధికారిగా భారత సంతతి యువతి



**న్యూఢిల్లీ:** భారతీయ సంతతికి చెందిన 17 ఏళ్ల అమ్మాయి రిద్ధి చౌహాన్ అమెరికాలో దూసుకెళుతోంది. న్యూయార్క్‌లోని తన స్కూల్‌లో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నది. నేవీ జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్‌కు ఆమె లీడర్ అయ్యింది. ప్రస్తుతం అమెరికా యువతకు ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు. న్యూయార్క్‌లోని బెంజిమన్ కార్డోజో హై స్కూల్‌కు నేవీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అయ్యారు. ఎన్‌జేఆర్‌ఓటీసీ ప్రోగ్రామ్‌లో హయ్యస్ట్ ర్యాంక్ స్టూడెంట్‌గా నిలిచిందామె. ఆ గ్రూపులోఉన్న సుమారు 300మంది క్యాడెట్లకు ఆమె నాయకత్వం వహిస్తున్నది. బెటాలియన్ ఆపరేషన్స్, ట్రైనింగ్, స్టూడెంట్ వెల్ఫేర్ చూసుకుంటూ, అకాడమిక్ చదువులోనూ నిమగ్నమవుతోంది.

### ప్రశాంత్‌కిశోర్‌పై అభ్యర్థిని మార్చిన బిజెపి



**పాట్నా,జులై 11:** బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక పోరు నాటకీయ మలుపు తీసుకున్నది. నామినేషన్ దాఖలు చేసిన ఒక రోజు తర్వాత తన అభ్యర్థిని బిజెపి ఆకస్మికంగా మార్చింది. జన సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్‌పై సాధారణ నేతను పోటీకి దించింది. అభిషేక్ బంటీ స్థానంలో నీరజ్ కుమార్ సిన్హాను తమ అభ్యర్థిగా బిజెపి ప్రకటించింది. దీంతో తొలిసారి ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రశాంత్ కిషోర్‌తో నీరజ్ కుమార్ సిన్హా తలపడనున్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నికైన తర్వాత బంకీపూర్ స్థానాన్ని ఖాళీ చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. బిజెపికి కంచుకోట అయిన ఈ స్థానంలో పోటీ చేసే అభ్యర్థిగా తొలుత అభిషేక్ బంటీ పేరు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం సీఎం సమ్రాట్ చౌదరి, పార్టీ అగ్ర నేతల సమక్షంలో ఆయన అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. వ్యక్తిగత కారణాల్ల వల్ల ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నట్లు అభిషేక్ బంటీ వెల్లడించారు.

12-7Pg6exHMNWJQE_12-7Pg6exHMNWJQE.qxd 12/Jul/26 12:03 AM Page 1



## తిరుమల సమాచారం



## 17న ఆణివార ఆస్థానం

### ఎల్లుండి కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం

### రేపు విఐపి బ్రేక్‌కు సిఫార్సులు తీసుకోరు

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17వతేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 14వతేదీ మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. రానున్న మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. 17న ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. 14వతేదీ అష్టదళ పాదపద్మారాధన సేవరద్దుచేశారు. సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించరు. మంగళవారం విఐపి బ్రేక్ రద్దు చేశారు.



## తిరుమల కొండపై విపరీతమైన రద్దీ

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం కావడంతో తిరుమలలో క్యూ కాంప్లెక్స్‌లు దాటి క్యూలైన్లు బాటగంగమ్మఆలయం వరకు విస్తరించాయి. పెరిగిన భక్తులతాకిడితో కొండ కిటకిటలాడుతోంది. వారాంతం వరుస సెలవులతో శనివారం ఉదయానికి కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వ దర్శనం కోసం భక్తులు దాదాపు 24నుండి 30 గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని, భక్తులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారంరాత్రి వరకు 73,265 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం 4.26 కోట్ల రూపాయలు ఆదాయం లభించింది. ఆదివారం కూడా ఈ రద్దీ కొనసాగనుంది.



## ప్రాణదాన పథకానికి వైద్యుడి విరాళం

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్టలలో ఎస్వీప్రాణదానం కూడా ప్రధానమైంది. ఎంతోమంది పేదలకు పలు రకాల అత్యాధునిక వైద్యం అందించేందుకు ఈ ట్రస్ట్ దోహదపడుతుంది. ఈ ట్రస్ట్‌కు తిరుపతికి చెందిన నారాయణాద్రి ఆస్పత్రి అధినేత డాక్టర్ సునందకుమార్ రెడ్డి, ఉషారాణి దంపతులు శనివారం 10లక్షల రూపాయల విరాళాన్ని ఇచ్చారు. ఈ విరాళాలను డాక్టర్ సునందకుమార్‌రెడ్డి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

## అలిపిరిమెట్ల మార్గంలో చిరుత

### మళ్లీ సంచారంతో భక్తుల్లో భయం

**తిరుమల,జులై 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నుండి తిరుమలకు గోవింద నామస్మరణతో కాలినడకన వచ్చే అలిపిరి మెట్లమార్గంలో అతి సమీపంలో శుక్రవారం రాత్రి చిరుత సంచరించడంతో కాలినడక భక్తులు వణికిపోయారు. ఈ మార్గంలో తిరుమలకు వస్తున్న భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మెట్ల మార్గానికి అతి సమీపంలో చిరుత ప్రత్యక్షం కావడంతో భయంతో బిగుసుకుపోయారు. కేకలు వేస్తూ, శబ్దం చేస్తూ దాన్ని తరిమికొట్టే ప్రయత్నం చేశారు. రాత్రి వేళ చిరుత సంచారంతో వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భద్రత చర్యలు చేపట్టారు .

శనివారం తెల్లవారు జామున తిరుమలకువస్తున్న శ్రీవారి భక్తులు అలిపిరి నడకమార్గంలో లక్ష్మీ ్మ నరసింహస్వామి ఆలయానికి అతి సమీపంలో పొదల్లో చిరుతను గుర్తించారు. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అటూ ఇటు పరుగులు తీశారు. ఆనుపరాడ్లతో శబ్దంచేశారు. చిరుత కదలికపై నిఘా పెట్టారు. అలిపిరి కాలినడక మార్గంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఇదివరకే అమర్చిన ట్రాఫ్‌కెమెరాలతో చిరుత సంచారాన్ని కనిపెడుతున్నారు. గతంలో లాగే తిరుమల కాలినడక మార్గాల్లో మళ్ళీ చిరుతల సంచారం మొదలైందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది అలిపిరి నడక దారిలో చిరుత సంచరించిన విషయం తెలిసిందే. 350వ మెట్టు సమీపంలో, అలిపిరి ఎస్వీజూ పార్క్ మార్గంలో, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీ క్యాంపస్ ఆవరణలో చిరుతల సంచారం ఉంది.

అటవీప్రాంతంలో నీరు, ఆహారం దొరకక దారి తప్పిన చిరుతపులులు ఏకంగా ఘాట్‌రోడ్లపై, కాలినడక మార్గాల్లో భక్తులకు కనిపిస్తున్నాయి. అటవీప్రాంతం వదలి భక్తుల సంచారం ప్రాంతాల్లో వచ్చేస్తుం డటంతో భయంతో వణికిపోతున్నారు. సాధారణంగా శేషాచలంఅటవీప్రాం తంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక, ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో లింకురోడ్డు దాటిన తరువాత గతంలో చిరుతల జాఢ ఉండేది. గతంలో మొదటిఘాట్‌లోనేగాక రెండోఘాట్‌లోనూ, కాలినడక మార్గంలోనూ ఆగస్ట్, సెప్టెంబర్‌మాసాల్లో భక్తులపై చిరుతపులులు దాడిచేయడం, ఏకంగా చిన్నారులను హతమార్చిన ఘటనలు విధితమే. శేషాచలం అటవీప్రాంతం తిరుమల సప్తగిరులను ఆనుకుని ఉండటం, తిరుపతివైపు మంగళం, కరకంబాడి, మామండూరు, కుక్కలదొడ్డివరకు వ్యాపించిఉంది. ఇటు చంద్ర గిరి, శ్రీవారిమెట్టు, ఏ.రంగపేట, భాకరాపేట, పీలేరువరకు శేషాచలం అడ వులు ఉన్నాయి. ప్రధానంగా తిరుపతివైపు కపిలతీర్థం, మంగళం, కరకం బాడివైపు ఉన్న అటవీప్రాంతంలో చిరుతపులులు, ఎలుగుబంట్లు. ఏనుగులు సంచారం ఎక్కువగా ఉంది.

# అంతరాలయం అనుమతించనపుడు టిక్కట్లెందుకు జారీ చేసారు?

### సిబ్బందిపై భక్తుల ఆగ్రహం: సమాధానం చెప్పలేని అధికారులు

### సర్వర్ డౌన్‌తో తిప్పలు

**శ్రీకాళహస్తి,జూలై 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులు గత రెండు నెలలుగా ఆన్‌లైన్ సేవలతో తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు అధికారులు రోజుకొక నిర్ణయంతో భక్తుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు. శనివారం శనీశ్వరాభిషేకానికి వచ్చిన భక్తులు ఆన్‌లైన్ మాత్రమే ఆఫ్‌లైన్ లేదనటంతో అభిషేకాలు పూజలు జరిపించుకోకుండానే వెనుదిరిగారు. ఇక భక్తులకు సుదర్శనం కోసం ఏర్పాటు చేసిన సేవల్లో 'అంతరాలయ దర్శనం' ఒకటి. అంతరాలయ



దేవస్థానం జారి చేసిన అంతరాలయ టిక్కెట్టు

దర్శనం రూ.500లు ఖరారు చేసారు. శనివారం అంతరాలయ దర్శనం కోసం పలువురు భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి స్వామి దర్శనానికి వచ్చారు. అయితే భక్తులు రద్దీ అధికమయ్యారని 'అంతరాలయ దర్శనం' రద్దు చేసారు. ఆన్‌లైన్‌లో అంతరాలయ టిక్కెట్లు జారి చేసారు. కానీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దాంతో టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు స్వామి గర్భగుడి వద్ద సిబ్బంది ససేమిరా అన్నారు. దాంతో భక్తుల అసహనానికి గురయ్యారు. తిరుగబడ్డారు. అనుమతించనపుడు టిక్కెట్లు ఎందుకు జారి చేసారని నిలదీసారు. సిబ్బంది మాకు సంబంధం లేదంటే భక్తులు ఎవరిని అడగాలో తెలియక ఇబ్బంది పడ్డారు. అయితే అ ంతరాలయ దర్శనం కావాలంటే మధ్యాహ్నం 3గంటల వరకు ఆగాలని ఉచిత సలహా ఇచ్చారు. అంతరాలయ దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు సిబ్బందితో గొడవ పడుతుంటే 'పిఆర్ఓ' కార్యాలయం నుంచి బ్యాచ్ గుంపులు గుంపులుగా రాజమార్గంలో వెళుతుంటే భక్తులు ఆగ్రహానికి హద్దుల్లేకుండా పోయింది.

**సమన్వయం లేని అధికారులు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కొరవడింది. భక్తులకు సేవల టిక్కెట్లును ఆన్‌లైన్‌లో జారి చేసి అనుమతించకపోవటంతో గొడవ ప్రారంభం అయ్యింది. భక్తులు స్వామి గర్భగుడివద్ద గొడవ పడగా భక్తుల్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోమని ఉచిత సలహా ఇచ్చారు. అంటే క్యూలైన్ల నుంచి బయటకు వెళ్ళి కార్యాలయం వెతుక్కొని వెళ్ళి ఫిర్యాదు చేయటం సాధ్యమా? అని ప్రశ్నించారు. అయితే అక్కడ ఉన్న ఓయువకుడు ఎఇఒకు ఫోన్‌చేస్తే నాకేం సంబధం అని జవాబు వచ్చింది. అయితే రద్దీ సమయాల్లో ఇఒ లేనపుడు డెప్యూటిఇఒ పర్యవేక్షించాలి. అయితే ఆయన ఎక్కడా కనబడరు. కార్యాలయం నుంచి కాలు బయట పెట్టరు. సమస్యలను పట్టించుకోరు. ఇక ఎఇఒలు ఒకరిపై ఒకరు ఇలా సమన్వయం కొరవడి భక్తి భావంతో వచ్చిన భక్తుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు.

# అలిపిరి ఆర్చికి ఆధ్యాత్మిక శోభ ఏదీ?

### మహామండపం తరహాలో మార్పులు ఎప్పుడు!

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు ప్రవేశించే ప్రధాన ద్వారం అలిపిరి ఆర్చికి కొత్త ఆధ్యాత్మిక శోభ తీసుకువచ్చేందుకు టిటిడి నిర్ణయించినా ఆ పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. ఇందుకోసం నిర్ణయించిన ప్రణాళికలు కూడా అమలుకు నోచుకోలేదు. తిరుమల క్షేత్రం వైభవాన్ని అలిపిరిలోనే భక్తులు తెలుసుకునేలా బేస్‌క్యాంప్ ఏర్పాటుతోబాటు మహామండపంలోకి వచ్చేలాగా అనుభూతి కలిగించేలా కొత్త డిజైన్లతో మార్పులు చేయాలని ఏడాదిక్రిందట ఆమోదించినా పనులు మాత్రం మొదలుకాలేదు. ఏకంగా ఈ నూతన నిర్మాణ బాధ్యతలను ఆర్కిటెక్ ఆనందసాయికి టిటిడి పాలకమండలి అప్పగించింది. ఇప్పటికే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పేరును తిరుపతి(రేణిగుంట)లోని



విమానాశ్రయానికి మార్పుచేస్తూ టిటిడి పాలకమండలి కేంద్రానికి ప్రతిపాదనలతో నివేదించిన విషయం విదితమే. తిరుపతి విమానాశ్రయం, అలిపిరి ప్రవేశద్వారం ఆర్చ్‌కు కొత్తరూపు తీసుకువచ్చేలా టిటిడి నిర్ణయం అభినందించదగినదైనా ఆ దిశగా మార్పులు మాత్రం జరగలేదు. తిరుమల ఐకానిక్‌గా ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేందుకు టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వాటి డిజైన్లలో పేరెన్నికగన్న ఆర్ట్‌డైరెక్టర్, టెంపుల్స్ ఆర్కిటిక్ ఆనందసాయి బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న ప్రయాణీకుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో విమానాశ్రయంలోనూ తిరుమల శోభ కనిపించేలా మార్పుచేయనున్నారు. అలిపిరిలో మొదట ఉన్న గరుడవిగ్రహం కూడలిలోని ఆర్చిని ఆధునీ కరించాలని ఆలోచనతో టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గతంలో కాలినడకన అలిపిరి నుండి తిరుమలకు చేరుకున్నఆనందసాయి అలిపిరి నుండి ఆనందనిలయం వరకు చేపట్టాల్సిన అభివృద్ధి, ఆధ్యాత్మిక వాతావరణంపై చర్చించారు. రోజువారీగా లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తుంటే ఇందులో 20వేలమంది కాలినడక మార్గాల్లో, 60వేలమంది వరకు భక్తులు వాహనాల్లో ఘాట్‌రోడ్లపై ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో భక్తులు ఒక అనుభూతిచెందేలా మార్పులు జరగనున్నాయి. అలిపిరి వద్ద ఒక ఆధ్యాత్మికంగా మహామండపంలోకి ప్రవేశిస్తున్నామనే భావన భక్తులకు కలిగించేలా అలిపిరి ఆర్చి మార్పులు చేసే పనులు మొదలుపెట్టాలని భక్తులు కోరుతున్నారు.

# రెండేళ్లయినా పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించరా!

### రాష్ట్ర ఎస్‌టియు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ధ్వజం

**చిత్తూరు, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు పిఆర్‌సి ఛైర్మన్‌ను సైతం నియమించలేదని రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ధ్వజమెత్తారు. చిత్తూరులోని ఎస్టీయు జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్టీయు కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా సత్వరం పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడంతో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో వున్న 5 డిఎలను మంజూరు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు చేసి అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వీసులోని ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష లేకుండా పార్లమెంటులో విద్యాహక్కు చట్టానికి చట్ట సవరణ చేయడానికి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంను ఒప్పించడానికి కృషి చేయాలన్నారు. అలాగే ఈ నెల 14వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ఎదుట ర్యాలీ, పికెటింగ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత గంటామోహన్‌ను తూర్పు రాయలసీమ



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించి ఎస్టీయు తరపున భవిష్యత్తులో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని తీర్మానం చేసి రాష్ట్ర సంఘానికి ప్రతిపాదనలు పంపారు. ఈ సమావేశంలో ఎస్టీయు నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, షేక్ ఇలియాజ్, పురుషోత్తం, దేవరాజులు, యువరాజు, హేమచంద్రారెడ్డి, బొబ్బిలిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

### సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్ కీలకం: కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, జూలై 11, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్, అదనపు ఎస్పీ సౌజన్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయస్థానాలపై కేసుల భారం అధికంగా ఉండటంతో అనేక కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. దీనివల్ల కక్షిదారులు సమయం, ధనం కోల్పోవాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకే రాజీ మార్గమే రాజమార్గం అనే భావనతో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు పక్షాలు పరస్పర అంగీకారంతో రాజీకి వస్తే ఇద్దరికీ ప్రయోజనం చేకూరడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థకు ఇళ్ల



పన్ను, వ్యాపార పన్ను, నీటి పన్ను తదితరాల రూపంలో సుమారు రూ.100 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించినప్పుడే ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అభివృద్ధి పనులు, ప్రజా సేవలను సమర్థవంతంగా అందించగలవని చెప్పారు. నేషనల్ లోక్ అదాలత్‌కు ముందు పంపిన నోటీసులకు స్పందించి శుక్రవారం సాయంత్రానికే సుమారు రూ. 1 కోటి పన్నుల బకాయిలు వసూలయ్యాయని వెల్లడించారు. మిగిలిన బకాయిదారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానం ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, భారతదేశంలో కూడా ప్రజలు దీనిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ, కుటుంబ, ఆస్తి, సివిల్ వివాదాల పరిష్కారం న్యాయవ్యవస్థ ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. అలాంటి వివాదాలకు లోక్ అదాలత్ అత్యంత సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు.

# కుప్పం చిగురుగుంట 'బంగారు'గనులపై చిగురిస్తున్న ఆశలు

### గనుల ప్రారంభానికి ఊపిరి పోసిన సిఎం చంద్రబాబు ప్రకటన !!

### ముగిసిన టెండర్ల బిడ్ గడువు.. త్వరలోనే టెండర్లు ఖరారు..?

### వేలాదిమందికి ఉపాధి అవకాశాలు.. గనులు తెరచుకుంటే 'స్వర్ణకుప్పమే'

**కుప్పం, జూలై 11 ప్రభాతవార్త:** కుప్పం చిగురుగుంట బంగారు గనులకు త్వరలో మహర్దశ పట్టధం ఖాయంగా కన్పిస్తోంది. దాదాపు పాతికేళ్ల అనంతరం బంగారు గనులు తెరచుకునేందుకు మార్గం సుగమం అవుతోంది. చిగురుగుంట గనుల నిర్వహణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన టెండర్ల బిడ్ ప్రక్రియ రెండు రోజుల క్రితం ముగిసింది. రేపో మాపో టెండర్లు ఖరారయే ్య అవకాశాలు ఉన్నాయి. ఇటీవలే సిఎం చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పం పర్యటనలో చిగురుగుంట బంగారు గనుల్ని మళ్లీ ప్రారంభిస్తామని ప్రకటించడంతో గనుల ప్రారంభంకు మరలా సిఎం ఊపిరిపోశారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో బంగారు గనులు తెరచుకుంటాయని ఆశలు చిగురిస్తున్నాయి.

**1978లో మొదలై 2001లో మూత :** చిగురుగుంట బంగారు గనుల్లో బంగారం తవ్వకాలను 1978లో ఎంఇసిఎల్ అనే సంస్థ ప్రారంభించింది. ఈ సంస్థ 1982వరకు కార్యకలాపాలు కొనసాగించింది. అన ంతరం 2001వరకు ఈ గోల్డ్‌మైన్స్‌ను భారత్ గోల్డ్‌మైన్స్ సంస్థ(బిజిఎంఎల్) నిర్వహించింది. చిగురుగుంటకు సమీపంలోనే కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్(కెజిఎఫ్) బంగారు గనులు, భారత్ గోల్ డ్‌మైన్స్(బిజిఎంఎల్) సంస్థలు ఉండేవి. చిగురు గుంట గనుల్లో తీసిన ముడి ఖనిజాన్ని కెజిఎఫ్‌కు తరలించి అక్కడ శుద్ధి చేసి బంగారాన్ని వేరుచేసేవారు. అప్పట్లోనే చిగురుగుంట గనుల్లో వేలాది మంది ఉపాధి అవకాశాలు పొందేవారు. అయితే రాను రాను గనుల్లో బంగారు నిక్షేపాలు తగ్గడం, ముడి ఖనిజం వెలికి తీసేందుకు అయ్యే వ్యయం అధికంగా ఉండడంతో చిగురుగుంట గనులతోపాటు కోలార్ గోల్డ్‌ఫీల్డ్ (కెజిఎఫ్) గనులు సైతం 2001లో మూతపడ్డాయి. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఈగనులను మూసేసింది.

**2011లో మైసూర్ జియోచే మరలా పరిశోధన :** 2001లోమూతపడ్డ చిగురుగుంట బంగారు గనుల ప్రాంతంలో మరలా మైసూర్ జియో సంస్థ ముడి బంగారం నిల్వలు ఉన్నాయా లేదా అనే అంశంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో 400 హెక్టార్ల ప్రాంతంలో పరిశోధనలు చేసింది. గనుల ప్రాంతంలో చిన్నపాటి బావులు తీసి వాటి ద్వారా ముడి బంగారం ఏమేర ఉందో నిర్ధారణ చేసి ఆ నిక్షేపాలను అప్పట్లో దేశరాజధాని న్యూఢిల్లీలోని ల్యాబ్‌కు పంపింది. ఈ ప్రాంతంలో ముడి బంగారు ఖనిజం ఉందని నిర్ధారణ అయ్యాక కేంద్రం తదుపరి చర్యలు చేపట్టింది. కాగా చిగురుగుంట ప్రాంతంలో 20లక్షల టన్నులు, బిసానత్తం వద్ద 1లక్ష టన్నులకు పైగా ముడి ఖనిజ నిల్వలు ఉన్నట్లు సమాచారం.

**2018లో మరలా టెండర్లు :** చిగురుగుంట బంగారు గనుల నిర్వహణకు కేంద్రం 2018సం॥ చివర్లో టెండర్లు పిలిచింది. ఆస్ట్రేలియా దేశంకు చెందిన పలు సంస్థలతో పాటు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ('ఎన్ఎండిసి) పోటీ పడ్డాయి. చివరకు ఎన్ఎండిసి సుమారు 500కోట్లకు టెండర్లు ఖరారు చేసుకుంది. తదనంతరం 2019లో అధికారంలో వచ్చాక వైఎస్ జగన్ సిఎంగా ఉన్న సమయంలో చిగురు గుంట గనుల్ని తెరిపిస్తామని పేర్కొన్నా ఆచరణలో సాధ్యం కాలేదు. పర్యావరణ అనుమతులు, ప్రభుత్వంచే గనుల ప్రాంతం అప్పగింత, మైనింగ్ ప్రణాళిక తదితర అంశాలు కొలిక ్కి రాకపోవడంతో ఎన్ఎండిసి గతేడాది ఈ ప్రాజెక్టును ఉపస ంహరించుకుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా చిగురుగుంట గనుల నిర్వహణకు టెండర్లు పిలిచాయి. ఈనెల 9తో బిడ్ గడువు ముగిసింది. త్వరలోనే టెండర్లను ప్రభుత్వాలు ఖరారు చేయనున్నాయని తెలుస్తోంది. ఇదే జరిగితే అతి త్వరలోనే కుప్పం గోల్డ్‌మైన్స్ మరోమారు విపణిలో మెరవడం ఖాయమే. చిగురుగుంట గనులు ప్రారంభమైతే కుప్పం ప్రాంతంలో వేలాది మందికి స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. 2011లో చిగురుగుంట గనుల్లో పరిశోధన చేసిన జియో మైసూరు సంస్థ ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన జొన్నగిరి గోల్డ్‌మైన్స్‌ను నిర్వహించడం విశేష ం.



చిగురుగుంట గనుల ప్రాంతం

## రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌ఛైర్మెన్‌గా పి.షణ్ముగం నియామకం

**చిత్తూరురూరల్, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌ఛైర్మెన్‌గా పి షణ్ముగం నియమితులయ్యారు. శనివారం విజయవాడలోని ఎసిటియు భవన్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఏపి ఒలంపిక్ అసోసియేషన్‌కు అనుబంధంగా వున్న ఏపి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో షణ్ముగం పేరును వైస్‌ఛైర్మెన్‌గా ప్రతిపాదించగా అనుబంధ జిల్లా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రవ్యాప్తంగా సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంతో నియామకం చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడకు మరింత ప్రోత్సాహం అందించేం దుకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఆయన నియామకం పట్ల క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, అబిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## భక్తుల రద్దీతో పోటెత్తిన కాణిపాకం

**కాణిపాకం, జూలై 11 ప్రభాతవార్త:** వరుస సెలవులతో కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఆలయంలో సాధారణంగా వారంతపు రోజులు, వరుస సెలవు రోజుల్లో తీవ్ర స్థాయిలో భక్తుల రద్దీ వుంటుంది. ఈ మేరకు శని, ఆదివారాల్లో వారాంతపు రోజులతో పాటు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో స్వామి వారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుండి కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి సైతం భక్తులు స్వామి దర్శనార్థం భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయంలోని క్యూ కాంప్లెక్స్, క్యూ లైన్లు పూర్తి రద్దీతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా రూ.100 శీఘ్ర దర్శనం, రూ.150అతి శీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతంగంటల తరబడి క్యూ లైన్లలో వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## వియత్నాం బోటు ప్రమాదంలో పురం యువకుడు దుర్మరణం



రవితేజ (ఫైల్)

**హిందూ పు రం జులై 11 ప్రభాతవార్త:** వియత్నం దేశంలో విహారయాత్రకు వెళ్లిన శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెంది న రవితేజ(40) దుర్మరణం చెందారు. స్థానిక టీచర్స్ కాలనీలో నివసిస్తున్న రవితేజ ధనలక్ష్మి రోడ్లో లక్కీ మొబైల్ షాపును నిర్వహించేవారు. లావా కంపెనీ ఫోన్లను అధికంగా సేల్ చేయడంతో విహారయాత్రకు సెలెక్ట్ అయి కంపెనీ తరఫున వియత్నానికి మూడు రోజుల క్రితం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో వియత్నం దేశంలో సముద్రంలో స్పీడ్ బోట్ లో వెళ్తుండగా ఒకసారిగా అలల తాకిడి పెరిగి బోటు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో రవి తేజతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మృత్యువాత పడ్డారు. ఇదిలా ఉండగా రవితేజ మరణ వార్త తెలుసుకొని కుటుంబ సభ్యులు షాక్ గురయ్యారు. తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు శోక సంద్రంలో పడిపోయారు. రవితేజ తండ్రి ఆదిశేషయ్య చాలా ఏళ్ల క్రితమే చనిపోగా ఆ కుటుంబానికి ఏకైక కుమారుడైన ఇతను కూడా మరణించడంతో మగదిక్కు లేకుండా పోయిందని ఆత్మీయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో మంచివాడిగా పేరొందిన రవితేజ అకాల మరణం చెందడంతో స్నేహితులు, పుర ప్రజలు చలించి పోయారు. వియత్నం నుంచి మృతదేహాన్ని వీలైనంత తొందరగా రప్పించేందుకు భారత ఎంబసీ ద్వారా బంధువులు ప్రయత్నాలు చేస్తున్నారు. వరు సకు అన్న అయినా భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన తమ్ముడు మృతి జీర్ణించుకోలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు.

# దేశంలోనే ఆదర్శంగా గోదావరి పుష్కరాలు

## సమన్వయంతో శాశ్వత అభివృద్ధి పనులు: రాష్ట్ర మంత్రులు నారాయణ,దుర్గేష్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై11,ప్రభాతవార్త:** గత గోదావరి పుష్కరాల్లో సుమారు 4 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేయగా, ఒక్క రోజే 68 లక్షల మంది స్నానాలు చేసిన నేపథ్యంలో ఈసారి 12 రోజుల పుష్కరాల్లో దాదాపు10 కోట్ల మంది యాత్రికులు గోదావరి తీరం చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి డా. పి. నారాయణ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆ స్థాయికి తగిన విధంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించి నిర్మాణాత్మకంగా పనిచేయాలని వారు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ (ఆర్ఎంసీ) కార్యాలయ సమావేశ మందిరం లో గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పురపాలక శాఖ మంత్రి డా. పి. నారాయణ మాట్లాడుతూ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో గత పుష్కరాల నిర్వహణలో ఉన్న అనుభవాన్ని సమర్థంగా వినియోగించి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పుష్కరాల కోసం చేపట్టే పనులు తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కాకుండా నగరానికి శాశ్వత ఆస్తులుగా నిలిచే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ ద్వారా నిధులను సమీకరించి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.48 కోట్ల ఆర్ఎంసీ నిధులతో పాటు,ఎల్ఆర్ఎస్ ద్వారా మరో రూ.32 కోట్లు సమీకరించి, అదనంగా రూ.120 కోట్ల గ్రాంట్ పొందేలా చర్యలు చేపడుతున్నామని,తద్వారా సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. టీడీఆర్ బాండ్లకు సంబంధించిన సమగ్ర వివరాల ను వెంటనే సమర్పించాలని అధికారు లను ఆదేశించారు.

అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పనులను వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన అంచనాల ను వెంటనే సిద్ధం చేయాలని మంత్రి నారాయణ సూచించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, మురుగునీటి పారుదల వ్యవస్థ, జంక్షన్‌ల ఆధునీకరణ, శానిటేషన్, విద్యుత్, తాగునీటి వంటి అన్ని అంశాలపై తాజా ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణం గా సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పుష్కరాల విజయవంతమైన నిర్వహణకు రాజమహేంద్రవరం నగరంతో పాటు కొవ్వూరు, నిడదవోలు, ధవళేశ్వరం,పరిసర ప్రాంతాల్లో సమగ్రఅభివృద్ధిఅవసరమన్నారు. నిడదవోలు పరిధిలోని పెండ్యాల, ముక్కామల, తిపర్రు ఘాట్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాల కు తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే కొవ్వూరు- రాజానగరం మండలం విజ్జేశ్వరం - నిడదవోలు వరకు 38 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేస్తే పర్యాటక, రవాణా పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎంఎల్ఏలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ కే. ఆదిత్య శర్మ అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాలతో విధ్వంసం

### ప్రత్యర్థి పార్టీల నేతలు మానసిక ఉన్మాదంతో వ్యవహరిస్తున్నారు

### టీడీపీ కార్యాలయంలో మీడియాతో సీఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై11, ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీకి ఒక రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు ఏమాత్రం లేవని అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అందుకే ఆ పార్టీని గొడ్డలితో పోలుస్తున్నామన్నారు. దౌర్జన్యం,దోపిడి,దాష్టీకం తప్ప ఆ పార్టీ నేతలు వారి పరిపాలనలో చేసిందేమిటంటూ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. తప్పుడు ప్రచారాలు, హత్యారాజకీయాలు ఆ పార్టీ అస్త్రాలన్నారు. వైసిపి నేతలను గమనిస్తే వారిదంతా రక్త చరిత్రేనని విమర్శించారు. తెలంగాణలో ఆరుగురిని కిరాతకంగా హత్య చేసిన హంతకుడి మనస్తత్వానికి, జగన్ వైఖరికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. కడప స్టీల్ ప్లాంట్ పేరుతో ఒక వ్యక్తి అవినీతి దాహానికి లక్షల కోట్ల విలువైన సహజ సంపద ఆవిరైందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పేరుతో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బ్రహ్మణీ స్టీల్స్‌కు కేటాయించిన భూములను ప్రభుత్వం ఇప్పటికే వెనక్కి తీసుకుందని,అయితే ఓబులాపురం మైనింగ్ అంశం ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. జగన్, ఆయన కుటుంబం వల్ల ఎందరో ఐఏఎస్ అధికారులు బలయ్యారని, ఎంతోమంది వ్యాపారవేత్తలు సర్వనాశనమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏదో ఒక విధ్వంసం సృష్టించి, పక్క రాష్ట్రంలోని బెంగళూరులో తలదాచుకోవడం వారికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని, నేతలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాను వ్యక్తిత్వ హననాలకు, మహిళలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకుంటున్నారని, ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఫేక్ పోస్టులను కట్టడి చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు. సొంత ప్రయోజనాల కోసం రైతుల భూములను 22ఏ జాబితాలో పెట్టి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరిస్తోందని హామీ ఇచ్చారు.

**బ్రాహ్మణి స్టీల్స్‌తో ఓబుళాపురం మైనింగ్ బ్లాక్**

బ్రాహ్మణి స్టిల్స్ దోపిడీ కథ భూముల స్వాధీనంతో ఆగలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. బ్రాహ్మణి స్థలం సమస్యకే ప్రస్తుతానికి చెక్ పడినా, దీనికి లింక్ అయి ఉన్న ఓబుళాపురం అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. బ్రాహ్మణి స్టీల్స్ వల్ల ఓబుళాపురం మైనింగ్ బ్లాక్ అయిందని ఇవి బ్లాక్ కాకుండా ఉంటే రాష్ట్రానికి ఎన్నో ఏళ్ల నుంచి భారీ పెట్టుబడులు వచ్చేవని తెలిపారు. విశాఖ బాక్సైట్‌ను కూడా ఇలాగే చేశారన్నారు. ఇలాగే పెండింగ్‌లో ఉన్న లేపాక్షి భూముల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. ఇవన్నీ కొనసాగి ఉంటే నాలుగు సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు భారీగా అనుబంధ పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు లభించేవని తెలిపారు. పెద్దఎత్తున భూమి అందుబాటులో ఉండటమే పెట్టుబడులు రావటానికి పెద్ద సానుకూలత అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావటం గొడ్డలి పార్టీ అధినేతకు ఇష్టం లేదన్న చంద్రబాబు రూ.లక్షల కోట్ల రాష్ట్ర సంపదను దోచుకునేందుకు అభివృద్ధికి అడ్డుకట్ట వేశారని ధ్వజమెత్తారు.

**పెట్టుబడులు రాకుండా చేసేందుకు మావిగన్**

జగన్ నేర మనస్తత్వానికి ఉదాహరణ మావిగన్ అని సీఎం చంద్రబాబు అన్నారు. కేవలం పారిశ్రామి కవేత్తలు, పెట్టుబడులు రాకుండా చేసేందుకు మావిగన్ తీసుకువచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లామని, పోలవరం, వెలుగొండ ప్రాజెక్టులను కూడా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని తెలిపారు.

**చంద్రబాబును కలిసిన టెక్కలి మాజీ ఎమ్మెల్యే వరదా సరోజమ్మ భర్త, ఇద్దరు కుమార్తెలు**

టెక్కలి మాజీ ఎమ్మెల్యే వరదా సరోజమ్మ భర్త, ఇద్దరు కుమార్తెలు సీఎం చంద్రబాబుని కలిశారు. ఈ సందర్భంగా వరదా సరోజమ్మ ఉదంతాన్ని చంద్రబాబు మీడియా వద్ద గుర్తు చేసుకున్నారు. శ్రీకాకుళంలో మొదటి హోటల్ వరదా కుటుంబం పెడితే తాను అప్పట్లో బస చేశానని అన్నారు. ఇప్పుడు ఆ కుటుంబ దయనీయ పరిస్థితి చూసి చలించిపోయానని, సరోజ చనిపోయాక.. కొడుకు ఆస్తి లాగేసుకుని తండ్రిని, తోబుట్టువులను గెంటేశాడని అన్నారు. ఆ కుటుంబ పరిస్థితి చూసి జాలేసిందని, తప్పక న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గొడ్డలి పార్టీ అధినేతది కూడా ఇదే మనస్తత్వం కదా అని, ఆస్తి ఇవ్వకుండా తల్లి, చెల్లిని బయటకు గెంటే సంస్కృతి పెరుగుతుండటం దురదృష్టకరమని సీఎం వ్యాఖ్యానించారు.

# గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుపై నివేదిక ఇవ్వాలి

## రాష్ట్ర ఎన్నికల సంఘం

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్ని గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుందో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీరాజ్ శాఖను కోరింది. కోర్టు కేసుల కారణంగా గతంలో ఎన్నిక నిర్వహించని 331 పంచాయతీల్లో తాజా పరి స్థితి ఏమిటో తెలియ జేయాలని ఆదేశం చింది. పుర, నగరపా లక సంస్థలు, నగర పంచాయతీల్లో విలీనం చేసిన పంచాయతీల విషయంలో వివాదాలు ఉన్నాయా అనేదీ స్పష్టం చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిలచంద్ర పునేఠా పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు లేఖ రాశారు.

పంచాయతీల్లో సర్పం చుల పదవీ కాలం ఏప్రిల్ 2న ముగియడంతో తిరిగి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తు న్నారు. వార్డుల వారీగా ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియ పూర్తయింది. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఈ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయడంతో ఎన్నికల కమిషన్ కూడా ఏర్పాట్లు చేస్తోంది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు.

331 పంచాయతీలను కోర్టు కేసులు, ఇతరత్రా వివాదాల కారణంగా పక్కన పెట్టారు. ఈసారి అన్ని పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎలా ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్ఈసీ లేఖ రాయడంతో కమిషనర్ కార్యాలయం పెండింగ్ కోర్టు కేసుల వివరాలు బయటకు తీస్తోంది. వీటిలో 51 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించొచ్చని అధికారులు ప్రాథ మికగా అంచనాకు వచ్చారు.

280 పంచాయ తీలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్లో ఉన్నట్లు గుర్తించారు. పుర, నగరపాలక సంస్థల్లో విలీనం చేసిన కొన్ని పంచాయతీల విషయంలోనూ కోర్టు కేసులు నమోదైన విషయాన్ని ఎన్నికల కమిషనర్కు నివేదించనున్నారు.

# దుర్గమ్మవారి భవనాలకు ఏకరూపక రంగులతో ముస్తాబు : కమిషనర్ ఆదేశం







అన్నదానం, ప్రసాదం పోటు భవనాల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్, మంత్రి సుభాష్, దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జులై 11, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్మాణంలో వున్న లడ్డూపోటు, అన్నదాన భవనాలను కమీషనర్ కె రామచంద్ర మోహన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లడ్డూపోటు సెల్లార్‌ను భక్తులకు త్వరగా అందుబాటులోకి తెవాలని ఆదేశించారు. ఈ మూడు భవనాలకు ఆహ్లాదకరమైన రంగులు ఏకరూపతతో వుండేలా వేయాలన్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా వుండాలన్నారు. ఆయనతో పాటు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పి రాఘవరాజు, డిప్యూటి ఇఒ కిషోర్ కుమార్, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు ఎల్ రమ, అసిస్టెంట్‌కమీషనర్ రంగారావు,తదితరులు పాల్గొన్నారు.

**15 నుండి ఆషాఢమాస ఉత్సవాలు:** దుర్గమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తూ ఆషాఢమాసంలో భక్తులు ఆరాధించే ఆషాఢమాస ఉత్సవాలు ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారికి ఆషాఢమాస సారె ను పలు భక్తబృందాలు అందిస్తాయని, ఆషాఢమాస ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలన్నారు.

**దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్:** దుర్గమ్మవారిని శనివారం మంత్రి వాసంసెట్టి సుభాష్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన రాయపాటి కోటి సుధాకర్ రు.1,08,616ల విరాళం శనివారం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌కు అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ధవళేశ్వరం..మరింత పటిష్టం..

కొత్తగేట్లు అమర్చే పనుల్ని రేపు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు

రూ.152.95కోట్లతో 117పాత ఫ్లడ్ గేట్ల స్థానంలో కొత్త గేట్లు

పిచ్చుకలంక గ్రామంలో రైతులతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి

అదే రోజున పోలవరం ప్రాజెక్టు పరిశీలన, అధికారులతో సమీక్ష

**విజయవాడ, జూలై 11, ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు జీవనాడి ధవళేశ్వరం బ్యారేజీ మరో చారిత్రాత్మక ఘట్టానికి సిద్ధమవుతోంది. గోదావరి నదిపై నిర్మితమై లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తోన్న ధవళేశ్వరం బ్యారేజీకి ప్రభుత్వం కొత్తగేట్లు అమర్చనుంది.

బ్యారేజీకు ఉన్న 117 గేట్లను మార్చాల్సి రావడంతో వాటి స్థానాల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు గేట్లను అమర్చే పనులకు ఈ నెల 13వ తేదీన సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట కొత్తగేట్ల అమరికకు ప్రభుత్వం రూ.152.95 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో పార్ట్1కు రూ.130.42 కోట్లు, పార్ట్2కు రూ.22.53 కోట్లు ఖర్చు చేయ నుంది. 117 పాత ఫ్లడ్ గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయనుంది. 12 హెడ్ స్లూయిజ్ గేట్ల బాటమ్ టియర్ షట్టర్లకు మరమ్మతులు చేయనున్నారు. 175 క్రస్ట్ గేట్లకు కొత్త రబ్బరు సీల్స్, 734 రోలర్ బేరింగ్స్ కొత్తవి అమర్చనున్నారు. 197 గేట్లకు వైర్ రోప్స్ మార్పు, సాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్, పార్ట్2 కింద 102 మాస్టర్ కంట్రోలర్ ప్యానెల్స్, 175 గేట్లకు ఎలక్ట్రికల్ కేబుల్స్ వైరింగ్ చేయనున్నారు. ఈ పనులను తీనిదివీలీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపట్టింది. ఈ మొత్తం పనులను తీనిదివీలీ ఇన్ఫ్రా సంస్థ రెండేళ్లలో పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించనుంది.

**వైసీపీ ప్రభుత్వం...నిలువెత్తు నిర్లక్ష్యం**

సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలో గత ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో ఆ ప్రాజెక్టుల రెండు గేట్లు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అయినా ప్రాజెక్టుల నిర్వహణపై నాటి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరించింది. ధవళేశ్వరం ఆనకట్ట విషయానికి వస్తే 2014లో రూ.31.77 కోట్లతో 58 గేట్లకు మరమ్మతులను నాటి టీడీపీ ప్రభుత్వం చేయించింది. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్యారేజ్ రక్షణపై తీవ్ర నిర్లక్ష్యం చూపింది. కనీస మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టలేదు.

దీంతో 2024లో ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు రిపేర్లకు గత ఏడాది జూన్ 30న పరిపాలనామోదం ఇచ్చింది. బ్యారేజీ గేట్లను అమర్చి 50 ఏళ్లు దాటడంతో ఆపరేటింగ్ మెకానిజం సర్వీస్ లైఫ్ ముగిసింది. బ్యారేజ్‌ను రెండుసార్లు సందర్శించిన సీడబ్ల్యూసీ మరమ్మతులకు సిఫార్సు చేయడంతో ప్రభుత్వ కొత్త గేట్లను అమర్చేందుకు నిర్ణయం తీసుకుంది.

**.ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు..**

ఉదయం 10.25 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి 11 గంటలకు వేమగిరి గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్దకు చేరుకుంటారు. 11.25 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నూతన గేట్ల ఏర్పాటు పనులను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడి నుంచి ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామానికి 11.45 గంటలకు చేరుకుని రైతులతో సమావేశమవుతారు. సుమారు గంట పాటు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలిస్తారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 05.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు సందర్శన ముగించుకుని అమరావతికి చేరుకుంటారు.

## చిలకలూరిపేట వద్ద రోడ్డు ప్రమాదం: తప్పిన ప్రాణాపాయం



చిలకలూరిపేట, జూలై 11, ప్రభాతవార్త: చిలకలూరిపేట సమీపంలోని పసుమర్తి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. హైదరాబాద్ నుంచి వస్తున్న కారును, ఎదురుగా అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు

## ఓటర్ల జాబితా సవరణపై అపోహలు వద్దు: చిలకలూరిపేట కాంగ్రెస్ ఇంచార్జి రాధాకృష్ణ

చిలకలూరిపేట, జూలై 11, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఖిస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ఖి (ఖీఖి) కార్యక్రమంపై ప్రజల్లో నెలకొన్న అపోహలు, ఆందోళనలను తొలగించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఈ. రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ ప్రక్రియపై పలు కీలక సందేహాలను లేవనెత్తారు. రాధాకృష్ణ వ్యక్తం చేసిన ప్రధాన అంశాలు:అపారమైన ప్రజాధనం: ఈ ఖీఖి ప్రక్రియ కోసం దేశవ్యాప్తంగా సుమారు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది ప్రజల సొమ్మని ఆయన గుర్తుచేశారు. ఆధార్ అనుసంధానంపై సందేహాలు గతంలో సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ కార్యకలాపాలకు ఆధార్‌ను అనుసంధానం చేయడం ప్రాధాన్యతగా ఉండేది. ఇప్పుడు ఓటు హక్కుకు కూడా ఆధార్‌ను తప్పనిసరి చేయడంతో, ఓటరు ఒకే చోట ఓటు వేసే అవకాశం ఉండగా, మిగిలిన చోట్ల ఓటు హక్కు కోల్పోతారనే భయం ప్రజల్లో ఉందని ఆయన చెప్పారు.



**ఓటర్ల తొలగింపు భయం:** దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 99 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటివరకు 70 కోట్లు మాత్రమే ఆధార్‌తో అనుసంధానం అయ్యాయని, మిగిలిన 29 కోట్ల మంది తమ ఓటు హక్కును కోల్పోతామేమోనని ఆందోళన చెందుతున్నారని రాధాకృష్ణ పేర్కొన్నారు. సామాజిక వర్గాల ఆందోళన: కొన్ని సామాజిక వర్గాల ఓట్లు కావాలనే తొలగిస్తున్నారనే ఆందోళన ప్రజల్లో ఉందని, ఇటీవల బిహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోవడం దీనికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. నివాస మార్పులు: సొంత ఇల్లు లేక అద్దె గృహాల్లో ఉండేవారు తరచూ నివాసాలు మారడం వల్ల, వారి ఓటు ఏ డోర్ నంబర్ మీద ఉందో తెలియక ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## డ్రగ్స్ వద్దు ....భవిష్యత్తు కావాలి... పోస్టర్ ఆవిష్కరణ



చిలకలూరిపేట, జూలై 11, ప్రభాతవార్త: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ( దీస్త్రీ ) భారత విద్యార్థి ఫెడరేషన్ ( శీసీ ) సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న డ్రగ్స్ వద్దు భవిష్యత్తు కావాలి అనే ప్రోగ్రాం లో భాగంగా ఈరోజు చిలలూరిపేట నారాయణ కాలేజీ యాజమాన్యాన్ని కలిసి పోస్టర్ ఆవిష్కరించటం జరిగింది. ఈ సందర్భంగా ప్రిసిపల్ గారు బాలకృష్ణ మాట్లాడుతూ మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకత్వాన్ని అభినందించారు. యువజన సంఘ చిలకలూరిపేట నాయకులు సిద్దు మాట్లాడుతూ త్వరలో కాలేజీ విధార్థులకు నారాయణ కాలేజీలో డ్రగ్స్ వాడకం పై అవగాహనా సదస్సు నిర్వహిస్తామని అన్నారు అలాగే సహకరించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలపటం జరిగింది.

## పేట ప్రజలకు మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు విజ్ఞప్తి: తప్పనిసరి అయిన నీటి పొదుపు



చిలకలూరిపేట, జూలై 11, ప్రభాతవార్త: ఎల్ నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో రుతుపవనాలు విఫలమయ్యాయని, దీని కారణంగా నాగార్జున సాగర్, శ్రీశైలం, తుంగభద్ర వంటి ప్రాజెక్టులలో నీటి మట్టాలు ఏమాత్రం పెరగలేదని చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు తెలిపారు. నాగార్జున సాగర్ నిండితేనే కుడి కాలువ ద్వారా చిలకలూరిపేట పట్టణంలోని ఎస్.ఎస్ ట్యాంకులకు త్రాగునీరు సరఫరా అవుతుందని ఆయన వివరించారు. అయితే, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రాజెక్టుల్లోకి నీరు రాలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ చెరువుల్లో ఉన్న నీటి నిల్వలు కేవలం మూడు నెలలకు మాత్రమే సరిపోతాయని కమిషనర్ వెల్లడించారు. ఈ మూడు నెలల తర్వాత కూడా వర్షాలు పడకపోతే, మనకు వేరే ప్రత్యామ్నాయ నీటి వనరులు లేనందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున, పట్టణ ప్రజలందరూ పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## క్యాట్ ఫిష్ ను పెంపకం చేస్తున్న వ్యక్తులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి: శ్రీను నాయక్



చిలకలూరిపేట, జూలై 11, ప్రభాతవార్త:భారత ప్రభుత్వం నిషేధించిన క్యాట్ ఫిష్ పెంపకం చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి శివార్లలో వ్యవసాయ భూములను తవ్వేసి సుమారు 8 భారీ చెరువులు ఏర్పాటు చేసి యధేచ్చగా ప్రమాదకరమైన క్యాట్ ఫిష్‌లను పెంచుతూన్నారు. దీనిపైన జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని (సిపిఐ)గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ క్యాట్ ఫిష్ కు మేతగా కుళ్ళిన కోళ్లు, వ్యర్థాలు, జంతు కళేబరాలు పెడుతున్నారు. ఈ క్యాట్ ఫిష్ పెంపకం వల్ల జరిగే అనర్థాలను గుర్తించిన భారత ప్రభుత్వం దీనిపై ఎప్పుడో ఉక్కుపాదం మోపిందన్నారు. ఈ చేపలను తింటే మనుషులకు జీర్ణవ్యవస్థ పూర్తిగా నాశనమై, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదమని ఆరోగ్యశాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి దీని వెనుకాల ఎవరున్నారో తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనధికారికంగా తవ్విన చెరువులను పూడ్చివేసి ప్రజల ఆరోగ్యాలను అధికారులు కాపాడాలన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 23,276 కేసులు పరిష్కారం

### రాజీ కేసుల్లో కక్షిదారులకు 101 కోట్ల పరిహారం

గుంటూరు లీగల్, జులై 11,ప్రభాతవార్త,: ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన లోక్ అదాలత్ సంచలనం రేకెత్తించింది. లోకదాలతో రాజీలు ఇప్పటికీ కొనసాగుతుండగా, రాత్రి 9 గంటల వరకు అందిన సమాచారం మేరకు 23,276 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ చక్రవర్తి జిల్లా కోర్ట్




ప్రాంగణం నుండి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 48 బెంచిలు ఏర్పాటు కాగా, జిల్లా కోర్ట్ ప్రాంగణంలో 17 బెంచిలను నిర్వహించారు. ఇప్పటివరకు 1649 సివిల్ కేసులు, 21599 క్రిమినల్ కేసులు, 36 ముందస్తు వివాదాల కేసులను పరిష్కరించారు. పరిష్కరించిన మోటారు వాహన ప్రమాద భీమా కేసులు , చెక్ బౌన్స్ కేసులలో మొత్తం రూ.1,01,03,74,107 లను కక్షిదారులకు అందించారు.

# సిఎం సర్! నన్ను కాపాడండి

### తనపై 27 కేసులున్నాయని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన

### అనంతలో టీడీపీ కార్యకర్త కన్నీటి ఆవేదన

**అనంతపురం క్రైమ్ జులై 11 ప్రభాతవార్త :** సీఎం చంద్రబాబు నాయుడు సార్, మంత్రి లోకేష్ సార్, నన్ను కాపాడండి.. 2019 నుండి 2024 వరకు నాపై 27 కేసులు నమో దయ్యాయి. ఈ ఐదేళ్లలో నేను జైలు జీవితాన్ని అనుభ వించాను. నా భార్య బిడ్డలు కూడా నన్ను చీదరించు కుంటున్నారు. నా జీవితం నాశనమైపోయిం దంటూ అనంపురం జిల్లా అనంతపురం నగరంలోని ఓ టిడిపి కార్యకర్త రఫీ ఆక్రందన చేశాడు. నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయంప్రధాన ద్వారంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశాడు. అక్కడే వున్న టీడీపీ జెండా చేతబూని తనకు న్యాయం చేయాలంటూ కన్నీటి పర్యంతం అయ్యాడు. 27 కేసుల్లో జైలు జీవితం అనుభవించి భార్య బిడ్డలకు దూరమయ్యాయనంటూ ఎన్టీఆర్ విగ్రహం ముందు తన నిరసన గళాన్ని విప్పాడు.

12-07pg10_12-07pg10.qxd 11/Jul/26 11:56 PM Page 1






స్పెయిన్‌కు రెండో గోల్ అందించిన మైఖేల్ మెరినో

# బెల్జియంపై గెలుపుతో సెమీస్‌లో స్పెయిన్

**లాస్‌ఏంజిల్స్, జులై 11:** యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్... ఫిఫా వరల్డ్ కప్‌లో మరోసారి ఆధిపత్యాన్ని చెలాయించింది. సెమీస్ బెర్త్ అందుకుంది. లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో బెల్జియంపై 2-1 గోల్స్ తేడాతో స్పెయిన్ విజయం సాధించింది. 88వ నిమిషంలో బెల్జియం గోల్ కీపర్ సెన్నె లామెన్స్ చేసిన చిన్న పొరపాటును అందిపుచ్చుకున్న స్పెయిన్ ఆటగాడు మెరినో... బంతిని నెట్‌లోకి పంపి స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. రెండోసారి సాకర్ వరల్డ్‌కప్ సెమీఫైనల్లో చేర్చాడు.

ఈ సాకర్ వరల్డ్‌కప్‌లో స్పెయిన్ అద్భుతమైన ఆట తీరు కొనసాగిస్తోంది. బెల్జియం కఠినమైన డిఫెన్స్‌తో అడ్డుకుంటున్నా, స్పెయిన్ ఆటగాళ్లు ఎక్కడా తొందర పాటు ప్రదర్శించలేదు. తమ సహజసిద్ధమైన పాసింగ్ గేమ్‌ను విడిచిపెట్టకుండా, గోల్ చేయడానికి సరైన అవ కాశం వచ్చేంతవరకు ఓపికగా వేచి చూశారు. చివరికి వారు నమ్మిన వ్యూహమే వారిని గెలిపించింది. ఈ విజ యంతో స్పెయిన్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వరుసగా 36 మ్యాచ్‌ల పాటు అజేయంగా నిలిచి సరికొత్త ప్రపం చ రికార్డును నెలకొల్పింది.

**కీలకంగా మారిన యమాల్**

18 ఏళ్ల యువ సంచలనం లామిన్ యమాల్ హైలైట్‌గా నిలిచాడు. తొలి అర్ధభాగమంతా బెల్జియం డిఫెం డర్లను యమాల్ ముప్పుతిప్పలు పెట్టాడు. కుడి వైపు నుంచి పెడ్రో పోర్రోతో కలిసి దాడులు చేయడం... డిఫెం డర్లను చేధించుకుంటూ బాక్స్ వైపు దూసుకెళ్ల డం ద్వారా బెల్జియంపై తీవ్ర ఒత్తిడి పెంచాడు.30వ నిమిషంలో స్పెయిన్ సాధించిన తొలి గోల్‌లో యమాల్ చక్కని అసిస్ట్ ఉంది. అతని వైపు నుంచే ప్రారంభమైన దాడిని పెడ్రో పోర్రో లోకాగూ మార్గంగా, దాని ఓల్మో దాన్ని గోల్ చేయడానికి ప్రయత్నించాడు. బెల్జియం గోల్ కీపర్ కోర్టియోస్ తాకి రిబౌండ్ అయిన బంతిని రూయిజ్ అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపా డు. దీంతో స్పెయిన్ 1-0ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే మరో 11 నిమిషాలకే డార్గెన్ కెబెలెరో గోల్ చేసి బెల్జియంను 1-1తో సమఉజ్జీగా నిలిపాడు.

**బెల్జియంకు శాపంగా గోల్ కీపర్ తప్పిదం**

స్పెయిన్ దూకుడును తట్టుకుని బెల్జియం మ్యాచ్‌లో యమాల్, మైకెల్ ఓయర్‌జబల్, దాని ఓల్మోలు కొట్టిన ప్రమాదకరమైన షాట్లను స్పెయిన్ గోల్‌కీపర్ టిబో కోర్టి యోస్ అద్భుతమైన డైవ్‌లతో అడ్డుకున్నాడు. రెండో అర్ధ భాగం డ్రింక్స్ బ్రేక్‌కు ముందు కోర్టియోస్ తొడ గాయం తో మైదానం వీడాడు. కోర్టియోస్ స్థానంలో మైదానం లోకి వచ్చిన సెన్నె లామెన్స్ ఒత్తిడిని తట్టుకోలేకపో యాడు. 88వ నిమిషంలో స్పెయిన్ డిఫెండర్ పౌ కుబార్సీ కొట్టిన సాధారణ షాట్ లామెన్స్ ముందు విచిత్రంగా బౌన్స్ అయింది. దాన్ని సరిగ్గా నియంత్రించ లేకపోయిన లామెన్స్ బంతిని సిక్స్ యార్డ్ బాక్స్ వైపు పుష్ చేశాడు. అక్కడ అలర్ట్‌గా ఉన్న స్పెయిన్ సబ్‌స్టిట్యూట్ మైఖేల్ మెరినో మెరుపు వేగంతో బంతిని నెట్‌లోకి పంపాడు.ఈఒక్క పొరపాటు బెల్జియం ప్రపం చకప్ కలలను కల్లలు చేసింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత స్పెయిన్ జట్టు మళ్లీ సెమీఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. సెమీస్‌లో స్పెయిన్‌కు అసలైన పరీక్ష ఎదురుకానుంది. మంగళవారం ఆర్లింగ్టన్‌లో జరిగే సెమీఫైనల్లో ఫ్రాన్స్‌తో తలపడనుంది.

# మెస్సీ మాయాజాలమా.. స్విస్ సంచలనమా?



## నేటి క్వార్టర్ ఫైనల్లో అర్జెంటీనా-స్విట్జర్లాండ్ అమీతుమీ
## ఉదయం 6.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం

**కాన్సాస్‌సిటీ, జులై 11:** ఫిఫా ప్రపంచకప్ సెమీస్ స్టేజ్‌కు చేరుకుంటోంది. ఇప్పటికే మూడు క్వార్టర్ ఫైనల్స్ ముగి శాయి. మూడు సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. చివరి క్వార్టర్ ఫైనల్ ఈ రోజు కాన్సాస్‌సిటీ స్టేడియంలో జరగనుంది. ఫిఫా కప్ వేటలో ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా.. పోరా ట పటిమకు ప్రతీకగా నిలిచిన స్విట్జర్లాండ్‌తో క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది.ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ పోరులో విజేత సెమీఫైనల్‌లో అడుగుపెడుతుంది. ఒకవైపు లియోనెల్ మెస్సీ అనుభవం, అర్జెంటీనా దూకుడు... మరోవైపు స్విట్జర్లాండ్ క్రమశిక్షణ, సమిష్టి ఆట. దీంతో ఈ మ్యాచ్ టోర్నీలో అత్యంత ఉత్కంఠభ రిత పోరుగా మారనుంది.

**అపజయం లేకుండా మెస్సీ టీమ్**

అర్జెంటీనా ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచింది. గ్రూప్ దశలో ఆధిపత్యం చాటిన ఆ జట్టు, నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ ఒత్తిడిని అధిగమిస్తూ ముందు కు సాగింది. లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా ఈ టోర్నీలో ఇప్పటివరకు అపజయం ఎరుగకుండా కొనసాగు తోంది. నాకౌట్ దశలో కేప్ వెర్డే, ఈజిప్ట్‌లపై కష్టపడి నెగ్గిన అర్జెంటీనా ఇప్పుడు మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. అర్జెంటీనా విజయాల్లో కెప్టెన్ లియోనెల్ మెస్సీ కీలక పాత్ర పోషిస్తున్నాడు. బంతి అతని కాళ్ల వద్ద ఉంటే ప్రత్యర్థి రక్షణలో అలజడి చెలరే గడం సహజం. గోల్స్ చేయడమే కాకుండా సహచర ఆటగాళ్లకు అవకాశాలు సృష్టించడంలోనూ మెస్సీ తన ప్రత్యేకతను మరోసారి చాటుతున్నాడు. అతనికి తోడుగా మార్టినెజ్, జూలియన్ అల్వారెజ్, ఎంజో ఫెర్నాండెజ్, అలెక్సిస్ మెక్ అలిస్టర్ వంటి ఆటగాళ్ల అద్భుత సమన్వయంతో జట్టును ముందుకు నడిపి స్తున్నారు. అర్జెంటీనా బలం కేవలం స్టార్ ఆటగాళ్లే కాదు. మిడ్‌ఫీల్డ్‌లో బంతిపై ఆధిపత్యం సాధించడం, వేగంగా దాడు లు నిర్మించడం, అవసరమైన సమయంలో ఆట వేగాన్ని నియంత్రించడం ఆ జట్టు ప్రత్యేకత.

**పటిష్ట డిఫెన్స్‌తో స్విటర్లాండ్**

మరోవైపు స్విట్జర్లాండ్‌ను తక్కువ అంచనా వేయడం ప్రమా దకరం. ప్రపంచ ఫుట్‌బాల్‌లో భారీ జట్లను ఇబ్బంది పెట్టిన చరిత్ర ఆ జట్టుకు ఉంది. ఈటోర్నీలోనూ సమిష్టి ఆటతో క్వార్టర్ ఫైనల్‌కు వచ్చింది. నాకౌట్‌లో అల్జీరియాపై పూర్తి ఆధి పత్యం ప్రదర్శించిన స్విస్ జట్టు. ప్రిక్వార్టర్ ఫైనల్లో కొలం బియాపై పెనాల్టీ షూటౌట్‌లో అద్భుత మానసిక ధైర్యాన్ని ప్రదర్శించింది. స్విస్ కెప్టెన్ గ్రానిట్ షాకా మిడ్‌ఫీల్డ్‌లో జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. ఆటను నియంత్రించడం, ప్రత్యర్థి దాడులను అడ్డుకోవడం, వేగంగా కౌంటర్ అటాక్స్ ప్రారంభిం చడం అతని ప్రత్యేకత. ప్రత్యర్థికి అవకాశాలు ఇవ్వకుం డా మ్యాచ్‌ను నియంత్రణలో ఉంచడం స్విస్ ఆటగాళ్ల నిపుణులు.

**మెస్సీ పైనే అందరి చూపు**

ఈ మ్యాచ్‌లో ప్రధానంగా అందరి దృష్టి మెస్సీ పైనే ఉంటుం ది. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అతని అనుభవం అర్జెంటీ నాకు అతిపెద్ద బలం. కీలక సమయాల్లో మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థం అతనికి ఉంది.అయితే మెస్సీని అడ్డుకునేం దుకు స్విట్జర్లాండ్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్క ఆట గాడితో కాకుండా సమిష్టిగా ఒత్తిడి తీసుకొచ్చి అతనికి ఖాళీలు ఇవ్వకుండా చూడాలని స్విస్ జట్టు భావిస్తోంది. మ్యాచ్ ఫలి తాన్ని నిర్ణయించడంలో మిడ్‌ఫీల్డ్ పోరు కీలకం కానుంది. బంతిపై ఆధిపత్యం సాధించిన జట్టుకే ఎక్కువ అవకాశాలు లభించే అవకాశం ఉంది. అలాగే సెట్‌పీస్‌లు, కార్నర్లు, ఫ్రీకిక్స్ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం కూడా విజయంలో కీలక పాత్ర పోషించవచ్చు. మెస్సీ మరో సారి తన మాయాజాలంతో అర్జెంటీనాను సెమీఫైనల్‌కు చేర్చు తాడా? లేక స్విట్జర్లాండ్ మరో సంచలన విజయంతో ప్రపంచా న్ని ఆశ్చర్యపరుస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది.

# వింబుల్డన్ ట్రోఫీ నెగ్గిన నోస్కోవా



**లండన్, జులై 11:** అన్‌సీడెడ్ చెకొస్లోవేకియా ప్లేయర్ లిండా నోస్కో వా సంచలనం కొనసాగింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో చెకొస్లోవేకియాకు చెందిన 8వ సీడ్ కరోలినా ముచోవాపై మూడు సెట్ల పోరులో 6-2, 5-7, 6-3తో ఓడించింది.ఫైనల్ చేరిన తొలి సారే వింబుల్డన్ ట్రోఫీ అందుకుంది. కాగా రెండోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరినా ముచోవా ట్రోఫీ ఆశలు కల్లలయ్యాయి. తొలి సెట్‌ను అలవోక గా నెగ్గిన నోస్కోవాకు రెండో సెట్‌లో ముచోవా పుంజుకుని గట్టి పోటీ ఇచ్చింది. సెట్‌ను నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో నోస్కోవా.. ప్రత్యర్థి సర్వీసును రెండు సార్లు బ్రేక్ చేసి 6-3తో సెట్‌ను, గేమ్‌ను ముగించింది. 2024 ఆస్ట్రేలియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ వరకు వచ్చిన నోస్కోవా... ఈ సారి ఏకంగా వింబుల్డన్ ట్రోఫీ పట్టేసింది.

# టీ20 సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్



**సౌథాంప్టన్, జులై 11:** టీ20 ప్రపంచ ఛాంపియన్లు టీమిండియా.. వరుసగా రెండో సిరీస్ కోల్పోయింది. అయిదో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 56 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి అయిదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-0తో క్లీన్ స్వీప్ చేసింది. 258 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఈ మ్యాచ్‌లోనూ తడబడింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు మాత్ర మే చేయగలిగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(3) నిరాశపరచగా, వైభవ్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన సంజూ కూడా 27 రన్స్ చేసి అవుటయ్యాడు. ఇషాన్ కిషన్(35 బంతుల్లో 56), తిలక్ వర్మ(25 బంతుల్లో 53) అర్ధసెంచరీలతో రాణించారు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 28 రన్స్, శివమ్ దూబే 14 రన్స్ చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో కుర్రాన్ 3 వికెట్లు, అదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టాడు.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 257 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫిల్ సాల్ట్(6)ను ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. జోస్ బట్లర్(64 బంతుల్లో 131), కెప్టెన్ హారీ బ్రూక్స్(45 బంతుల్లో 95 నాటౌట్) చెలరేగి ఆడారు. సిక్స్‌లు, ఫోర్ల వర్షం కురిపించారు. రెండో వికెట్‌కు రికార్డు స్థాయిలో 233 రన్స్ జోడించారు.భారత బౌలర్లలో దూబే రెండు వికెట్లు తీశాడు.

# ఫెడ్‌రిజర్వులో భారత సంతతి ప్రముఖులు!

**వాషింగ్టన్,జులై 11:**అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) ఛైర్మన్ కెవిన్‌వార్ష్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన (మానిటరీ పాలసీ)వ్యవస్థను సమీక్షించి, కీలక సంస్కరణలను సూచించేందుకు ఏర్పాటు చేసిన ఐదు టాస్క్‌ఫోర్స్ ప్రముఖుల పేర్లను ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లలో అకడమిక్ నిపుణులు, మాజీ కేంద్ర బ్యాంకు గవర్నర్లు, కార్పొరేట్ రంగ ప్రముఖులతో పాటు భారత సంతతికి చెందిన ముగ్గురు ప్రముఖులకు కీలక బాధ్యతలు అప్పగించారు. మాజీ ఆర్‌బీఐ గవ ర్నర్ రఘురామ్ రాజన్, హార్వర్డ్ విశ్వవిద్యా లయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ రాజ్ చెట్టి, మైక్రో సాఫ్ట్ ఎక్స్‌బాక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశా శర్మ ఈజాబితాలో ఉన్నారు. టాస్క్‌ఫోర్స్ ల నాయకత్వాన్ని ప్రకటిస్తూ కెవిన్ వార్ష్, "ప్రస్తుత కీలక సమయంలో ఫెడరల్ రిజర్వ్ తన లక్ష్యాలను మరింత సమర్థంగా సాధించేలా సంస్థను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం" అని తెలిపారు.

భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్, కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు రఘురామ్ రాజన్‌కు "బ్యాలెన్స్ షీట్ పాలసీ" టాస్క్‌ఫోర్స్‌కు సహనాయకత్వ బాధ్యతలు అప్పగించారు. ఫెడరల్ రిజర్వ్ అమ లు చేస్తున్న ప్రస్తుత బ్యాలెన్స్ షీట్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు,వ్యయాలు,సంస్థాగత ప్రభా వాలను ఈ బృందం సమగ్రంగా పరిశీలించి మార్పులపై సిఫార్సులు చేయనుంది. ప్రస్తుతం చికాగో విశ్వవిద్యాలయం బూత్ స్కూల్ ఆఫ్ బిజి నెస్‌లో కేథరిన్ దుసాక్ మిల్లర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్, 2005లో జాక్సన్ హోల్‌లో జరిగిన ఫెడరల్ రిజర్వ్ సమా వేశంలో అమెరికా బ్యాంకుల సబ్‌ప్రైమ్ రుణాల ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుపొందారు.అనంతరం 2008 లో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి సంబంధించిన ఆయన హెచ్చరికలు నిజమయ్యా యి.భారత సంతతి ఆర్థికవేత్త రాజ్ చెట్టిని "లిక్వి డిటీ డిపెండెన్స్"ప్యానెల్‌కు ఎంపిక చేశారు.హార్వ ర్డ్ యూనివర్సిటీలోని "ఆపర్చునిటీ ఇన్‌సైట్స్" సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న చెట్టి, వెనుకబడిన వర్గా లకు చెందిన పిల్లలు జీవితంలో విజయవంతం కావడానికి అవసరమైన విధానాలపై పరిశోధనలు చేస్తున్నారు. హార్వర్డ్ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ జెరెమీ స్టెయిన్, వాల్‌మార్ట్ మాజీ అధ్యక్షుడు, సీఈఓ డగ్ మెక్‌మిలన్, చికాగో విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ కెవిన్ మర్ఫీతో కలిసి ఫెడరల్ రిజర్వ్ ప్రస్తుత బ్యాలెన్స్ షీట్ విధానం ప్రభావా లను ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. మైక్రో సాఫ్ట్ గేమింగ్ విభాగం ఎక్స్‌బాక్స్ చీఫ్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్‌గా ఉన్న భారత సంతతి ఆశా శర్మ కు "ప్రొడక్టివిటీ అండ్ ఎంప్లాయ్‌మెంట్" టాస్క్







ఫోర్స్ నాయకత్వం అప్పగించారు.ఇటీవల మైక్రో సాఫ్ట్ గేమింగ్ విభాగంలో భారీ స్థాయిలో ఉద్యో గుల తొలగింపులు జరిగిన నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.భార త సంతతి అమెరికన్ ఆశా.. మెటా, ఈకామర్స్ సంస్థ కూపాంగ్, గ్రోసరీ డెలివరీ సంస్థ ఇన్‌సా కార్ట్,హోమ్ ఇంప్రూవ్‌మెంట్ సంస్థ హోమ్ డిపో వంటి కంపెనీల్లో కీలకబాధ్యతలు నిర్వహించా రు. ఈటాస్క్ ఫోర్స్‌లో హోరోవిట్జ్ సహ వ్యవ స్థాపకుడు మార్క్ ఆండ్రీసెన్, స్టాన్‌ఫోర్డ్ విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ చార్లెస్ "చాడ్" జోన్స్ సహఅధ్యక్షులుగా వ్యవహరించనున్నారు.

# 1.7 కోట్లకు పైగా ఐటి రిటర్నులు దాఖలు



**ముంబయి,జులై 11:**ఆర్థిక సంవత్సరానికి సం బంధించిన అసెస్‌మెంట్ ఇయర్ 2026-27 కోసం ఇప్పటివరకు 1.7 కోట్లకు (17 మిలియన్ల) పైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ శనివారం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంపాదించిన ఆదాయానికి సంబంధించిన ఐటీఆర్1 సహజ్, ఐటీఆర్2 రిటర్నులు దాఖలు చేయడానికి జూలై 31చివరితేదీ అని శాఖ మరోసారి గుర్తు చేసింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ, అసెస్‌మెం ట్ సంవత్సరం 2026-27 కోసం ఇప్పటికే 1.7 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు తమ ఐటీ ఆర్‌లను దాఖలు చేసి ముందడుగు వేశారు" అని పేర్కొంది.ఇప్పటివరకు దాఖలైన రిటర్నుల్లో శుక్ర వారం ఒక్కరోజే 10 లక్షలకు పైగా ఐటీఆర్‌లు దాఖలుచేసినట్లు వెల్లడించింది.ఐటీఆర్1 (సహజ్) చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారుల కోసం రూపొందించిన సరళమైన రిటర్న్ ఫారమ్. ఏటా రూ.50 లక్షల వరకు ఆదాయం కలిగిన నివాస భారతీయ వ్యక్తులు, జీతం ద్వారా ఆదాయం పొందేవారు, ఒకే ఒక్క గృహ ఆస్తి నుంచి ఆదా యం ఉన్నవారు, అలాగే వ్యవసాయ ఆదాయం సంవత్సరానికి రూ.5,000 వరకు ఉన్నవారు ఈ ఫారమ్‌ను ఉపయోగించి రిటర్నులు దాఖలు చేయవచ్చు.ఇక ఐటీఆర్2ను వ్యాపారం లేదా వృత్తి ద్వారా లాభాలు, ఆదాయం లేని వ్యక్తులు మరియు హిందూ అవిభక్త కుటుంబాలు దాఖ లు చేస్తారు. అయితే, వీరికి మూలధన లాభాల ఆదాయం ఉన్నప్పుడు ఈఫారమ్ వర్తిస్తుంది.




# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు తొమ్మిది నోటీసులు

**న్యూఢిల్లీ, జులై 11:**దేశ ఆహార భద్రత నియం త్రణ సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారి టీ ఆఫ్ ఇండియా శనివారం స్విగ్గీ ఇన్‌స్టామా ర్ట్‌కు 9నోటీసులు జారీ చేసింది. కస్టమర్లనుంచి వచ్చిన పలుమార్లు ఫిర్యాదుల ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 నిబంధ నల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించిన ఎఫ్ఎస్ ఎస్ఏఐ, ఈ చర్యలు చేపట్టింది. వినియోగదా రులకు గడువు ముగిసిన,పాడైన, కుళ్లిపోయిన, కలుషితమైన, మానవ వినియోగానికి అనర్హమై న ఆహార ఉత్పత్తులు సరఫరా చేసినట్లు ఫిర్యా దులు అందిన నేపథ్యంలో, సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ సమగ్ర వివరణతో పాటు నిబంధనల అమలుపై నివేదిక సమర్పించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది.నిర్దేశిత గడువులో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించింది. విక్రయించిన గుడ్లు, సంస్థకు ఉన్న ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌లో అను మతి పొందిన ఉత్పత్తుల జాబితాలో లేకపోయి నప్పటికీ మార్కెటింగ్ చేసినట్లు గుర్తించింది. చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌లో ఆ ఉత్పత్తి చేర్చే వరకు విక్రయాలు నిలిపివేయాలని,అవసరమైతే లైసెన్స్ సవరణకు దరఖాస్తు చేయాలని ఆదేశిం చింది. (1 కిలో) మరియు హోంస్టైల్ మద్రాస్ మిక్చర్ పీనట్స్ ఉత్పత్తులు గడువు ముగిసిన తర్వాత కూడా వినియోగదారులకు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. గడువు ముగి సిన, కుళ్లిపోయిన, దుర్వాసన వెదజల్లుతున్న, కలుషితమైన గుడ్లు సరఫరా చేసినట్లు ఆరో పణలు నమోదయ్యాయి.

# వచ్చే రెండేళ్లలో 210 కంపెనీల ఐపిఒలు

**ముంబయి,జులై 11:**భారత స్టాక్ మార్కెట్లకు వచ్చే రెండేళ్లో టాప్‌కంపెనీలు మార్కెట్లోకి ఐపీఓ ద్వారా ఎంట్రీ ఇవ్వనున్నాయి. కన్సల్టింగ్ సంస్థ రెడ్సీర్ అంచనా ప్రకారం వచ్చే రెండేళ్లలో సుమా రు 210 కొత్త కంపెనీలు ఐపిఒలకు రెడీ అవుతు న్నాయి. కొత్త తరం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ జూలైలో ఉన్న 150 బిలియన్ డాలర్ల నుండి 2030 నాటికి 1 ట్రిలియన్ డాల ర్లకు పెరుగుతుందని తెలిపింది. వచ్చే దశాబ్దం చివరి నాటికి కొత్త లిస్టింగ్‌ల వల్ల భారతదేశ ఈక్విటీ మార్కెట్లో కొత్త తరం కంపెనీల వాటా 3 శాతం నుండి 11.5 శాతానికి పెరుగుతుందని ఆ సంస్థ ఒక నివేదికలో అంచనా వేసింది. దీని తో ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై సమీకరించిన నిధుల విషయంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మూడవ స్థానంలోను, వృద్ధి రేటు విషయంలో మొదటి స్థానంలో నిలుస్తుంది. గతంలో ఐపీఓ




మార్కెట్ అటువంటి కొత్త తరం కంపెనీల వృద్ధికి ప్రతిఫలమిచ్చిందని కానీ ఇప్పుడు అది లాభదా యకమైన వృద్ధిని కోరుకుంటోందని, లిస్టింగ్ అయిన 20 కంపెనీలలో 14 లాభదాయకంగా ఉన్నాయి. వారి ఐపీఓల ధరలను, గత ప్రైవేట్ రౌండ్ల ఆధారంగా కాకుండా.. అదే తరహా లిస్టెడ్ కంపెనీల ఆధారంగా నిర్ణయిస్తున్నారు.

దీనివల్ల, లిస్టింగ్ సమయంలో ఒక కంపెనీ చేసుకునే సన్నాహాలు.. భవిష్యత్ రాబడులను మరింత మెరుగ్గా అంచనా వేయడానికి వీలవు తుందని నివేదిక తెలిపింది గత ఏడాది మొత్తం కంటే 2026 క్యాలెండర్ సంవత్సరం ద్వితీయా ర్థంలోనే ఎక్కువ నిధులు సమీకరించబడతాయని కేవలం ఆరు నెలల్లోనే 19 నుంచి 22 బిలియన్ డాలర్లు సేకరిస్తాయని నివేదిక అంచనా వేస్తోంది. 200కుపైగా కంపెనీలు పబ్లిక్ మార్కెట్లలో నిధు లు సమీకరించడానికి సిద్ధమవుతుండగా వాటిలో 150కి పైగా కంపెనీలు మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన సెబీ నుండి ఇప్పటికే ఆమోదం పొందాయి.దశాబ్దంలో భారత్‌లోని ప్రధాన ప్లాట్ఫారమ్లపై ఐపీఓలు 8 రెట్లు పెరిగాయని.. ఇందులో ఐదేళ్లలో 300కి పైగా కొత్త లిస్టింగ్లు కూడా ఉన్నాయని నివేదిక పేర్కొంది. బలమైన దేశీయ మూలధనం,అధిక కార్పొరేట్ ఆదాయా లు, మెరుగైన నిష్క్రమణ అవకాశాలు, అనుకూల మైన నియంత్రణ వంటివి ఈ వృద్ధికి తోడ్పడ్డా యని కన్సల్టింగ్‌సంస్థ రెడ్సీర్ నివేదిక తెలిపింది.

# డీమార్ట్ నికరలాభం రూ.936 కోట్లు




**ముంబై,జులై11:** డీమార్ట్ నిర్వహణ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ తొలి త్రైమా సికంలో నికరలాభం వార్షిక ప్రాతిపదికన12.8 శాతం పెరిగి 936కోట్లకు చేరినట్లు ప్రకటిం చింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసి కంలో కంపెనీ రూ.830 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ విశ్లేషకులు రూ.964 కోట్ల లాభాన్ని అంచనా వేయగా, కంపెనీ ఫలితాలు దానికి స్వల్పంగా తక్కువగా నమోదయ్యాయి.కంపెనీరాబడులు కూడా 15.1శాతం పెరిగి రూ.18,343 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ ఆదాయం రూ.15,932 కోట్లుగా ఉంది. కంపెనీ విస్తరణతో పాటు వినియోగదారుల కొనుగోళ్లు పెరగడం ఆదాయ వృద్ధికి దోహదపడినట్లు తెలిపింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు లాభం 16.2 శాతం పెరిగి రూ.1,526 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.1,313 కోట్లుగా నమోదైంది.

మార్కెట్ అంచనా రూ.1,517 కోట్లుగా ఉండగా, కంపెనీ దానిని స్వల్పంగా అధిగమించింది.కంపెనీ ఎబిడిటా మార్జిన్ 8.2 శాతం నుంచి 8.3 శాతానికి స్వల్పంగా మెరుగుపడింది. కంపెనీ లైక్‌ఫర్‌లైక్ విక్రయాల వృద్ధి తొలి త్రైమాసికంలో 5.5 శాతంగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 7.1 శాతంగా ఉండటం గమనార్హం. ఈ త్రైమాసికంలో డీమార్ట్ స్టోర్లలో మొత్తం 11 కోట్ల బిల్లులు ప్రాసెస్ చేయగా, గత ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 9.7 కోట్లుగా ఉంది.అదనంగా, కంపెనీ రూ.1,000 కోట్ల వరకు నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు జారీ చేసి నిధులు సమీకరించేందుకు ఆమోదం తెలిపింది.

# 20వేల కోట్లకు పెరిగిన హిండాల్కో అల్యూమినా పెట్టుబడి




**ముంబయి,జులై 11:** ఆదిత్య బిర్లా గ్రూప్ ఒడిశాలో తన పెట్టుబడులను మరింత విస్తరించింది. రాయగడ జిల్లాలోని కన్సరిగూడలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీ ప్రాజెక్టు విస్తరణ కోసం అదనంగా రూ.12,000 కోట్ల పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది.ఈ ప్రతిపాదనపై శనివారం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీతో ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా సమావేశమై చర్చించారు. ఈ విస్తరణతో రిఫైనరీ సామర్థ్యం ప్రస్తుతం ప్రతిపాదించిన సంవత్సరానికి 10 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు పెరగనుంది. దీంతో ప్రాజెక్టులో మొత్తం పెట్టు బడి రూ.20 వేల కోట్లకు చేరనుంది.

ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన లోహ రంగ ప్రముఖ సంస్థ హిండాల్కో ఇండస్ట్రీస్ ఈ గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీని అభివృద్ధి చేస్తోంది. తొలుత ఈ ప్రాజెక్టును సంవత్సరానికి 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థంతో, సుమారు రూ.8,000 కోట్ల పెట్టుబడితో ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రాజెక్టు దీర్ఘకాలిక అవకాశాలను దృష్టిలో ఉంచు కుని సంస్థ ఇప్పుడు మరో రూ.12,000 కోట్ల పెట్టుబడితో అదనంగా సంవ త్సరానికి 20 లక్షల టన్నుల శుద్ధి సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని ప్రతి పాదించింది. ఈ విస్తరణ వల్ల ప్రత్యక్ష, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడటంతో పాటు స్థానిక పారిశ్రామికవేత్తలు, సేవల రంగ సంస్థలు, అనుబంధ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని కంపెనీ పేర్కొంది.అలాగే ఈ ప్రాజెక్టు విస్తరణతో ఒడిశాలో అల్యూమినియం డౌన్ స్ట్రీమ్ పరిశ్రమల అభివృద్ధికి ఊతం లభించనుంది. అల్యూమినియం విలువ ఆధారిత ఉత్పత్తుల శ్రేణిలో రాష్ట్రం మరింత వాటాను దక్కించుకునేందుకు ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14